మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం అంగీకారం తెలిపింది. 2026 ఆగస్టుకల్లా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పశ్చిమ ప్రకాశంలో కీలకమైన వైద్య కళాశాలను కూడా పూర్తిచేసేందుకు అడుగు ముందుకు వేసింది. రాజధానిలో గత గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం మెడికల్ కాలేజీని పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిరాదరణకు గురైన పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ఏస్థాయిలో దృష్టిసారించిందో వీటిని బట్టి తెలుస్తోంది. ఇప్పటి వరకూ కొంత మేర మాత్రమే పూర్తయిన మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఇక ఊపందుకోనున్నాయి.



అసంపూర్తిగా మార్కాపురం మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్

# అడుగు పడింది!

- మార్కాపురం మెడికల్ కాలేజీపై ప్రభుత్వం దృష్టి
- పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు కేబినెట్ ఆమోదం
- పశ్చిమ ప్రకాశానికి మరో మణిహారం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తికాని వైనం

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 16 మెడికల్ కాలేజీల పనులను 2022లో ప్రారంభించింది. అప్పటికే రాష్ట్రంలో 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్నాయి. కేంద్రం నుంచి సరైన అనుమతులు లేకపోయినా హడావుడిగా కాలేజీల నిర్మాణాలకు టెండర్లు పిలిచి అనుయాయులకు అప్పజెప్పారు. అందులో మార్కాపురం మెడికల్ కళాశాల ఒకటి. ఆర్భాటంగా అయితే ప్రారంభించారు కానీ నిధుల కేటాయింపులో మాత్రం వివక్ష చూపడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. దీన్ని బట్టి పశ్చిమ ప్రకాశంపై నాటి పాలకులకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది.

## కొన్ని ప్రారంభించనే లేదు

మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులకు సుమారు రూ.8కోట్లు కేటాయించినా కాంట్రాక్ట్ సంస్థ రూ.3కోట్ల మేర పనులు మాత్రమే చేసింది. ఇంకా అక్కడ రూ.5కోట్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మెడికల్ కాలేజీ వద్ద మొత్తం 28 రకాలైన నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. వైద్యశాలకు సంబంధించిన పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. కాలేజీకి సంబంధించిన పనులు మాత్రం కొంతమేర జరిగాయి. విద్యార్థుల హాస్టల్ భవనాల ప్రగతి అంతంతమాత్రంగానే ఉంది. మిగిలిన వాటిల్లో ఓ 15 విభాగాలకు చెందిన పనులు అసలు ప్రారంభించలేదు. మొత్తం మీద కొంత మేర మాత్రమే పనులు జరిగాయి. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మెడికల్ కళాశాలలపై దృష్టి సారించింది. వాటిని పీపీపీ పద్ధతిలో పూర్తిచేయాలని మంత్రివర్గ భేటీలో నిర్ణయం తీసుకుంది. త్వరలో ఆయా పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి.

## నాటి ప్రభుత్వ తాత్సారమే శాపం

మెడికల్ కాలేజీకి మార్కాపురం మండలం రాయవరం వద్ద అప్పటి వైసీపీ ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. మొత్తం రూ.475 కోట్లతో బోధనాసుపత్రిని నిర్మించాల్సి ఉంది. 2022లోనే అన్ని కాలేజీలకు ఆన్‌లైన్ ద్వారా శంకుస్థాపన చేసినా నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ 2023 ఫిబ్రవరిలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అదే సంవత్సరం ఇక్కడ పనులు ప్రారంభించింది. కానీ మొదటి నుంచి పనులు నత్తనడకనే సాగాయి. 2024-25 విద్యాసంవత్సరంలో తరగతులు నిర్వహించాలని యోచించి పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అప్పటికే ఉన్న 150 పడకలకు అదనంగా మరో 300 పడకలకు పెంచారు. ఆ పడకలు 2024 జూన్‌లో అందుబాటులోకి వచ్చాయి.

## పూర్తిస్థాయిలో వివక్ష

వాస్తవానికి పొరుగునే ఉన్న నంద్యాలలో ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీ ఉంది. అంతేకాక వైద్య సదుపాయాలు కూడా అక్కడ మెరుగ్గానే ఉంటాయి. అక్కడికి దగ్గరలోనే కర్నూలు ప్రభుత్వ వైద్యశాల కూడా ఉంది. కానీ మార్కాపురంతోపాటు ప్రారంభించిన నంద్యాల ప్రభుత్వ వైద్య కాలేజీ పనులను చురుగ్గా చేపట్టి పూర్తిచేసి తరగతులు ప్రారంభించారు. కనీసం వంద కిలోమీటర్ల దూరం వెళ్తేకాని మెరుగైన వైద్యం దొరకని మార్కాపురంపై మాత్రం పూర్తిస్థాయిలో వివక్ష చూపారు. 2024 జూన్‌లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు కాలేజీని పరిశీలించి అడ్మిషన్లు చేపట్టడం కుదరదని తేల్చి చెప్పింది. అదే సంవత్సరం నవంబరులో కాంట్రాక్ట్ సంస్థ కాలేజీ వద్ద నుంచి సామగ్రిని తరలించింది.



మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే కందుల, టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, సబ్ కలెక్టర్ త్రివినాగ్

## మెడికల్ కాలేజీపై వైసీపీ అసత్య ప్రచారం

- 18.8 శాతం పనులు చేసి 80 శాతమని అబద్ధాలు
- పీపీపీ పద్ధతిలో పూర్తికి ప్రజా ప్రభుత్వం కృషి
- 2026-27లో అడ్మిషన్‌ల ప్రారంభానికి ప్రణాళిక
- మొదటి దశలో 4 కళాశాలలు
- మంత్రి డాక్టర్ స్వామి

6



# ఉపాధి కూలీలకు తీపికబురు

- వేతన బకాయిలు విడుదల
- లక్షలాది కుటుంబాలకు ఊరట
- జిల్లాలో రూ.119 కోట్ల పెండింగ్
- రెండుమూడ్రోజుల్లో బ్యాంకు ఖాతాలకు నగదు



ఒంగోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లక్షలాది మంది ఉపాధి హామీ పథకం కూలీలకు ఊరట లభించనుంది. వారి వేతన బకాయిలకు సంబంధించి రూ.119 కోట్లను కేంద్రం విడుదల చేసింది. రెండు, మూడు రోజుల్లో కూలీల బ్యాంకు అకౌంట్లకు నగదు జమకానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేకించి వేసవి కాలమైన తొలి నాలుగు నెలల్లో పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా పనులు జరిగాయి. జిల్లాలోనూ లక్షలాది కుటుంబాలకు చెందిన కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు 2.86 లక్షల కుటుంబాలకు చెందిన 4.94 లక్షల మంది కూలీలు పనులకు రాగా వారికి మొత్తం 99.64లక్షల పనిదినాలు కల్పించారు. అందుకుగాను వేతనాల రూపంలో సుమారు రూ.252.45 కోట్ల మేర లభించింది. సగటున ఒక్కో కుటుంబానికి 34.75 రోజుల పనిదినాలు కల్పించగా ఒక్కొక్కరికి సగటున రోజుకు రూ.252.25 మేర వేతనం దక్కింది. అయితే కూలీలు చేసిన పనులకు పెద్దఎత్తున వేతన బకాయిలు

మిగతా 6వ పేజీలో

# పూరిమెట్ల మంచంపట్టింది!

## వణికిస్తున్న విషజ్వరాలు

- 300 మంది వరకూ బాధితులు
- కొందరికి గున్యా
- చికిత్స కోసం రూ. వేలు ఖర్చు పెడుతున్న పేదలు



విష జ్వరంతో మంచం పట్టిన అక్కాచెల్లెళ్లు హర్షిణి, నవ్యశ్రీ

### రూ.30 వేలు ఖర్చు చేశా



నాకు 20 రోజుల క్రితం గున్యా వచ్చింది. స్థానికంగా ఆర్ఎంపీ డాక్టర్ల వద్ద చూపించుకున్నా తగ్గకపోవడంతో వినుకొండలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నా. రూ.30వేల వరకు ఖర్చయినా ఇంకా కోలుకోలేదు. ఇంతలోనే నా కుమార్తెలైన హర్షిణి, నవ్యశ్రీలకు కూడా గున్యాతోపాటు విష జ్వరం సోకింది. కూలికి వెళితే గాని కుటుంబం గడవని మమ్మల్ని విష జ్వరాలు పీడిస్తుండటంతో ఏంచేయాలో అర్థం కావటం లేదు.

\- కాండ్ర సుధారాణి

ముండ్లమూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మారుమూల గ్రామమైన పూరిమెట్లలో విషజ్వరాలు విజృంభించాయి. ఇంటికి ఒకరి నుంచి ఐదుగురు వరకు మంచం పట్టారు. వీరిలో కొందరు గున్యా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబాల వారు. ఇప్పటికే ఒక్కొక్కరు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.10 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చుపెట్టి చికిత్స చేయించుకున్నా ఏమాత్రం తగ్గటం లేదు. ఆర్థిక స్థోమత లేనివారిలో కొందరు మారెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో, మరికొందరు స్థానికంగా ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. నెలరోజుల నుంచి గ్రామాన్ని విషజ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ప్రధానంగా బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో ప్రతి ఇంట్లో జ్వర పీడితులు కనిపిస్తున్నారు.



విష జ్వరంతో బాధపడుతున్న అన్నదమ్ములు జశ్వంత్, ప్రశాంత్

### ఒక్కో ఇంట్లో ఐదారుగురు

కాండ్ర సుధారాణి కుటుంబం విష జ్వరాలతో బాధపడుతోంది. గ్రామంలోని ప్రధాన వీధికి చెందిన బొమ్మినేని సుబ్బారావు దంపతులు, వారి కుటుంబ సభ్యులు గున్యా, విషజ్వరాలతో మంచం పట్టారు. ముల్లా తిరుపతమ్మ, నిడిగంటి కోటేశ్వరమ్మ, చొప్పరపు ధనలక్ష్మి, ముండ్ల ఏడుకొండలుతో పాటు మరో 300 మందికి పైగానే జ్వరం, గున్యాతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# వెలుగుచూసేనా?

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ఎట్టకేలకు సెక్షన్ 51 విచారణ మొదలుకానుంది. విచారణాధికారిగా నియమితులైన రాష్ట్ర సహకార అదనపు రిజిస్ట్రార్ గౌరీశంకర్ మంగళ, బుధవారాల్లో ఒంగోలులో తొలివిడత విచారణ చేపట్టనున్నారు. ఆ మేరకు బ్యాంకు, సహకారశాఖ అధికారులకు సమాచారం అందింది. అయితే విచారణాధికారిపై తొలి నుంచి వివాదాలు ఉన్నాయి. తాజాగా కూడా పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. అంతకు మించి నెలక్రితమే కొందరు బ్యాంకు ఉద్యోగులు ఆయన్ను కలిశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితులతో బ్యాంకులో జరిగిన అవినీతి, అక్రమాలు ఏ మేరకు వెలుగు చూస్తాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## డీసీసీబీలో అక్రమాలపై ఎట్టకేలకు సెక్షన్ 51 విచారణ




- తొలివిడతగా నేడు, రేపు చేపట్టనున్న విచారణాధికారి
- ఆయన నియామకంపై ఆది నుంచి వివాదాలు
- తాజాగా ప్రభుత్వానికి ఫిర్యాదులు
- ముందుగానే బ్యాంకు ఉద్యోగులతో సంప్రదింపులు జరిపినట్లు ఆరోపణలు

ఒంగోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు త్రిసభ్య కమిటీల పాలన కొనసాగింది. ఆ సమయంలో నాటి పాలకవర్గంలోని వారు, కొందరు బ్యాంకు ఉద్యోగులు బరితెగించి భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీసీసీబీలో జరిగిన అవకతవకలపై పెద్దఎత్తున పాలకపెద్దలకు ఫిర్యాదులు వెళ్లాయి. స్వయంగా

మిగతా 6వ పేజీలో



ఒంగోలులో తెరుచుకున్న శివాలయం తలుపులు

7

## ఆలయాల్లో పూజలు మొదలు

సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి

# ట్రంక్‌రోడ్డు విస్తరణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ప్రజా ప్రయోజనం దృష్ట్యా నిబంధనల మేరకు ఓకే
- 12న కార్పొరేషన్ కౌన్సిల్‌లో ఆమోదం



ఒంగోలులోని ట్రంక్‌రోడ్డు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో కీలకమైన ట్రంక్ రోడ్డు విస్తరణ అంశం ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. నగర అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే పలు రహదారుల విస్తరణ పనులు జరుగుతుండగా, అందులో ముఖ్యమైన ట్రంక్‌రోడ్డుకు సంబంధించి పదేపదే ఆటంకాలు ఎదురయ్యాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరించాలని అధికారులు తొలుత భావించారు. అందుకు ట్రంక్‌రోడ్డు వ్యాపారులు అంగీకరించకపోవడంతో ఆరు నెలలుగా వాయిదా పడుతూ వచ్చింది. 100 అడుగులు వద్దని కొందరు.. 60 అడుగులు చేయాలని మరికొందరు.. ఇలా కాకుండా అందరికీ ఆమోదయోగ్యంగా 80 అడుగులకు విస్తరించాలని ఒక నిర్ణయానికి వచ్చిన క్రమంలో ఇటీవల కొందరు వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోతున్న తమకు నష్టపరిహారంతోపాటు షాపులు కట్టించి ఇవ్వాలని కోరారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. ఇరువర్గాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా రహదారి విస్తరణ చేయాలని కోర్టు ఆదేశించింది. మరోవైపు వ్యాపారులకు నష్టం కలగకుండా ఉండేలా చూడాలని పేర్కొంది. నష్టపరిహారం కింద నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్‌లు ఇవ్వాలని, వ్యాపారులు అందుకు అంగీకరించకపోతే భూసేకరణ చట్టం ప్రకారం రెవెన్యూ శాఖ ద్వారా తగు చర్యలు చేపట్టి న్యాయం చేయాలని ఆదేశించింది. దీంతో ఈనెల 12న జరిగే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో రోడ్డు విస్తరణకు ఆమోదం తెలియజేనున్నారు.

# మార్ట్ మూసివేతపై ఆర్పీల ఆగ్రహం

- లెక్కలు చెప్పాలని పీడీ, సీఎంఎంలను నిలదీత
- మెప్మా ఎండీ, ఎమ్మెల్యే దామచర్లకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో జరుగుతున్న వ్యవహారాలపై ఆర్పీలు మండిపడ్డారు. ఈనెల 3న ఆంధ్రజ్యోతిలో 'మహిళా మార్ట్ మూత' శీర్షికన ప్రచురితమైన కథనంతో వారిలో కదలిక వచ్చింది. సోమవారం ఒంగోలులోని మెప్మా కార్యాలయానికి వెళ్లి ప్రాజెక్టు డైరెక్టర్‌తోపాటు, మార్ట్ నిర్వహణ బాధ్యతలు చూసే మార్కెటింగ్ మేనేజర్, సీఎంఎంలను నిలదీశారు. మార్ట్‌లో పెట్టుబడులు, లాభాలు, ఇతర ఆర్థిక లావాదేవీలపై లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. తామంతా అప్పటి మెప్మా అధికారుల

మిగతా 6వ పేజీలో

# 'జీజీహెచ్'కి అవినీతి రోగంపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రారంభించిన త్రిసభ్య కమిటీ

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జీజీహెచ్‌లోని నర్సింగ్ విభాగంలో చోటుచేసుకున్న అవినీతి బాగోతంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 1 ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. నర్సులకు డ్యూటీలు వేసేందుకు నర్సింగ్ సూపరింటెండెంట్ సాగిస్తున్న వసూళ్ల పర్వంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ విచారణకు ఆదేశించారు. ఇద్దరు హెచ్‌వోడీలు, ఆర్ఎంవోతో కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో వారు సోమవారం విచారణ ప్రారంభించారు. నర్సింగ్

మిగతా 6వ పేజీలో

## ప్రేమకు అడ్డొస్తున్నాడని.. స్నేహితుడి హత్య

- ఇద్దరు మైనర్ బాలుర సాయంతో దారుణం
- యూట్యూబ్‌లో చూసి పథక రచన
- ముగ్గురు నిందితుల అరెస్టు

7

## ప్రాణం తీసిన రాంగ్‌రూట్

- కారును ఢీకొట్టిన మోటారు బైక్
- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం
- త్రోవగుంట వద్ద ఘటన

6

## చెన్నయ్య హుండీ ఆదాయం రూ.12లక్షలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ మధ్యరంగ మండపంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హుండీ 4 మాసాల ఆదాయం రూ.12,45,666 వచ్చినట్లు ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో కంటే హుండీ ఆదాయం రూ.2,36,869 అదనంగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షకులు వేణుగోపాల్‌రావు, రాజ్యలక్ష్మి సేవా సంఘం మహిళా భక్త బృందం ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 17న బల్లికురవలో విశ్వకర్మ మహా యజ్ఞం

బల్లికురవ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవలో ఈ నెల 17వ తేదీన గాయత్రీ సమేత విశ్వకర్మ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి ఉపనిషత్ పారాయణం, మహా ఉపనిషత్ పారాయణం, మహాగణపతి పూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, విశ్వకర్మ పతాకావిష్కరణ, అగ్నిప్రతిష్ఠ, మహా శాంతియజ్ఞం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంతో పాటు పరిసర మండలాల్లోని విశ్వబ్రాహ్మణులు కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు.

## గుంటుపల్లి కేజీబీవీలో జీసీడీవో తనిఖీ

బల్లికురవ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో చారులత సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఒకేషనల్ కోర్సు ద్వారా వృత్తి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోపాటు వృత్తి శిక్షణ పొందాలని సూచించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు శుచి రుచిగా భోజనాన్ని అందించాలన్నారు.

## మెడికల్ కాలేజీపై వైసీపీ అసత్య ప్రచారం

**18.8 శాతం పనులు చేసి 80 శాతమని అబద్ధాలు**

**పీపీపీ పద్ధతిలో పూర్తికి ప్రజా ప్రభుత్వం కృషి**

**2026-27లో అడ్మిషన్‌లు ప్రారంభానికి ప్రణాళిక**

**మొదటి దశలో 4 కళాశాలలు**

**మంత్రి డాక్టర్ స్వామి**

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాయవరం వద్ద మెడికల్ కాలేజీ పనులు 18.8 శాతం చేసి 80 శాతం చేసినట్లుగా వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను సోమవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, అధికారులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం అందించాలన్న లక్ష్యంతో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీని పీపీపీ పద్ధతిలో పూర్తి చేయాలని నిర్ణయించారని చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరంలో మార్కాపురం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటిదశలో మార్కాపురం, పులివెందుల, అరకు, మదనపల్లి మెడికల్ కళాశాలలను పూర్తి చేస్తామన్నారు. రెండో దశలో మిగిలిన మెడికల్ కళాశాలలను నిర్మిస్తామని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు తమ నీలి మీడియాలో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి స్వామి మండిపడ్డారు. గతంలో వైసీపీ నేతలు స్వార్థ రాజకీయాల కోసం మార్కాపురాన్ని జిల్లా చేయకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురాన్ని జిల్లాగా మార్చే పనిలో ఉన్నారన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ విద్యను ప్రోత్సహించి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును వైసీపీ నిర్లక్ష్యంగా వదిలేసిందని, ప్రజా ప్రభుత్వం దాని పూర్తికి కట్టుబడి ఉన్నదని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మళ్లీ మోసగించేందుకు వైసీపీ శ్రేణులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, వారు చెప్పే మాటలు ఎవరూ నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మౌలాలి, వక్కలగడ్డ మల్లికార్జున, కాకర్ల శ్రీనివాసులు, కొప్పుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కారును ఢీకొట్టిన మోటార్‌బైక్



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయకృష్ణ



మృతుడు బ్రహ్మయ్య



గాయపడిన శ్రీను



అపస్మారకస్థితిలో శ్రీను

**- ఒకరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం**

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తాలుకా సీఐ**

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో మోటార్‌బైక్‌పై ప్రయాణిస్తూ ఎదురుగా వచ్చిన ఇన్నోవా కారును ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఇరువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటన నగర శివారు ప్రాంతంలోని త్రోవగుంట ముదిగొండి బ్రిడ్జిపై సోమవారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో కొత్తపట్నం మండలం అల్లూరు టీవై కాలనీకి చెందిన ఆదూరి బ్రహ్మయ్య (60) మృతిచెందగా, తలుపుల శ్రీను, ఇండ్లా శ్రీను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వివరాలలోకి వెళితే.. ముగ్గురు మోటార్‌బైక్‌పై అల్లూరు నుంచి త్రోవగుంటలో కూలి పనులు మాట్లాడుకునేందుకు వెళ్లారు. అక్కడ పనులు మాట్లాడుకున్న తరువాత మద్యం షాపు దగ్గరకు వెళ్లి పూటుగా మద్యం సేవించారు. బ్రహ్మయ్య మోటార్ సైకిల్ నడుపుతుండగా వెనుక తలుపుల శ్రీను, ఇండ్లా శ్రీనులు కూర్చున్నారు. మద్యం మత్తులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ రహదారిపై ఎక్స్‌ప్రెస్ లైన్‌లో గుంటూరు వైపు వెళుతున్న ఇన్నోవా కారును ఢీకొట్టారు. దీంతో బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. క్షతగాత్రులైన ఇరువురిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.కారు డ్రైవర్‌కు కూడా స్వల్పంగా గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారీ సంఖ్యలో టీచర్ల నియామకాలు చేపట్టింది టీడీపీనే



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2 లక్షలకు పైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టింది టీడీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎస్టీయూ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మెరుగైన బోధనా మెళకువలు ఇవ్వడంతో పాటు విద్యార్థులకు పుస్తకాల బరువు లేకుండా సెమిస్టర్ పద్ధతిలో అర్థమయ్యేలా చదువు చెప్తున్నారన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షల్లో 580కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రూ.లక్ష తాను వ్యక్తిగతంగా అందజేస్తానన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు కూడా తల్లికి వందనం కింద నగదు జమ చేసిందని చెప్పారు. మార్కాపురం చెరువు కట్ట అభివృద్ధి పనులకు రూ.5కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, మార్కాపురం నుంచి తర్లుపాడు వరకు డబుల్ రోడ్డు మంజూరైందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందిన ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్, జిల్లా స్థాయిలో అవార్డు పొందిన డి.పావని, పి.శ్రీరామ్ శెట్టి, వి.కొండయ్య, ఆర్.నాగేశ్వరరావు, బి.నరేష్‌లను సన్మానించారు. వీరితో పాటు మరో 40 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్, డాక్టరు పద్మజ, ఎంఈవోలు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, కాశీం, ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, శ్యాం సుభాకర్, వెంకటేశ్వర్లు, పిచ్చిరావు, ప్రవీణ్ కుమార్, ఎస్టీయూ నాయకులు రాజా రమేశ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

# రెండు హెక్టార్ల వరకే పొగనారు సాగుకు అనుమతి

**రైతులు బోర్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలి**

**ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2 నిర్వహణాధికారి తులసి**



నారుమళ్లను పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు రూరల్, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రెండు హెక్టార్ల విస్తీర్ణంలోపు మాత్రమే పొగ నారుమళ్ల సాగు చేసేందుకు బోర్డు అనుమతి ఇస్తుందని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండు నిర్వహణాధికారి జె.తులసి చెప్పారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం 2 పరిధిలోని అమ్మనబ్రోలులో సాగుచేసిన నారుమడులను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారు అమ్మే సమయంలో కొనుగోలు చేసిన రైతులకు బోర్డు ఇచ్చిన పుస్తకం నుంచి రశీదు ఇవ్వాలని చెప్పారు. రైతులు కూడా నారును అనధికారికంగా కొనుగోలు చేయవద్దన్నారు. నారును ట్రేలలో పెంచాలని, కాండం బలంగా ఉండాలని చెప్పారు. 2025-26 సంవత్సరానికి రైతులు పొగాకు బ్యారన్లను రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. మూడేళ్లకు ఒకేసారి రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పొగాకు సాగు చేయాలన్నారు. పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు దొడ్డా సీతారామయ్య, జె.రామాంజనేయులు, గుడిపూడి రాజారావు, దేవబత్తిన వెంకటేశ్వర్లు, రాయపాటి వాసుబాబు, మారుతి, వేలటూరి వెంకటేశ్వరరావు, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుచూసేనా?

(5వ పేజీ తరువాయి)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులను మంత్రి డాక్టర్ స్వామి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తొలుత ప్రాథమిక విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు నుంచి వచ్చిన ఆదేశాలతో త్రిసభ్య కమిటీతో కలెక్టర్ అన్సారియా నియమించారు. గత ఏడాది నవంబరులో త్రిసభ్య కమిటీ దాదాపు రెండు వారాలపాటు అనేక అంశాలను పరిశీలించి భారీగా అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. ఈమేరకు కలెక్టర్‌కు కమిటీ నివేదిక సమర్పించారు. దాన్ని కలెక్టర్ ప్రభుత్వానికి పంపుతూ సమగ్ర విచారణ చేసి బ్యాంకులో అవినీతి, అక్రమాలు నిగ్గుతేల్చేందుకు సెక్షన్ 51 విచారణ చేయించాలని సిఫార్సు చేశారు.

**స్పందించని సహకార అధికారులు**

డీసీసీబీపై సెక్షన్ 51 విచారణ విషయంలో తగు స్థాయిలో సహకారశాఖ ఉన్నతాధికారుల నుంచి స్పందన రాలేదు. ఆ మాటకు వస్తే బ్యాంకుపై వచ్చిన ఆరోపణలు, ఇతర సహకార శాఖ అంశాలపై తొలి నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దాని వల్లనే విచారణాధికారిగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఒక అధికారి పేరును సూచిస్తే అందుకు విరుద్ధంగా రాష్ట్ర సహహకార శాఖ కమిషనరేట్‌లోని అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను ఉన్నతాధికారులు సూచించినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. దాని వల్లనే విచారణలో జాప్యం జరిగింది. ఈలోపు పలు ఆరోపణలపై అప్పుడు ఇక్కడ డీసీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి కలెక్టర్ సరెండర్ చేశారు. తర్వాత ఇందిరాదేవిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆ పరిణామాలు కూడా పెద్ద రచ్చకు దారితీశాయి.

**విచారణాధికారిపై ఫిర్యాదులు**

దాదాపు ఆరేడునెలల తర్వాత కూడా గతంలో ఉన్నతాధికారులు సూచించిన గౌరీశంకర్‌నే విచారణాధికారిగా నియమించగా ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ తాజాగా కూడా పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్లాయి. గతంలో విశాఖ జిల్లాలో కొన్ని కీలక సహకార సంస్థలపై విచారణ సమయంలో సదరు అధికారిపై ఆరోపణలు ఉన్నాయని, అలాగే ఇక్కడి బ్యాంకు అధికారులు కూడా కొందరు ముందుగానే అతనిని కలిశారని, దాని వల్ల సక్రమంగా విచారణ సాగదన్న ఫిర్యాదులు కొందరు చేసినట్లు సమాచారం. ఈనేపథ్యంలో డీసీసీబీలో అక్రమాలపై సెక్షన్ 51 విచారణకు నియమితులైన సహకారశాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీశంకర్ మంగళవారం ఒంగోలుకు వస్తున్నారు. విచారణ సమయంలో ఆయనకు సహాయంగా ఉండేందుకు ప్రస్తుతం విజయవాడలో డీఎల్‌సీవో కేడర్‌లో ఉన్న పి.కిరణ్‌కుమార్, గుంటూరు డీఎల్‌సీవో ఆఫీసులోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.జయదాస్‌లను నియమించినట్లు సమాచారం. కాగా విచారణాధికారి తొలివిడత మంగళ, బుధవారాల్లో కొంతమేర విచారణ నిర్వహించనున్నారు. అనంతరం కూడా రెండు, మూడు విడతలుగా విచారణ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా గతంలో కలెక్టర్ నియమించిన లోకేశ్వరరావు కమిటీ అనేక అంశాలను లోతుగానే పరిశీలన చేసి భారీగానే అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన నేపథ్యంలో ప్రస్తుత సెక్షన్ 51 విచారణ ఎలా సాగుతుంది? అవకవకలను నిగ్గుతేలుస్తారా? అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తాయా? అన్నది వేచిచూడాల్సి ఉంది.

## ఉపాధి కూలీలకు తీపికబురు

(5వ పేజీ తరువాయి)

పేరుకుపోయాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిత్యం రెండు లక్షల మంది జిల్లాలో పనులకు హాజరయ్యారు. అలా ఆ మూడు నెలల్లోనే జిల్లాలో 93 లక్షల పనిదినాలు కల్పించారు.

**కేంద్రం నుంచి నిధులు విడుదల**

ఏప్రిల్ నుంచి మే 15 వరకు చేసిన పనులకు మాత్రమే కూలీలకు వేతనాల చెల్లింపు జరగ్గా అనంతరం చేసిన పనులకు ఆగిపోయాయి. అలా మే 15 నుంచి వేతనాల బకాయిలుగా ఆగిపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు. దాదాపు 15 వారాలుగా నిలిచిన బకాయిలను చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం పలుమార్లు కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. దీంతో మే 15 నుంచి ఆగస్టు 15 వరకు ఉన్న బకాయిలు మొత్తం సుమారు రూ.16,668 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఆగస్టు 15 తర్వాత చేసిన పనులకు మరో రూ.137 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం ఆగస్టు 15 వరకు విడుదల చేసిన బకాయిల మొత్తాల నగదును రెండు, మూడు రోజుల్లో కూలీల ఖాతాలకు జమచేయనున్నారు. కాగా తాజా బకాయిలు విడుదలతో జిల్లాలోని కూలీలకు సుమారు రూ.119 కోట్ల మేర డబ్బులు జమ కానున్నాయి.

## మార్టు మూసివేతపై ఆర్పీల ఆగ్రహం

(5వ పేజీ తరువాయి)

ఆదేశాలతో పొదుపు సంఘాల నుంచి రూ.1500 వసూలు చేసి ఇచ్చామని, మార్ట్ ఏర్పాటుకు రూ.65లక్షల నగదు చెల్లించామని తెలిపారు. ప్రస్తుతం మార్ట్ మూసివేయడంతో పొదుపు సంఘాల సభ్యులు తమను నిలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఏం సమాధానం చెప్పాలని నిలదీశారు. దీంతో అవాక్కయిన అధికారులు ఆరు నెలలు గడువు ఇస్తే తిరిగి మార్ట్‌ను ప్రారంభిస్తామని బదులిచ్చారు. దీంతో ఆర్పీలు లెక్కలు తేల్చేవరకు తాము కదిలేది లేదని పట్టుబట్టడంతో అధికారులు మార్ట్ ఆర్థిక వ్యవహారాలను అప్పటికప్పుడు పరిశీలించారు. రూ.68 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేయగా ప్రస్తుతం రూ.17.50 లక్షలు మాత్రమే ఉన్నట్లు తేలింది. కనీసం సరుకులు స్టాక్ కూడా లేదని వారు గుర్తించారు. దీంతో మార్ట్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఆర్పీలు డిమాండ్ చేశారు. కాగా త్వరలోనే విజయవాడలోని మెప్మా మిషన్ డైరెక్టర్‌కు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఫిర్యాదు చేసేందుకు వారు ఆర్పీలు సిద్ధమైనట్లు సమాచారం.

## 'జీజీహెచ్‌కు అవినీతి రోగం'పై విచారణ

(5వ పేజీ తరువాయి)

విభాగంలో పనిచేస్తున్న వారిని వేర్వేరుగా విచారించారు. డ్యూటీ రోస్టర్ విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా నర్సింగ్ సూపరింటెండెంట్ డబ్బులు వసూలు చేస్తున్నది వాస్తవమేనని పలువురు వెల్లడించినట్లు తెలిసింది. అదేసమయంలో తమకు అనుకూలంగా డ్యూటీ వేసినందుకు ఆమెను కాపాడే ప్రయత్నంలో భాగంగా అలాంటిదేమీ లేదని విచారణ అధికారులకు కొందరు చెప్పినట్లు సమాచారం. మంగళవారం కూడా విచారణ కొనసాగనుంది.

## పంగులూరులోనే బర్లీ పొగాకు కొనాలి

పంగులూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు కొనుగోళ్లు తొలుత ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలోనే కొనసాగించాలని, రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగాకుకు నగదు వెంటనే చెల్లించాలని రైతుసంఘం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంగులూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతు వద్దకు చేరిన పొగాకును నేటికీ అమ్ముకోలేక పోతున్నారని విమర్శించారు. పంగులూరులో మూడు నెలల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించారన్నారు. గోడౌన్ల పేరుతో కొప్పెరపాడు, అద్దంకి, పొదిలి ప్రాంతాలకు కొనుగోలు కేంద్రాలను అధికారులు మార్చారని చెప్పారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

## జగనన్న పాసు పుస్తకం చించిన రైతు

**అవీఇవీ**

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వే చేసి జగనన్న ఫొటోతో ఇచ్చిన పట్టాదారుపుస్తకాన్ని రైతు చించివేసిన ఘటన జరిగింది. సింగరాయకొండ మండలం పెద్దకనుమళ్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతుకు 2.56 ఎకరాల భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే చేసి 4.80 ఎకరాల భూమి ఉన్నట్లు పట్టాదారుపాసుపుస్తకాన్ని ఇచ్చారు. ఆ రైతు వెంకటేశ్వర్లు తనకు ఉన్నది 2.56 ఎకరాల భూమి అని, అందువల్ల తన భూమిని సరిచేయాలని గత రెండేళ్ల నుంచి అధికారులను కలిసి విన్నవిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో మళ్లీ సర్వే చేసి అధికారులు 2.56 ఎకరాల బదులుగా 50 సెంట్లభూమిని తగ్గించి 2.06 ఎకరాలు ఉన్నట్లు ఆన్‌లైన్ చేశారు.దీంతో అధికారుల చుట్టూ తిరిగి బేసారిన వెంకటేశ్వర్లు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి తమ సమస్యను విన్నవించుకునేందుకు వచ్చారు. ఆ సమయంలో సహనం కోల్పోయిన రైతు వెంకటేశ్వర్లు గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జగనన్న పట్టాదారుపాసుపుస్తకాన్ని అక్కడ చించివేసి నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్ కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో ఈనెల 10వ తేదీన జరిగే భారీ బహిరంగ సభ సభను సూపర్ సక్సెస్ చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్ర మంత్రులు, పలు జిల్లాల ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన సమీక్షలో పాల్గొన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ జన సమీకరణ ఇన్‌చార్జిగా అశోక్‌రెడ్డిని నియమించారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వరప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నానితో కలిసి సోమవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడారు. చరిత్రలో మహానాడు కార్యక్రమం నిలిచిపోతుందని, అంతకు మించి సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కావాలని ఆయన సూచించారు. అంతకు ముందు మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గ్రామస్థాయి నుంచి బూత్‌ల వారీగా వాహనాలు, వసతి, భోజన ఏర్పాట్లపై సమీక్షించారు.

## ఓర్పు, నేర్పుతోనే విజయం సాధ్యం




ప్రసంగిస్తున్న విరజానంద స్వామీజీ

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓర్పు, నేర్పుతోనే విజయాలు సాధ్యపడతాయని బ్రహ్మంగారి మఠం అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామీజీ చెప్పారు. జార్జి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం మొదటి సంవత్సరం బీటెక్, డిప్లొమా విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వామీజీ మాట్లాడుతూ తరగతి గది అనేది జ్ఞానాన్ని పురుడు పోసుకునే ప్రసూతి మందిరమని, అజ్ఞానాన్ని ఖననం చేసే శ్మశానమన్నారు. సమాజానికి అవసరమైన అన్ని నిర్మాణాలను తయారు చేసే కర్మాగారమన్నారు. అంతేకాక అన్ని ప్రాంతాలు, కులాలు, మతాల వాళ్లు కలసి ఉండే సమతా మందిరమని అందుకనే విద్యాలయాలను పవిత్ర దేవాలయాలుగా పేర్కొంటారన్నారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే అన్నారు. అటువంటి ఆయుధాన్ని విద్యార్థులు ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీలలో చందలూరు విద్యార్థినుల సత్తా



విజేతలతో హెచ్‌ఎం గిరిజ, వ్యాయామోపాధ్యాయులు ప్రతిమ, మధు

పంగులూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల బాలికలు సత్తా చాటారు. పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమలలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు వివిధ విభాగాలలో జరిగిన యోగా పోటీలలో వీరు పాల్గొన్నారు. 12-14 సంవత్సరాల విభాగం యోగా పోటీలలో ఏ.లిఖిత, నాయపాము శ్రుతి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 10-11 సంవత్సరాల విభాగంలో కె.హెప్సీబా ఐదో స్థానం దక్కించుకుంది. లిఖిత, శ్రుతిలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల పీడీలు ప్రతిమ, మధు తెలిపారు. వీరిద్దరూ జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో అక్టోబరులో జరగనున్న జాతీయస్థాయి యోగా పోటీలలో పాల్గొననున్నారు. విజేతలతోపాటు పీడీలను పాఠశాల హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

## పొగాకు వేలాన్ని పరిశీలించిన బోర్డు ఉన్నతాధికారులు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని బోర్డు ఆక్షన్ మేనేజర్ (ప్రొడక్షన్) దివి వేణుగోపాల్, ఎస్‌బీఎస్ రీజనల్ మేనేజర్ శీలం రామారావు సోమవారం సందర్శించారు. కొనుగోళ్ల తీరును పరిశీలించారు. కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు తమ బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. వేలం అనంతరం అధికారులు రైతులతో మాట్లాడుతూ పొగాకు సాగు స్వీయ నియంత్రణ పాటించాలని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని సూచించారు. అధిక ధరలకు బ్యారన్లు, పొలాలు కౌలుకు తీసుకుని నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న వేణుగోపాల్, శీలం రామారావు



ఒంగోలు శివాలయంలో పూజలు

# ఆలయాల్లో పూజలు మొదలు

● సంప్రోక్షణతో భక్తులకు దర్శనం


చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మూతపడిన దేవాలయాలో సోమవారం తెల్లవారుజామున తిరిగి తెరుచుకున్నాయి. సుమారు పన్నెండు గంటలపాటు జిల్లా వ్యాప్తంగా దేవాలయాలు తలుపులు మూసివేయగా, పూర్తి చంద్రగ్రహణం 2.25 గంటలకు వీడటంతో అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయ శుద్ధి.. సంప్రోక్షణ అనంతరం అర్చకులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతో సుమారు 12 గంటలపాటు మూతపడి దేవాలయాలు తిరిగి తెరుచుకోవడం చంద్రగ్రహణ ప్రభావాన్ని తొలగించుకునేందుకు వేకువజాము నుంచే పూజలు చేసేందుకు బారులు తీరారు. దీంతో జిల్లా వ్యాప్తంగా హిందూ దేవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

# మేలైన యాజమాన్య పద్ధతులతో లాభాలు మెండు



సాగులో ఉన్న అరటి



ఆశాజనకంగా పెరుగుతున్న బొప్పాయి

ఎరువుల ఆధారంగా దిగుబడి, నాణ్యత

మెళకువలు తెలుసుకుని సాగు చేయాలి

ఉద్యాన పంటలపై అధికారుల సూచనలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పండ్ల తోటలు సాగుచేసే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరిస్తే మెండైన లాభాలు వస్తాయని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులు పంటల సాగులో మెళకువలు తెలుసుకుని కేవలం సస్యరక్షణే కాకుండా సమయానుకూలంగా ఎరువుల వాడకం ద్వారా మంచి దిగుబడులతోపాటు నాణ్యత కూడా పెరుగుతుందని చెప్తున్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఈ ఏడాది నెలకొన్న వాతావరణ పరిస్థితుల కారణంగా పంటల సాగులో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. మిర్చి పంట సాగు తగ్గించిన రైతులు బొప్పాయి, అరటి, మొక్కజొన్నపై ఆసక్తి పెంచుకున్నారు. ప్రస్తుతం బొప్పాయి, అరటి కాస్త ఆశాజనకంగా ఉండడంతో వాటిలో పాటించాల్సిన పద్ధతులు ఏంటో తెలుసుకుందాం.

అరటి రైతులు మొదటి 7 లేదా 8 నెలల సమయంలో వాడే ఎరువుల ద్వారానే అరటి గెల సైజు, నాణ్యత వస్తుంది. రైతులు జాగ్రత్తగా ఎరువులు, సూక్ష్మపోషకాలు, మెగ్నీషియం, కాల్షియం వంటివి డ్రిప్ ద్వారా అందిస్తే మంచిది. మొదటి మూడు నెలల్లో ఎకరానికి 60 కిలోల చొప్పున 19:19:19 ఎరువును వారానికి 5 కిలోల చొప్పున అందివ్వాలి. తరువాత నాలుగు నెలలు పొటాషియం అధికంగా ఉండే 13-0-45 వారానికి 5 కిలోల చొప్పున ఇవ్వాలి. గెలలు వేసిన తరువాత పొటాషియం సల్ఫేట్ గెలలపై రెండు సార్లు స్ప్రే చేయాలి. కొత్తగా వచ్చిన గెలలపై ప్రొఫెనోఫాస్, బావిస్టన్ కలిపి పిచికారీ చేయాలి. తరువాత ప్రొపికొనజోల్ 250 మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలి.

బొప్పాయి సాగులో తొలినాళ్లలో వేరు పెరుగుదల కోసం భాస్వరం అందించాలి. ఎక్కువగా రైతులు డీఏపీ, 20-20 మందులను వేస్తారు. వాటితోపాటు పొటాష్ కూడా అందిస్తే మంచిది. ఎరువులను డ్రిప్ ద్వారా అందిస్తే ఆదా అవుతాయి. 19-19-19 ఎరువు ఎకరాలకు 5కిలోల చొప్పున నెలలో నాలుగుసార్లు అందివ్వాలి. సూక్ష్మపోషకాలు కూడా అందించాలి. పిచికారీ ద్వారా వీటిని అందివ్వవచ్చు. వేరుకుళ్లు రాకుండా బ్లైటాక్స్ లేదా రెడోమిల్ 3 గ్రాములు లీటరు నీటికి మొదలు వద్ద తడిసేలా పిచికారీ చేయాలి. తెగుళ్ల విషయంలో వైరస్ మాత్రమే దీనికి ప్రమాదకారి. వాటిని గుర్తిస్తే ఆ చెట్టు పీకివేసి మిగిలిన మొక్కలకు రాకుండా జాగ్రత్త పడాలి. తెల్లదోమ ద్వారా ఎక్కువగా బొప్పాయికి నష్టం వాటిల్లుతుంది. కాబట్టి దీనిని అరికట్టేందుకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు 40 దాకా అమర్చుకోవాలి.

## జాగ్రత్తలు పాటిస్తే రైతులకు ఆదాయం

రైతులు సాగులో మెళకువలతోపాటు తెగుళ్లపట్ల అవగాహన పెంచుకోవాలి. అధికంగా రసాయన ఎరువులు వాడకం తగ్గించి సమయానికి ఏ ఎరువులు మొక్కకు అందివ్వాలో వాటిని తగిన మోతాదులో అందిస్తే చాలు. అనుమానాలు ఉంటే ఉద్యాన శాఖ ద్వారా నివృత్తి చేసుకోవాలి. యాజమాన్య పద్ధతులు తెలుసుకుని పండ్ల తోటల సాగు చేస్తే రైతులకు ఆదాయమే.

- ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి, ఎర్రగొండపాలెం

# ప్రేమకు అడ్డొస్తున్నాడని.. స్నేహితుడి హత్య

● ఇద్దరు మైనర్ బాలుర సాయంతో దారుణం

● యూట్యూబ్‌లో చూసి పథక రచన

● ముగ్గురు నిందితుల అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

బేస్తవారపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తన ప్రేమకు అడ్డు వస్తున్నాడని స్నేహితుడిని అతి దారుణంగా కొట్టి కత్తితో పొడిచి హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు సోమవారం బేస్తవారపేట పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను వెల్లడించారు. కంభం మండలం దరగా గ్రామానికి చెందిన గాలి చిన్న బ్రహ్మయ్య (25)ను బేస్తవారపేట మండల పరిధిలో హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పు అంటించిన ఘటనలో ముగ్గురు నిందితులు ఉన్నట్టు ఆధారాలు లభించాయి. ఈ కేసును మూడు రోజులకే ఛేదించి, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకున్నారు. దరగా గ్రామానికి చెందిన గడ్డం వెంకటసాయి తేజ (రవి).. యువతిని ప్రేమిస్తున్నాడు. దీంతో అతని స్నేహితుడు గాలి చిన్న బ్రహ్మయ్య అక్కసు పెంచుకున్నాడు. రవి మంచివాడు కాదని ప్రేమించిన అమ్మాయి తండ్రికి చెప్పాడు. తన ప్రేమకు అడ్డు వస్తున్నాడని బ్రహ్మయ్యను హతమార్చాలని రవి పథకం రూపొందించాడు. క్రికెట్ గ్రౌండ్ సమీపంలో బండరాళ్ల మధ్యలో కత్తిని దాచాడు. హత్య ఎలా చేయాలి? ఎలా తప్పించుకోవాలి? అన్నదానిపై యూట్యూబ్‌లో శోధించాడు. ఇందుకోసం వాటర్ ప్లాంట్‌లో ఆటోకు వెళ్తున్న ఇద్దరు మైనర్ బాలుర సహాయం తీసుకున్నాడు. రవి... చిన్న బ్రహ్మయ్యకు ఫోన్ చేసి బీరు తీగుదామని చెప్పగా, బ్రహ్మయ్య క్రికెట్ గ్రౌండ్ వద్దకు వెళ్లగా ఇద్దరు బీరు తాగిన తరువాత బ్రహ్మయ్య మత్తులో ఉండగా తలపై బండరాయితో రవి కొట్టగా, ఇద్దరు మైనర్‌లు బ్రహ్మయ్యను పట్టుకున్నారు. అనంతరం రవి కత్తితో గుండెపై పొడిచి మృతిచెందినట్టు నిర్ధారించుకున్నాడు. అనంతరం పెట్రోల్ పోసి తగులబెట్టాడు. బ్రహ్మయ్య బైక్‌ను బేస్తవారపేట జంక్షన్ సమీపంలో పెట్టాడు. ఈనెల 3వ తేదీన ఈ పరిణామాలు జరిగాయి. అయితే పాత కక్షల నేపథ్యంలో బ్రహ్మయ్య హత్యకు గురైనట్లు రవి చెప్పడంతో పోలీసులు ఆ దిశగా ఆలోచనలో పడ్డారు. రవి సెల్‌ఫోన్ ఆధారంగా ముగ్గురు నిందితులను పట్టుకొని గిద్దలూరు కోర్టులో హాజరుపరిచారు. విలేకర్ల సమావేశంలో కంభం సర్కిల్ సీఐ మల్లికార్జున, బేస్తవారపేట, కంభం ఏఎస్‌ఐలు ఎస్వీ రవీంద్రారెడ్డి, బి.నరసింహారావు పాల్గొన్నారు.

## పదోతరగతి ప్రశ్నపత్రాల్లో మార్పులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యాసంవత్సరంలో వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కోసం బ్లూ ప్రింట్, మోడల్‌పేపర్లు నేషనల్ అసెస్‌మెంట్ సెంటర్- పరక్ సూచనల మేరకు సవరణలు, మార్పులు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా పతీరరను ఆధారిత మౌలికతలపై అవగాహన పెంపొందించేందుకు ఈ మార్పులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సవరించిన బ్లూ ప్రింట్, మోడల్ పేపర్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన కోసం ఇవి అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ వనరులను తమ పాఠశాలల్లో వినియోగించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం వీటిని రోజువారీ బోధన ప్రణాళికల్లో చేర్చి విద్యార్థులు ప్రాక్టీస్ చేసేందుకు ప్రోత్సహించాలని శ్రీనివాసులురెడ్డి కోరారు. వచ్చేఏడాది మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

● జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిటైల్ డీలర్ల వద్ద 1313 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 1356 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మంగళవారం ఆర్పీఎఫ్ కంపెనీ యూరియా 300 మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు. బుధవారం మరో 790 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందని ఆయన తెలిపారు.

## వైద్యశాఖలో అవకతవకలపై 11న విచారణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని ఏఎన్ఎం గ్రేడ్-3లో జరిగిన అవకతవకలపై ఈనెల 11, 12 తేదీల్లో విచారణ జరగనుంది. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఇటీవల ఆ పోస్టులపై ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఏఎన్ఎంల పోస్టులపై ఈనెల 11, 12 తేదీల్లో విచారణచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# భళా.. బాలోత్సవం!




'విడాకులు' నాటికలోని సన్నివేశం

బాలోత్సవంలో బాలికల నృత్యం

● ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

నాటకరంగ ప్రముఖులు, ఆంధ్ర ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకుడు గరికపాటి రాజారావు 62వ వర్ధంతి సోమవారం ఒంగోలులో ఘనంగా నిర్వహించారు. ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమానికి వేదిక కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీఎంఆర్ గ్రూపు అధినేత బొమ్మిశెట్టి శంకర్‌రావు మాట్లాడారు. వేడుకలలో భాగంగా చిన్నారులు చింతపల్లి వెంకట నాగ హరిణి, గుణసాయి శ్వేతశ్రీ నృత్య ప్రదర్శనలు అలరించాయి. బొమ్మరిల్లు విద్యార్థుల కోలాట కళా రూపాలు కనువిందు చేశాయి. వారితో భాష్యం స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం, నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. గురుపూజోత్సవం సందర్భంగా ప్రజా కళావేదిక నిర్వాహకులు ప్రవేటు స్కూలు ఉపాధ్యాయులైన రమణారావు, బి. హనుమంతరావు, షేక్ అమీర్, ఎంవీ. రామిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం నేటి సమాజంలో చిన్న చిన్న గొడవలకు కుటుంబ వ్యవస్థ విడిపోవడంపై ప్రదర్శించిన విడాకులు నాటిక నేటి సమాజంలో కుటుంబ నేపథ్యాన్ని తెలియజేసింది.

- ఒంగోలు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)



సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో నిరాహార దీక్ష చేస్తున్న పెద్దన్న దంపతులు

# కూలి చెల్లించలేదని దంపతుల దీక్ష

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాల కిందట క్వారీలో పని చేయించుకుని కాంట్రాక్ట్ మాట్లాడుకున్న మేరకు కూలి డబ్బులు ఇవ్వకుండా ఓ యజమాని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బాధిత దంపతులు నిరాహార దీక్షకు దిగారు. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి పెద్దన్న కుటుంబ సభ్యులతోపాటు మరి కొంతమందిని కలుపుకుని వేముల ప్రసాద్, వేముల సుబ్బారావుకు చెందిన క్వారీలో ఒప్పందం మేరకు 2002లో పని చేశారు. కానీ కూలి డబ్బులు సుమారు రూ.2.52 లక్షలు యజమానులు చెల్లించలేదు. అప్పటి నుంచి పెద్దన్న అన్ని విధాలుగా పోరాటం చేస్తున్నారు. తొలుత మార్కాపురం లేబర్ ఆఫీస్ తర్వాత ఒంగోలు జిల్లా లేబర్ ఆఫీస్‌లలో ఫిర్యాదు చేశారు. అయినా పట్టించుకోకపోవడంతో హైదరాబాద్‌లోని సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వడ్డీతో సహా సుమారు రూ.41లక్షలు చెల్లించాలని లేబర్ కమిషనర్ కార్యాలయం ఆదేశాలిచ్చింది. అయినా బాధితునికి న్యాయం జరగలేదు. దీంతో ఆమరణ నిరాహార దీక్షకు దిగినట్లు తమ్మిశెట్టి పెద్దన్న తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ చిరంజీవిని వారితో మాట్లాడాలని సూచించారు. మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ హామీ ఇచ్చినా పెద్దన్న వినలేదు. భార్య వెంకటసుబ్బులుతో కలిసి దీక్ష కొనసాగిస్తున్నారు.

## కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ ఎంపిక జోన్‌లో నిలిచిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పునఃపరిశీలన సోమవారం కూడా కొనసాగింది. ఒకవైపు మంగళగిరిలోని పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల తుది ఎంపిక ప్రక్రియ జరుగుతుండగా ఇక్కడ సర్టిఫికెట్ల పరిశీలన కూడా అంతే పకడ్బందీగా జరుగుతోంది. అభ్యర్థుల విద్యార్హతలు, వయస్సు ధ్రువీకరణ మినహాయింపు, మెడికల్ సర్టిఫికెట్లు, స్టడీ, కులధ్రువీకరణ, ఇతర సర్టిఫికెట్లు అన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినవే. మొదటి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన 13 టీంలు ఈ పునఃపరిశీలనలో పాల్గొంటున్నారు. గత ఐదు రోజులుగా ఈ కార్యక్రమం కొరసాగుతుంది. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలోని ఏపీసీ చాంబర్‌లోనే లాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి గోప్యంగా పునఃపరిశీలన చేస్తున్నారు. కమిషనర్ కార్యాలయం నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ పునఃపరిశీలన కార్యక్రమం కొనసాగనుంది.

## కొత్త భవనాల మంజూరుకు కృషి

● గురుకుల పాఠశాల సందర్శనలో మంత్రి స్వామి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి స్వామి

కొనకనమిట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అదనపు తరగతి గదులతోపాటు కొత్త వసతి భవనం మంజూరుకు కృషి చేస్తానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేస్వామి తెలిపారు. వెలిగొండ గురుకుల పాఠశాలను సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. చిన్నప్పటి నుంచే మంచి నడవడిక, క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యతో పాటు వ్యాయామం, క్రీడలను అలవర్చుకోవాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని చెప్పారు. సమస్యలు, మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన తరగతి గదులు కావడంతో పెచ్చులూడుతున్నాయని, వసతి గృహం పాతది కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలో నూతన భవనాల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ త్రివినాగ్, టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



# యూరియాను పూర్తిస్థాయిలో సబ్సిడీపై అందించాలి

● అక్రమ నిల్వలు ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి ● సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ డిమాండ్




ధర్నాలో పాల్గొన్న సీపీఐ నేతలు, కార్యకర్తలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా కొరతను నివారించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత ఏడాది రాష్ట్రంలో 39.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులు వినియోగించారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కేవలం 32 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరిపోతాయని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని ఆరోపించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల కొరత పడుతుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ హయంలో రాష్ట్రానికి ఎరువులను పూర్తిస్థాయిలో రప్పించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు వచ్చిన స్టాకు దాచిపెట్టి అధికధరలకు మార్కెట్లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. అసలే పండించిన పంటలకు గిట్టుబాటు ధరలులేక, సాగు సమయం అందక, పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంకొక వైపు నానో యూరియాను కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామంటూ అధికారులు చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు అవసరమైన మేరకు యూరియాను అందించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తోందని హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రైతులకు యూరియాను అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రైతాంగం సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐరైతు సంఘం నాయకులు కరవది సుబ్బారావు, వడ్డే హనుమారెడ్డి, నల్లూరి మురళీ, ఎస్‌డిసర్దార్, ఎం. విజయ, శ్రీరామ్ శ్రీనివాసులు, ముత్తన అంజయ్య, కొత్తకోట వెంకటేశ్వర్లు, దాసరి అంజయ్య, నూనె మోహన్‌రావు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసులు

## నిందితులను అరెస్టు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు యలమందపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5వతేదీన గవళ్ళపాలెం గ్రామపరిసరాల సమీపంలో ఇరువురు వ్యక్తులు బహిరంగంగా మద్యంసేవిస్తూ దాడికి పాల్పడ్డారన్నారు. దీంతో మండల పార్టీ అధ్యక్షుడు యలమందకు తీవ్రగాయాలు కావడంతో అదే రోజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దాడిలో గాయపడిన వ్యక్తికి న్యాయంచేయాల్సిన పోలీసులు కౌంటర్ కేసు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలీస్ ఉన్నతాకారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారెడ్డి, మాకినేని అమరసింహం, బొద్దులూరి ఆంజనేయులు, రావులపల్లి నాగేంద్రయాదవ్, శివాజీ యాదవ్, దామోదర్ చౌదరి, తిరుమలరావు, వాల్మీకి నాయక్ తదితరులు ఉన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

## రాకెట్ బాల్ జాతీయ పోటీలకు హైదరాబాదు స్కూలు విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాకెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఒంగోలుకు చెందిన హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఎంపికైనట్లు స్కూలు కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. ఈనెల 6వ తేదీన జరిగిన అండర్ 19 బాల, బాలికల జట్ల ఎంపికలో తమ స్కూలులో చదువుతున్న విద్యార్థులు లాక్షిత్, అక్షయ్, హనీఫ్, షనీత్, గాయత్రి, సహన్ర, సాహిత్య, ప్రణవి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25వ తేదీ నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో ఏపీ జట్టు తరుఫున పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

## స్వచ్ఛభారత్ మిషన్ అమలుపై ప్రత్యేక దృష్టి : ఎంపీ మాగుంట


ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) స్వచ్ఛభారత్ మిషన్(పట్టణ) కార్యక్రమ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సూచించారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో సోమవారం గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ సమావేశంలో మాగుంట మాట్లాడారు. ఈ సమావేశంలో మాగుంట స్వచ్ఛభారత్ మిషన్ అమలు, గృహ, పట్టణ వ్యవహారాలపై మంత్రిత్వశాఖ ప్రతినిధులకు పలుసూచనలు చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు కేంద్ర ప్రభుత్వ అధికారులు ఉన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న బీసీ సంఘం నేతలు

## రాష్ట్ర కృష్ణ బలిజ సంఘం అధ్యక్షుడికి సన్మానం

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర కృష్ణబలిజ సంఘం అధ్యక్షుడిగా ఎంపికయిన తిర్లక శ్రీనివాసరావుని ఒంగోలు రామ్‌నగర్‌లో సోమవారం బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. విజయవాడలో ఆదివారం కృష్ణ బలిజ సంఘం రాష్ట్రకార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో తిర్లక శ్రీనివాసరావును రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌లోని శ్రీనివాసరావు గృహంలో బీసీ సంఘనాయకులు సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. చెంచు బాబు, బొట్లా సుబ్బారావు, తన్నీరు సోమయ్య, సుబ్బారావు,తుపాకుల లక్ష్మీనారాయణ, వీసం సూర్య, వీసం బాలకృష్ణ, పిగిలి శ్రీనివాస్, తుపాకుల సుబ్బారావు, ఆనం శ్రీనివాసరెడ్డి, అన్నం శివ, వీసంకొండయ్య, టి.ప్రసాదు, పి.సుధాకర్, తన్నీరు శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు భోజనం ప్లేట్‌లు అందజేస్తున్న శామ్యూల్

## దాతల ఔదార్యం మరువలేనిది

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దాతల ఔదార్యం మరువలేనిదని ఉప్పుగుండూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సున్నను కృష్ణవేణి అన్నారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన బుజ్జి మాస్టారు కుమారుడు అమరా వెంకట సుబ్బారావు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం స్టీల్ ప్లేట్లను సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శామ్యూల్ మాస్టారు ద్వారా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కడవకుదురు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**- కలెక్టర్ అన్సారియా**

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అర్జీలను గడువులోపు పరిష్కరించడంతోపాటు నాణ్యతతో ఉండాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. పీజీఆర్ఎ్‌స్‌లో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రతిరోజు లాగిన్ అయ్యి అధికారులు వినతులను చూడాలన్నారు. రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ చేసి ముగించాలన్నారు. గడువులోపే వినతులకు సమాధానాలు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల పరిష్కారంపై ప్రతిశాఖలో ఆడిట్ టీంలతో పాటు నోడల్ అధికారిని ఏర్పాటు చేశామన్నారు. కొన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించి నోడల్ అధికారుల వివరాలను ఇప్పటి వరకు పంపకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ వివరాలను వెంటనే పంపించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను ఈపీటీఎస్‌వెబ్‌సైట్‌లో రోజూ అప్‌లోడ్ చేయాలని, ఈ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, వరకుమార్, కుమార్, విజయ జ్యోతి తదితరులు ఉన్నారు.



మీకోసంలో అర్జీదారు సమస్యపై మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

### పోలీసు గ్రీవెన్స్‌లో 49 ఫిర్యాదులు

ఒంగోలుక్రైం : బాధితులకు సత్వర న్యాయం అందిచేందుకు కృషి చేయాలని మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణకుమార్ పిలుపునిచ్చారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి 49 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదిదారులతో మాట్లాడిన పోలీసు అధికారులు చట్టపరిధిలో వారికి న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ ఇన్‌స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండు రంగారావు, ఎస్సై జనార్దనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈతముక్కల హైస్కూలులో ఘనంగా గురుపూజోత్సవం



హెచ్‌ఎం చెంచుపున్నయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

కొత్తపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య, ఇతర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారు విద్యార్థులను తీర్చిదిద్దడంలో చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గోలి శివయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి పద్మావతి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెంచుపున్నయ్య, లక్ష్మీప్రసన్న దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో పద్మావతి మాట్లాడుతూ చెంచుపున్నయ్య ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టాక పాఠశాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కూడా దక్కటం సంతోకరమన్నారు. గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో పాఠశాల విద్యార్థి 591 మార్కులు సాధించటానికి ఉపాధ్యాయుల కృషే కారణమన్నారు. సభలో ఇంకా ఉపాధ్యాయులు గోలి శివయ్య, డాక్టర్ పి.రామాంజనేయులు, సరోజను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవులు, శోభారాణి, వెంకారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు పీడీ నారాయణ

## షేడ్‌నెట్లతో రైతులకు ప్రయోజనం

**వెలుగు పీడీ నారాయణ**

ఒంగోలు నగరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 50 శాతం సబ్సిడీతో అందించే షేడ్‌నెట్ల యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ అన్నారు. సోమవారం వెలుగు టీటీడీసీ సమావేశం హాలులో జరిగిన షేడ్‌నెట్లు ఇప్పటి వరకు పొందిన లబ్ధిదారులు, వెలుగుసిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పొలాల్లో షేడ్‌నెట్లను ఏర్పాటు చేసుకోవటం ద్వారా వ్యవసాయంలో ఏడాది పొడవునా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. 52 చదరపు మీటర్ల పరిమాణం కలిగిన షేడ్‌నెట్ యూనిట్‌ను ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తుందన్నారు. లబ్ధిదారుడు ప్రస్తుతం చెల్లించాల్సిన 50 శాతం సొమ్మును వెలుగు ద్వారా రుణంగా అందిస్తామని ఆయన అన్నారు. షేడ్‌నెట్‌ల ఏర్పాటుకు సెర్ప్‌తో ఒ ప్పందం కుదుర్చుకున్న ఖేతి సంస్థ ప్రతినిధి కృపాసత్యం మాట్లాడుతూ రైతు చెల్లించాల్సిన 50 శాతం అందిన వెంటనే యూనిట్‌ను పూర్తిగా అందిస్తామన్నారు. ఏడాది పాటు రైతులు పండించే పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో సంతనూతలపాడు మండలంలో షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేసుకున్న రైతులతో పాటు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇరువురు దొంగల అరెస్టు

**నాలుగు మోటర్ సైకిళ్లు, రూ.7 వేల నగదు స్వాధీనం**



నిందితులను, స్వాధీనం చేసుకున్న మోటార్ బైక్‌లను చూపుతున్న సీసీఎస్ సీఐ జగదీష్

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇరువురు దొంగలను అరెస్టు చేసి నాలుగు మోటార్ సైకిళ్లు, రూ.7 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ జగదీష్ తెలిపారు. స్థానిక సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ దొంగతనాలకు పాల్పడే పామూరు మండలం చెరుకుపల్లికి చెందిన పసుమర్తి లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన పులి అంజిరెడ్డిలను తాళ్లూరు మండలం గుంటిగంగ దేవాలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఇరువురిని తాళ్లూరు ఎస్సై మల్లిఖార్జున రావు,సీసీఎస్ సిబ్బం ది పట్టుకున్నట్లు వివరించారు. వీరు ఇరువురు వద్ద నాలుగు మోటర్ సైకిళ్లు, దేవాలయాలలో దొంగిలించిన రూ.7 వేల చిల్లర నాణ్యాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా దొంగలను పట్టుకున్న సీసీఎస్ సిబ్బంది, తాళ్లూరు పోలీసులను ఎస్పీ అభినందించినట్లు సీఐ జగదీష్ తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల విక్రయం

పొన్నలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం విక్రయించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి వడ్డే రాము మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు వినియోగించడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ సుధీర్, ఎల్-2 మందాకిని, పల్లపోతు వెంకట్రావు, సురేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రాము

### కొండపిలో స్టాల్ ఏర్పాటు

కొండపి : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను స్థానిక మండల కార్యాలయాల ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను తినడం వలన ప్రజల ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రసాయన ఎరువులు వాడకుండా పెరట్లో కూరగాయలు పండించుకుని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్-2 గౌతమి, ఐసీఆర్పీ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు

**గోతులమయంగా మారడంతో వాహనదారుల ఇక్కట్లు**

కొండపి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కె.ఉప్పలపాడు-ఎం.నిడమాలూరు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపి నుంచి ఒంగోలు వెళ్లేందుకు ఈరోడ్డు పలు గ్రామాల వారికి అనువుగా ఉంటుంది. ఈమార్గంలో రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. కె.ఉప్పలపాడు-ఎం.నిడమలూరు గ్రామాల మధ్య దాదాపు మూడు కిలో మీటర్ల దూరం రోడ్డు దెబ్బతింది. మార్జిన్‌లలో తారు లేచిపోయి గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఆ రూట్‌లో ప్రయాణించాలంటే వాహనదారులు వణికిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు



గోతులమయంగా తయారైన కె.ఉప్పలపాడు - ఎం.నిడమాలూరు రోడ్డు

## ఫ్లోరోసిస్‌పై అవగాహన

పొన్నలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగుంట, పెద్దవెంకన్నపాలెం, ఉప్పలదిన్నె, రావులకొల్లు పాఠశాలల్లో విద్యార్థులకు ఫ్లోరోసిస్ నివారణపై డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. అనిల్ మాట్లాడుతూ సురక్షితమైన నీటిని తాగాలన్నారు. కాల్షియం, విటమిన్-సీ ఉన్న ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పీవీ మల్లికార్జున, రవికిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులను పూర్తిస్థాయిలో అందించాలి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పూర్తిస్థాయిలో ఎరువులను సక్రమంగా అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహకార్యదర్శి టంగుటూరి ప్రభాకర్, నాయకులు నూకతోటి పేరయ్య, ఏవీఎస్ చౌదరి, సుశీల పాల్గొన్నారు.

## జీఎల్ పురం పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం

చీమకుర్తి,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎల్‌పురం పొలాల్లో గుర్తుతెలియని మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.30నుంచి 40సంవత్సరాల లోపు ఉన్న పురుషుడుగా ప్రాథమికంగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రొయ్యరైతుల సంక్షేమ సంఘం నేత

## ఆక్వా రైతులను పట్టించుకోని ప్రభుత్వం

**● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు**

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా పరిశ్రమ ద్వారా దేశానికి వేల కోట్ల ఆదాయం వస్తున్నా వారి సంక్షేమం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి జే జయంతిబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య మాట్లాడుతూ పదేళ్లుగా పన్నుల భారం రాష్ట్రంలోని ఆక్వా రంగాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఆరువేల కిలోమీటర్ల తీరంలో ఏటా రూ. 60వేల కోట్ల ఆదాయం సమకూరుతున్న ఆక్వా రైతులకు ఎంపెడా కానీ, కేంద్రంకానీ ఏం చేస్తుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. మద్దతు ధర అమలు జరిగేలా చర్యలు చేపడితే రూ. 6 లక్షల కోట్ల ఆదాయం పెంచే వీలుటుందన్నారు. కుందేరు రొయ్యరైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామయ్య మాట్లడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం, ఏ సంఘం కూడా రొయ్యల రైతుల సంక్షేమం గురించి పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యుత్ ధరలు, ఫీడ్,మందుల ధరలపై నియంత్రణ లేదన్నారు. ఆంక్షల వల్ల రొయ్యల ఎగుమతులు నిలిచిపోయి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రొయ్యల రైతుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. ఈనెల 11న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రితో, 16.17 తేదీల్లో కేంద్ర మంత్రితో సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ చెరువులకు ప్రభుత్వం నీటి సరఫరా చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కారుమూడి ప్రభాకర్ రావు, కొక్కులగడ్డ వెంకటేశ్వర్లు, కామని సుబ్బారావు, టి. శ్రీకాంత్, మల్లికార్జున రావు, ఘట్టమనేని అశోక్, చాపల సాంబయ్య, ముప్పా కోటేశ్వరరావు, పెంట్యాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పోలీస్ సంఘం ప్రధాన కార్యదర్శి హజరత్తయ్య

## వైసీపీ కార్యకర్తల తీరు దారుణం

**● పోలీసులపై దాడిని ఖండించిన పోలీస్ సంఘం**

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహల ఊరేగింపులో పోలీసులపై జరిగిన దాడిని రాష్ట్ర పోలీసు సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్. హజరత్తయ్య సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఖండించారు. ఈనెల 7న ఒంగోలు కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద స్థానిక 45వ డివిజన్ వైసీపీ నాయకుడు యెన్నపూస వెంకటేశ్వరరెడ్డి ఆధ్యరంలో డీజే సౌండ్స్‌తో వినాయక విగ్రహం ఊరేగింపుగా వస్తుండగా డీజే సౌండ్స్ నిలిపివేయాలని చెప్పిన ట్రాఫిక్ ఎస్సై డి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రవికుమార్ లపై వైసీపీ కార్యకర్తలు ,నాయకులు దాడిచేయడం సరైన చర్య కాదన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తూ, నిత్యం ప్రజా సేవకు అంకితమైన పోలీసులపై దాడి చేయడం పట్ల రాష్ట్ర సంఘం తీవ్రంగా పరిగణించిదని అన్నారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీని కోరామని చెప్పారు. అదే విధంగా డీఎస్పీ కార్యాలయం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దౌర్జన్యం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు తిరుపతి స్వామి, మహిళా కానిస్టేబుల్ శ్రీదేవి, ఏఎస్సై ఆహ్మద్ బాషాలు ఉన్నారు.

## 11, 12 తేదీల్లో మైనంపాడులో కళాఉత్సవ్

సంతనూతలపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో కళాఉత్సవ్-2025 పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ సోమాసుబ్బారావు సోమవారం ఓప్రకటనలో తెలిపారు. 6 ప్రధాన, 12 ఉపప్రధాన అంశాలలో ఈపోటీలు జరుగుతాయని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని 56 మండలాల్లో 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రభుత్వ , ప్రభుత్వ గుర్తింపు గల ప్రైవేట్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్స్, సంక్షేమ గురుకులాల విద్యార్థినీ విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. ఈనెల 11న ఉమ్మడి ప్రకాశం జిలాల్లోని ఒంగోలు, పర్చూరు డివిజన్లు, 12న ఉమ్మడి ప్రకాశం జిలాల్లోని మార్కాపురం, కందుకూరు డివిజన్లు పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకుని ప్రతిభను చూపేందుకు గొప్ప అవకాశమని తెలిపారు.

## బాధిత కుటుంబానికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు సమీపంలోని పేర్నమిట్టలో హత్యకు గురైన చింతగుంట్ల జీవన్ భార్య జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా నియామక ఉత్తర్వులు అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో దళిత సంఘాల సమక్షంలో ఈ ఉత్తర్వులను అందించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్, మలమహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి ఉన్నారు.



సంతనూతలపాడులో అక్షరాస్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, వెలుగు సిబ్బంది

## ఘనంగా అక్షరాస్యతా దినోత్సవ ర్యాలీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో సోమవారం 59వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం వెలుగు కార్యాలయంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవో ప్రభాకరరెడ్డి, డీడీ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం టి.బాబూరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్లు, వెలుగుసిబ్బంది పాల్గొన్నారు

## టీడీపీ కార్యకర్త జయరామిరెడ్డి మృతి



జయరామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చట్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జయరామిరెడ్డి (62) అనారోగ్యంతో మృతిచెందారు. ఇది తెలుసుకున్న టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి జయరామిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతిని తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు బోయిళ్లపల్లి కిశోర్, మండ్ల శ్రీనివాసులు, రాబర్ట్, రంగారెడ్డి ఉన్నారు.

# ఆలయాల్లో శుద్ధి

- దర్శనాలకు అవకాశం
- పెద్ద ఎత్తున భక్తుల పూజలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా సంప్రోక్షణ అనంతరం సోమవారం ఆలయాలను తెరిచారు. చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు విశ్వక్సేన పూజ, శుద్ధి పుణ్యాహవాచనం, దేవాలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు పంచామృతాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. శివాలయం, అల్లూరి పోలేరమ్మ ఆలయాలలో సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

### ఆలయాలకు బారులు తీరిన భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్ : సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం అన్ని దేవాలయాలను మూసి వేశారు. సోమవారం ఉదయం ఆలయాలను శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పించారు. సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వృచ్చికాయల మల్లికార్జున స్వామి, గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



సంప్రోక్షణ చేస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి



జ్వరపీడితులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## గోగినేనివారిపాలెంలో వైద్య శిబిరం

పొదిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామంలో ఉప్పలపాడు వైద్యాధికారి డాక్టర్ సుగుణకుమార్ అధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ గాయత్రీ సిబ్బందితో ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. పరీక్షలు అనంతరం మందులను అందజేశారు. ఎస్సీ కాలనీలో సర్పంచ్ ఏసేబు ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ శేషగిరి మురుగు కాలువల్లో పూడికతీసి పారిశుధ్య పనులు చేయించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయలక్ష్మి, పీహెచ్ఎన్ జే సంపూర్ణాదేవి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలను పారదోలాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక నష్టాలకు గురిచేసే మూఢనమ్మకాలను పారదోలాలని జన విజ్ఞాన వేదిక సమతా కన్వీనర్ రెడ్డిపోగు ఝాన్సీపాల్ అన్నారు. స్థానిక సీతారామశాస్త్రి వైద్యశాలలో జన విజ్ఞాన వేదిక ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీపాల్ మాట్లాడుతూ.. ప్రజలలో శాస్త్రీయ దృక్పథం కలిగి సైన్సు పట్ల నమ్మకం పెరగాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వహించాలని వేదిక జిల్లా ఆరోగ్య కన్వీనర్ డా.శరత్ అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకుల ఏనుగుల రవికుమార్, వెంకట్రావ్, విప్లవ కుమార్, చంద్రశేఖరయ్య, మురళీకృష్ణ, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రధాని చిత్రపటాలను ఏర్పాటు చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 18 అర్జీలు దాఖలయ్యాయి. అర్జీ అందజేసిన అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ గతంలో తామే సొంత ఖర్చులతో చిత్రపటాలను ప్రభుత్వ కార్యాలయాలకు అందజేశామన్నారు. అయినా వాటిని పక్కన పడేశారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పాదర్తి రామాంజనేయులు, కొప్పరపు రామ్‌నాథ్, డి.రమేష్, జి.సతీష్‌కుమార్ ఉన్నారు. యూరియా కొరత లేకుండా రైతులకు సక్రమంగా అందించాలని సీపీఐ నాయకులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, డీకేఎం రఫీ పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని వృద్ధుడు మృతి



వీరారెడ్డి మృతదేహం

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిల్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద చోటుచేసుకుంది. టౌన్ పోలీసుల కథనం మేరకు.. ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద నూనె వీరారెడ్డి (62) టీ కొట్టుతో జీవనం సాగిస్తున్నారు. సమీపంలోని ఏకలవ్య కాలనీలో నివాసముంటున్నారు. టీ కొట్టు నుంచి ఇంటికి వెళ్తూ రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో కొనకనమిట్ల వైపు నుంచి మార్కాపురం వస్తున్న బైకు అదుపుతప్పి వీరారెడ్డిని ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమైన వీరారెడ్డిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందారు. ఈ మేరకు టౌన్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వమే మెడికల్ కాలేజీని పూర్తి చేయాలి

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమే మార్కాపురంలో మెడికల్ కాలేజీని పూర్తి చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించింది. సీపీఎం పట్టణ కమిటీ నాయకులు మాట్లాడుతూ మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటు వారికి అప్పజెప్పడాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఫీ, రాజు, రూబెన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఎలక్ట్రికల్ బెల్ బహూకరణ

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలం మురారిపల్లె జడ్పీ పాఠశాలకు, వైపాలెం ఎంపీపీఎస్ పాఠశాలకు సోమవారం ఎస్ఎంసీ మాజీ చైర్మన్ గోళ్ల వీరవెంకట సుబ్బారావు ఎలక్ట్రికల్ బెల్ అలారాన్ని మురారిపల్లె పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావుకు బహూకరించారు. ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ పాఠశాలలకు సహాయ సహకారాలు కార్యక్రమాలు చేయడానికి సుబ్బారావు ఉత్సాహంగా ఉంటారని అన్నారు. ప్రవేటు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు,మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మీకోసంలో మూడు అర్జీలు

రాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఈ అర్జీలు అందినట్లు చెప్పారు. భూమి కొలత, భూ సమస్య, భూ సర్వేపై బాధితులు ఫిర్యాదు చేశారని వాటిపై విచారించి పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారన్నారు.

## కుక్కలతో బెంబేలు

పొదిలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులుగుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయి. అటుగా ఒక్కరు వెళ్లాలంటే భయపడుతున్నారు. అధికారులకు దీనిపై ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నవాబ్ మిట్ట, ఇస్లాంపేట, తూర్పుపాలెంలో చిన్న పిల్లలపై కుక్కలు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కుక్కల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు కోరుతున్నారు.



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

## నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

రాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతల (సోక్ పిట్స్) నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు వాటిని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి తెలిపారు. మండలంలోని సత్యవోలు గ్రామంలో సోమవారం ఆయన ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా వృధా నీటిని దాచవచ్చన్నారు. దీనివల్ల రోడ్లపై మురుగు, వృధా నీరు ఉండదన్నారు. ఒక్కో గుంతకు దాదాపు రూ.6వేల వరకు ప్రభుత్వం అందిస్తుందని 4 అడుగులు వెడల్పు, 3 రింగులు వేసుకుని పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. నిర్మాణాలు పూర్తయి వెంటనే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవో ఉపాధి హామీ ఈసీ జే నాగేశ్వరరావు, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.

## మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థినులు

గిద్దలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు ఫాతిమా స్వచ్ఛంద సేవా సంస్థ ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అందచేశారు. ఈ మెటీరియల్ ద్వారా చదువుకుని మెరిట్ స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫాతిమా సేవా సంస్థ అధ్యక్షుడు ఖాశింవలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా యువప్రగతి స్వచ్ఛంద సంస్థ విద్యావిద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేసింది. సంజీవని గురుకుల స్వచ్ఛంద సేవా సంస్థలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న బాలబాలికలకు విద్యా సామగ్రిని అందచేశారు. కార్యక్రమంలో యువప్రగతి సేవాసంస్థ అధ్యక్షులు వేణుగోపాల్, సభ్యులు రత్నం, నాయక్, తదితరులతోపాటు సంజీవిని ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాసే విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు, ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య 10 మంది విద్యార్థులకు అందచేశారు. సోమవారం పట్టణంలోని యాదవ బజారులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10 మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గౌస్‌బాషా, పాఠశాల సిబ్బంది నారాయణ, లక్ష్మయ్య, లీలావతి, అరుణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నివారణతోనే హెచ్ఐవీకి అడ్డుకట్ట




అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీకి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని ప్రధానోపాధ్యాయుడు శర్మ అన్నారు. హెచ్ఐవీ నియంత్రణ, మత్తుపదార్థాలపై పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. సమగ్ర ఐఈసీ ప్రచార రథం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఐవీ ఎలా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై నిర్వహించారు. హెచ్ఎం శర్మ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటమ్మ, శోభరాణి, శ్రీనివాసరెడ్డి, ఒఆర్‌డబ్ల్యు భవాని, రిబ్కా, సునీత పాల్గొన్నారు.

## 'అన్నదాత పోరు'ను జయప్రదం చేయాలి

మార్కాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 9న జరుగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. జవహర్‌నగర్ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా అందుబాటులో లేకుండా కృత్రిమ కొరత సృ ష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అంతేగాక అధిక ధరలకు అమ్ముతూ రైతుల నడ్డి విరుస్తున్నారన్నారు. అన్నదాతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు కేవీ రమణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ సలీం పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు

# ఉపాధ్యాయుల సేవలు అమోఘం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

రాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల విద్యాభివృద్ధికి మీ సేవలు అమోఘమని రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటికె యోగానంద్, టీడీపీ నాయకుడు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విద్యాభివృద్ధికి ఉత్తమ సేవలు అందిస్తున్న 9 మంది ఉపాధ్యాయులను, ఒక సీఆర్పీని మండల విద్యాశాఖ అధికారులు, ఎంపిక చేసి స్థానిక బీసీ భవన్‌లో సోమవారం సన్మాన కార్యక్రమం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది ఏర్పాటు చేయగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నేటి విద్యావిధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యను అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెస్తున్నారన్నారు. భవిష్యత్తులో మేలైన సేవలతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికవ్వాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమానికి బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వీ గిరిధర శర్మ అధ్యక్షత వహించగా, ఉత్తమ ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి, ఎంఈవో షేక్ మొయినుద్దీన్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డితో పాటు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కుట్టుమిషన్‌లు ఇవ్వండి



ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

కంభం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కుట్టుమిషన్ శిక్షణ ముగిసిన తర్వాత పాల్గొన్న మహిళలందరికీ ఉచితంగా కుట్టుమిషన్లు ఇస్తామని చెప్పిన సంబంధిత అధికారులు నేడు పట్టించుకోవడం లేదని పలువురు మహిళలు కంభం మండల ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి అనే మహిళ మాట్లాడుతూ ఆరు నెలల కిందట అధికారులు జీవనోపాధిలో భాగంగా మహిళలకు మూడు నెలలు ఉచితంగా ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని చెప్పడంతో సుమారు 142మంది మహిళలు 3నెలలు కుట్టుమిషన్ శిక్షణ నేర్చుకున్నట్లు తెలిపారు. శిక్షణ ముగిసి 2నెలలైనా ఏజెన్సీ వారు కుట్టుమిషన్లను ఇవ్వలేదన్నారు. ఎప్పుడు ఫోన్ చేసినా వారి నుంచి స్పందన లేదన్నారు. దయచేసి మాకు కుట్టుమిషన్‌లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీవోను కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మహబూబ్ బాషా ఏజెన్సీ వారితో మాట్లాడి కుట్టుమిషన్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



అంధత్వంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్

## పోషకాహార లోపంతోనే అంధత్వం

రాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అంధత్వానికి ప్రధాన కారణం పోషకాహార లోపమని కంటి వైద్య నిపుణుడు జీకే మోహన్‌రెడ్డి అన్నారు. 40వ నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా రాచర్ల గురుకుల పాఠశాలలో బాలికలకు నేత్రదానం ఎలాంటి సమయాల్లో చేయాలి, అంధత్వం ఎలా వస్తుంది తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రపంచ జనాభాలో 15% ప్రజలు అంధత్వంతో, 12 మిలియన్ల ప్రజలు నల్లకన్ను అంధత్వంతో (కార్నియల్ బ్లైండ్ నెస్) బాధపడుతున్నారన్నారు. ఇలాంటి వారికి కార్నియల్ ట్రాన్స్ ప్లాంటేషన్‌తో నల్ల కన్ను మార్పిడి చికిత్స అనే ప్రక్రియ ద్వారా చూపు ప్రసాదించవచ్చన్నారు. అందుకు పాటించవలసిన పద్ధతులపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. మనిషి చనిపోయిన 4 నుంచి 6గంటల లోపు నేత్రాలను దానం చేయవచ్చని హెచ్ఐవీ, హెచ్‌సీవీ, సెప్టీసిమియా రాబిస్ లివసిరోసిస్ క్యాన్సర్, పచ్చకామెర్లు ఉన్నవారు నేత్రదానం చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



రైతు సేవా కేంద్రంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ సుబ్బారావు

## అందుబాటులో యూరియా

### ఏఎంసీ చైర్మన్ సుబ్బారావు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో యూరియా ఎరువుల కొరత లేదని ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు తెలిపారు. రైతు సేవా కేంద్రంలో సోమవారం యూరియా నిల్వలను ఏఎంసీ చైర్మన్ పరిశీలించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని రెతు సేవా కేంద్రాలలో యూరియా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో యూరియా ఎరువులను పొందాలని రైతులను కోరారు. వైసీపీ నాయకులు లేని కొరతను సృష్టిస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని రైతులకు సూచించారు. ఈ రైతు సేవా కేంద్రం వీఏఏలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పుల్లలచెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుల్లలచెరువు వైద్యాధికారి డాక్టరు శ్రీనాథ్ అన్నారు. సోమవారం కమ్మవారిపల్లెలో హెల్త్ క్యాంప్ నిర్వహించి 100 మందికి పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అరటికి ఆకు మచ్చ తెగులు

గిద్దలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న అరటిలో ముఖ్యంగా సిగటోకా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా వ్యాపిస్తున్నదని ఉద్యాన శాఖాధికారి శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ నుంచి నవంబరు వరకు వర్షాకాలంలో దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఆకుపై ఎక్కువగా చిన్న పసుసు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ పెద్దగా మారి బూడిద రంగులోకి మారితే ఈ తెగులు ఉన్నట్లు రైతులు గుర్తించాలన్నారు. అరటి తుట్టులో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, తోటలో కలుపు లేకుండా శుభ్రం చేసుకోవాలన్నారు. తెగులు ఎక్కువగా సోకే రకాలపై మాన్కోజెబ్ 2.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, తెగులు వ్యాప్తి ఎక్కువైతే ట్రాపికనోజోల్ 1 ఎంఎల్ నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. అరటిపండు పరిమాణం, నాణ్యత పెరిగేందుకు గెలలోని ఆఖరి హస్తం విచ్చుకున్న 5వ రోజులు, 15వ రోజు సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే పండు పరిమాణం, నాణ్యత పెరుగుతుందని శ్వేత అరటి రైతులకు సూచించారు.



సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ పెద్దను కోల్పోయి ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బేస్తవారపేట మండలం నేకునాంబాద్ గ్రామానికి చెందిన వల్లెపు శ్రీనివాసులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో కుమారులైన నరసింహ, నాగేంద్రకు రూ.10వేలను ఎమ్మెల్యే అందించారు. ప్రభుత్వపరంగా ఆ కుటుంబానికి సహాయ సహకారాలను అందేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు యామా శ్రీనివాసులు, బత్తుల శంకరయ్య పాల్గొన్నారు.

## ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పామూరు గ్రామ సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో రెండేళ్ల అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రతిరోజు 25 మందికి టోకెన్లు ఇచ్చి ఆధార్ నమోదు చేయాలని నిర్వాహకుడు షేక్ షారూఖ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి వెంకట్రావు, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి కె.సుభాషిణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్లడ్‌లైట్లకు మరమ్మతులు

దర్శి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో గత కొద్దిరోజులుగా మరమ్మతులకు గురైన ఫ్లడ్ లైట్లను సోమవారం బాగు చేశారు. గడియార స్తంభంపై ఏర్పాటుచేసిన ఫ్లడ్‌లైట్లు గత కొంతకాలంగా పనిచేయడంలేదు. దీంతో ఆ కూడలిలో వెలుతురు లేకుండాపోయింది. అలాగే, పట్టణంలో పలుచోట్ల వీధిలైట్లు పనిచేయటం లేదు. అధికారులు ఈ విషయాన్ని గుర్తించి సోమవారం గడియార స్తంభం వద్ద ఫ్లడ్ లైట్లు మరమ్మతులు చేశారు.

## వైద్య సిబ్బందికి సన్మానం

ముండ్లమూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు సుధారాణి, పద్మాంజలి, జానకి, శారద, ప్రియదర్శినిలు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వీరితోపాటు వారి స్థానంలో కొత్తగా వచ్చిన వైద్య సిబ్బందికి సోమవారం ఆరోగ్య కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సీహెచ్‌వో వెంకటరావు అధ్యక్షత వహించగా, వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, మధు శంకర్, సూపర్‌వైజర్ అంజమ్మ, డిప్యూటీ హెచ్ఈవో కేవీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి

పామూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసరాల వస్తువుల ధరలు తగ్గించి రేషన్‌షాపుల ద్వారా సరఫరా చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల డిమాండ్ చేశారు. ధరలు తగ్గించాలని కోరుతూ ప్రజల నుంచి సేకరించిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు సోమవారం అందచేశారు. కార్యక్రమంలో షేక్ మస్తానమ్మ, ధనలక్ష్మి, ఖాదరున్నీసా, రమీజా, తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద ఆశ్రమంలో గ్రహణ దోష నివారణ పూజలు

దొనకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో గ్రహణ దోష నివారణ పూజలు సోమవారం నిర్వహించారు. శ్రీ అన్నపూర్ణ సహిత కాశి విశ్వేశ్వరస్వామి వారికి ఆశ్రమ ప్రధానార్చకులు మణిబాబుశర్మ గ్రహణ దోష నివారణ పూజలు నిర్వహించారు. అనంతరం మహానైవేద్యం, మంగళహారతులు ఇచ్చారు.

## అక్షరాస్యతే అభివృద్ధికి మూలం

దొనకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతే అభివృద్ధికి మూలమని పోలేపల్లి ఎస్సీ కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆదిమూలపు ప్రభుదాస్ అన్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్లేకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముస్లింల హక్కుల పరిరక్షణే లక్ష్యం

పామూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముస్లిం హక్కులతో పాటు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు జమాయితే ఉలమ హింద్ జిల్లా అధ్యక్షుడు రఫి అన్నారు. స్థానిక విరువూరు రోడ్డులో గల మర్కస్ మసీదులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింల సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పామూరు మండల జమాయితే ఉలమ హింద్ నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ కలీంఉల్లా, ఉపాధ్యక్షులుగా షేక్ ఖాజీ ఖాదర్‌బాషా, సయ్యద్ రియాజ్‌బాషా, సభ్యులుగా షబ్బీర్, ఖలీల్, చాంద్‌బాషా, హజీగౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్న ఆనికలపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.భారతిని సీఎస్‌పురం మెయిన్ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా హెచ్ఎం చెన్నకేశవులు మాట్లాడుతూ మెయిన్ పాఠశాలలో పనిచేసిన భారత అత్యుత్తంగా విద్యా బోధన చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.సుబ్బారావు, ఎం.ప్రసాద్, ఎ.శోభారాణి, టిరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# దర్శిలో ట్రాఫిక్ సమస్య తీవ్రం

- రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలుపుదల
- పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు

దర్శి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది జనాభా విపరీతంగా పెరగటంతో వాహనాల రద్దీ అధికమైంది. ప్రణాళిక లేకుండా వాహనాలు రోడ్లపైనే అడ్డగోలుగా పెడుతుండటంతో సమస్య మరింత జటిలమవుతుంది. అధికారులు ఏళ్ల తరబడి పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ పనులు చూసుకొని వెళ్లేవరకు వాహనాలను రోడ్లకు అడ్డంగా పెట్టి వెళ్తున్నారు. దర్శి గడియార స్థంభం సెంటర్‌లో కూరగాయలు, పూలు, పండ్లు ఇతర వస్తువుల కొనుగోలుకు వచ్చిన వాహన చోదకులు బండ్లు రోడ్లపైనే అడ్డంగా గంటల తరబడి పెడుతున్నారు. దర్శి-పొదిలి రోడ్డులో స్టేట్‌బ్యాంక్ వద్ద వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. దీంతో పొదిలి వైపు నుంచి వచ్చే బస్సులు, పెద్ద వాహనాలు వచ్చేందుకు ఇబ్బంది అవుతుంది. దుకాణాల యజమానులు మురుగుకాల్వలతో సహ పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో రోడ్లు కుచించుకుపోయాయి. వాహనాల సంఖ్య పెరిగి నిరంతరం రద్దీగా ఉండటంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దర్శి-పొదిలి రోడ్డులో స్టేట్ బ్యాంక్‌కు ఒకవైపు బారీగా వాహనాలు నిలుపుతుండగా, ఎదురుగా ఉన్న మద్యం షాపు వద్ద అడ్డగోలుగా వాహనాలు పెడుతున్నారు. ఎన్నోఏళ్లగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు పరిష్కార మార్గం ఆలోచించడంలేదు.



దర్శిలోని గడియారస్తంభం సెంటర్‌లో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు



దర్శి - పొదిలి రోడ్డులో స్టేట్‌బ్యాంక్ వద్ద రోడ్డుపై నిలిపిన వాహనాలు

### పార్కింగ్ స్థలంలేక ఇబ్బందులు

దర్శి పట్టణంలో ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుంది. నిరంతరం వందలాది వాహనాలు రోడ్ల మార్జిన్లలో, కొన్నిచోట్ల అడ్డంగా పెడుతుండటంతో సమస్య జటిలమవుతుంది. పోలీసులు గస్తీలు తిరుగుతూ వాహనాలు అడ్డుపెట్టకుండా అప్పుడప్పుడు ప్రయత్నిస్తున్నా ఆతర్వాత ప్రజలు పట్టించుకోవటం లేదు.

వాహనాలను యథావిధిగా రోడ్లపై అడ్డగోలుగా పెడుతూనే ఉన్నారు. పార్కింగ్ స్థలం లేకపోవటంతో ఇతర గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చిన వాహనాచోదకులు తమ వాహనాలను ఎక్కడ పెట్టుకోవాలని ప్రశ్నిస్తున్నారు. అధికారు లు పార్కింగ్ స్థలం ఏర్పాటుచేస్తే అక్కడ పెట్టుకొని తమ పనులు పూర్తి చేసుకొని తిరిగి వాహనాలు తీసుకెళ్లేందుకు అనువుగా ఉంటుందని చెబుతున్నారు. గత పది సంవత్సరాలుగా అధికారులు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే గాని ఆచరణలో అమలు కావటంలేదు.

అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవటంతో ట్రాఫిక్ సమస్య జటిలమైనప్పుడు హడావుడి చేయటమే తప్పా ఆతర్వాత పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎరువులపై వైసీపీ అసత్య ప్రచారం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజం

దర్శి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేకపోయినప్పటికీ వైసీపీ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సోమవారం ఓప్రకటన విడుదలచేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎరువుల కొరత లేకుండా సీఎం చంద్రబాబు ముందుగానే కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి అవసరమైన మేరకు యూరియాతో పాటు అన్నిరకాల ఎరువులను తెప్పించినట్టు చెప్పారు. ప్రస్తుతం అన్నిప్రాంతాల్లో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.

దర్శి నియోజకవర్గంలో అన్ని షాపుల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్న విషయాన్ని గుర్తించకుండా వైసీపీ ఆందోళనలు చేపట్టటం శోచనీయమన్నారు. మాజీ సీఎం జగన్, వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మటం లేదన్నారు. గత వైసీపీ హయాంలో రైతుల గురించి పట్టించుకున్న నాథుడు లేడన్నారు. రాజకీయ లబ్ధి కోసం రైతుల మీద కపటప్రేమ చూపుతూ లేని సమస్యను సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలు అన్ని విషయాలు గమనిస్తున్నారని చెప్పారు.

వైసీపీ నాయకులు ఇదే తీరుగా వ్యవహరిస్తే గణపాఠం చెబుతారని ఆమె స్పష్టం చేశారు. ఎక్కడైనా రైతులకు ఎరువులు అందకపోతే సమస్యను తమ దృష్టికి గాని, అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- సీఐ ఖాజావలి

కనిగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ ఖాజావలి అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరన్నా ఇబ్బందులు కలిగిస్తుంటే వారి వివరాలను తెలియజేయాలని కోరారు. గ్రూపు తగాదాలు, వర్గవైషమ్యాలు రెచ్చగొట్టేవారి వివరాలు తెలియజేయాలన్నారు. తెలిపినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాలే దేశానికి వెన్నుముక అని అన్నారు. అలాంటి గ్రామాలు ప్రశాంతంగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు.



మాట్లాడుతున్న సీఐ ఖాజావలి, పక్కన ఎస్ఐ శ్రీరాం, తహసీల్దార్ రవిశంకర్

తహసీల్దార్ ఏ.రవిశంకర్ మాట్లాడుతూ యూరియా కొరత ఉందంటూ చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు, ప్రజలు నమ్మవద్దన్నారు. అది పూర్తిగా అవాస్తవమన్నారు. రాష్ట్రంలో రైతులను పక్కదోవ పట్టించి ప్రభుత్వ యంత్రాంగంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈక్రాప్ ఆధారంగా ఇంకా అదనంగా యూరియా, ఎరువులు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు నిషేధించినట్టు చెప్పారు. గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై తగిన ఆధారాలతో అధికారులను సంప్రదిస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.శ్రీరాం, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యుత్‌చౌర్యంపై విజిలెన్స్ దాడులు

పీసీపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్‌చౌర్యంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. ఈఈ ఉమాకాంత్ ఆధ్వర్యంలో 80మంది సిబ్బంది 25బృందాలుగా విడిపోయి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మీటర్లు ఉండి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8మందిని గుర్తించి 2.42లక్షల అపరాధ రుసుం విధించారు. అనధికారకంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 9మందిని గుర్తించి రూ.25 వేలు అపరాధ రుసుం విధించారు. ఈసందర్భంగా పీసీపల్లి సబ్‌స్టేషన్‌లో కనిగిరి డివిజన్ విద్యుత్ ఈఈ ఉమాకాంత్ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. అక్రమంగా విద్యుత్‌ను విని యోగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీ ర్‌లు హైమావతి, కె.వెంకటేశ్వర్లు, డీఈఈ క్రిష్టారెడ్డి, ఏఈఈ కోటేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఏఈఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లి సబ్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఈఈ ఉమాకాంత్

# యూరియా కొరత సృష్టిస్తే ఉద్యమిస్తాం

- సీపీఐ నేత వై.రవీంద్రబాబు

కనిగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత సృష్టిస్తే ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.రవీంద్ర బాబు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. యూరియాతో పాటు ఎరువులను ప్రభుత్వం అందించకుండా ఇబ్బందులను గురి చేస్తుందని ఆరోపించారు. కూటమి నేతలు కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తు న్నారన్నారు. కూటమి నేతలు డబుల్ ఇంజన్ సర్కారు అధికారంలో ఉందని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. అంత గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం ముందుచూపు లేనికారణంగా ఎరువుల కొరత ఏర్పడిందని ఎద్దేవా చేశారు. రైతులు యూరియా కోసం రోడ్డెక్కుతున్న ప్పటికి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈమేరకు తహసీల్దార్ రవిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.




మాట్లాడుతున్న సీపీఐ నేత రవీంద్రబాబు

కార్యక్రమంలో గుజ్జుల బాలిరెడ్డి, ఖాసింపీరా, పి.సుబ్బారావు, సీహెచ్ పవన్‌కల్యాణ్, వెలుగొండయ్య, రాము, పి.శ్రీను, ఆర్.అంకమ్మ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ పరిరక్షణకు ఏపీటీఎఫ్ రాజీలేని పోరాటం

తాళ్లూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యారంగ పరిరక్షణకు ఏపీటీఎఫ్ రాజీలేని పోరాటంచేస్తుందని ఆసంఘం నేత పోలంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం తూర్పుగంగవరం ఎంపీపీ పాఠశాలలో జరిగిన ఏపీటీఎఫ్ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, నాణ్యమైన విద్యకోసం, విద్యారంగ పరిరక్షణకు పోరాడుతున్నట్టు చెప్పారు. అనంతరం మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడిగా గండూరి నాగరాజు, ప్రధానకార్యదర్శిగా నారిపెద్ది శ్రీనివాసరావు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా లేవి ప్రసాద్, యోహాన్‌రెడ్డి, పద్మావతిలు వ్యవహరించారు. మండలంలో సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు హనుమంతరావు, నాగేశ్వరరావు, అంజిరెడ్డిలను, వేరే మండలానికి బదిలీపై వెళ్లిన శేషు, మాస్టార్‌లను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో నాయకులు రవిచంద్రారెడ్డి, యాకోబు, అశోక్ చక్రవర్తి, ఖాజావలి, చంద్రిక, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ రవిబాబు

ముండ్లమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవాపురంలో శ్రీలక్ష్మీ ట్రేడర్స్, సాయి వెంకటతేజా ట్రేడర్స్, లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్‌పై సోమవారం ఒంగోలు విజిలెన్స్ సీఐ సీహెచ్ రవిబాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మూడు షాపుల్లో రూ.10.77 లక్షలు ఎరువులకు సంబంధించి తేడాలు రావటంతో కేసు నమోదు చేసినట్టు సీఐ రవిబాబు తెలిపారు. ఈషాపుల్లో యూరియా రైతులకు సరిపడ ఉందని తెలిపారు. డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువుల్లో వ్యత్యాసం ఉందన్నారు. రూ. 10.77 లక్షలమేర ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఏవో ఏ.తిరుమలరావు, విజిలెన్స్ వ్యవసాయ అధికారి శివనాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలు

దొనకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలోనూ ఎండలు మండుతున్నాయి. మరో వేసవిని తలపించేలా గత మూడు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతుండటంతో ఉక్కపోత, ఎండ వేడిమితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దొనకొండలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా మారింది. ఉదయం 10 గంటలకే ప్రజలు బయట పనులు ముగించుకొని ఇంటి దారి పడుతున్నారు.

## తాళ్లూరును 'ప్రకాశం'లోనే కొనసాగించాలి

తాళ్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కైపు వెంకటకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం తాళ్లూరులో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లూరు మండలంలోని గ్రామాలు ఒంగోలుకు కేవలం 37 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. 90 కిలోమీటర్ల దూరంలోఉన్న కొత్తగా ఏర్పాటయ్యే మార్కాపురం జిల్లాలో కలిపితే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కూటమి ప్రభుత్వంలోని నాయకులు తాళ్లూరు మండలంలోని గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూకట్ల వీరబ్రహ్మం, గోరంట్ల కోటేశ్వరరావు, పాలేటి మహేష్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ అభివృద్ధికి సహకరించాలి

పామూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కనిగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేయాలని ఏడీఎం సీహెచ్ వరలక్ష్మిని వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం ఒంగోలులో మార్కెటింగ్ ఏడీఎంను ఏఎంసీ వైస్‌చైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ఏఎంసీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈనెల 12న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సారథ్యంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమెను ఆహ్వానించారు. ఏడీఎంను కలిసిన వారిలో మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలపర్తి రమాదేవి ఉన్నారు.



ఏడీఎంను కలిసిన ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు దంపతులు

## ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాల కార్యకర్తలను అసభ్య పదజాలంతో దూషిస్తూ, దాడికి పాల్పడిన ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రేగులచెలక గ్రామానికి చెందిన ఓరైతు సమస్య గురించి మాట్లాడేందుకు ఆదివారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు పై ఎస్ఐ, కానిస్టేబుల్ చంద్రానాయక్ అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడినట్లు తెలిపారు. సమావేశంలో ఊసా వెంకటేశ్వర్లు, ఎన్‌తిరుపతిరెడ్డి, ఎం.రత్నారెడ్డి, రాజ్యలక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు అందజేత

పామూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులను టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పందిటి హరీష్ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ముసలయ్య, నాయకులు పి.నరసింహారావు, ఎస్.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## కుట్టుశిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిలయన్స్, సార్డ్ సంస్థ ప్రతినిధులు అజయ్ అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో సోమవారం మహిళలకు కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు కుట్టు ఉపాధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ షేక్ మహ్మద్‌బాషా, సర్పంచ్ మునగల బ్రహ్మారెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా చూడాలి

పామూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మౌలాలి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. యూరియాను కృత్రిమ కొరతు సృష్టించి వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి రైతులకు సక్రమంగా యూరియా అందేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.ప్రభాకర్, వజ్రాల ప్రభాకర్, పి.రఘునాథరెడ్డి, ఆర్.సూరిబాబు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## విషజ్వరంతో మహిళ మృతి

ముండ్లమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులో పామూరి మహాలక్ష్మి(60) అనే మహిళ విషజ్వరంతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ స్థానికంగా ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. జ్వరం తీవ్రత కావటంతో కుటుంబసభ్యులు దర్శి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు.

## చివరి భూములకు నీరు అందించేందుకు కృషి

ముండ్లమూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మోదేపల్లి మేజరు పరిధిలోని చివరి భూములకు నీరు అందించేందుకు కృషిచేస్తున్నట్టు డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పోలవరం మైనర్ పరిధిలో ఆధునీకరణ పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా కాలువల్లో చిల్ల చెట్లు పెరిగి చివరి భూములకు నీరు చేరటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మేజర్లు, మైనర్ కాలువలను బాగు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ముప్పాళ్ళ కోటేశ్వరరావు, గంగినేని శేషగిరిరావు, రావెళ్ళ శ్రీనివాసరావు, కొర్రపాటి బుచ్చిబాబు, కొర్రపాటి శ్రీనివాసరావు, పరుచూరి శ్రీనివాసరావు, కిలారి ప్రసాద్, మాజీ సర్పంచ్ మాలెంపాటి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు

మంగళవారం 9 సెప్టెంబరు 2025




చంద్రవంక నదిపై నిర్మించిన ఆక్విడెక్టు

## ప్రమాదపు అంచుల్లో బొంబాయి బ్రిడ్జి

- బ్రిడ్జిని అల్లుకున్న చెట్లు, లీకవుతున్న నీరు
- ప్రమాదం జరిగితే తాగు, సాగునీటికి ఇక్కట్లు

మాచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ సమీపంలోని సాగర్ కుడి కాలువ వద్ద చంద్రవంక నదిపై బొంబాయి కంపెనీ నిర్మించిన ఆక్విడెక్టు ప్రమాదపు అంచుల్లోకి చేరుకుంది. ఆక్విడెక్టు చుట్టూ మర్రిచెట్లు, జువ్విచెట్లు అల్లుకుపోవడంతో నెర్రలిచ్చి నీరు లీకవుతోంది. సాగర్ కుడి కాలువ 15వ కిమీ వద్ద మాచర్ల సమీపంలో బొంబాయికు చెందిన కాంట్రాక్టర్ కంపెనీ ఆక్విడెక్టును నిర్మించింది. చంద్రవంక నదికి వరద నీరు ప్రవహించేందుకు బ్రిడ్జిని నిర్మించి దానిపై భాగంలో కుడి కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం జరిగేలా బొంబాయి కంపెనీ ఆక్విడెక్టును నిర్మించింది. కింది భాగంలో ఆరు కానాలు ద్వారా 33,750 క్యూసెక్కుల చంద్రవంక వరద నీరు ప్రవహించేలా ఏర్పాటు చేసింది. అయితే ఆక్విడెక్టు చుట్టూ మర్రిచెట్లు, జువ్విచెట్లు అల్లుకుపోవడంతో నెర్రలిచ్చి నీరు లీకవుతోంది. బ్రిడ్జికి ఇరువైపులా పెద్ద పెద్ద వృక్షాలు పెరిగి ప్రమాదభరితంగా మారాయి.

**ప్రమాదం జరిగితే..**

సాగర్ కుడి కాలువ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 6,68,230 ఎకరాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 4,43,180 ఎకరాలు మొత్తం కలిపి 11,11,410 ఎకరాల ఆయకట్టుకు సాగు, తాగునీరు ప్రవహిస్తోంది. ఆక్విడెక్టుకు ప్రమాదం జరిగితే దాని పునర్నిర్మాణానికి భారీ వ్యయంతోపాటు సమయం వృథా అవుతాయి. అలాగే ఆయకట్టుకు సాగునీటితోపాటు తాగునీరు అందక గ్రామాలు అల్లాడిపోతాయి. ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా దీనిపై ప్రత్యేక దృష్టి సారించి చెట్లను తొలగించి లీకులను అరికట్టాల్సి ఉంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. వృక్షాలు ఆక్విడెక్టును కమ్మేస్తుంటే వారు కన్నెత్తి కూడా చూడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. నెర్రలు పెద్దవై జరగరానిది జరిగితే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇరిగేషన్ అధికారులు సత్వరమే స్పందించి వృక్షాలను తొలగించి మరమ్మతులు నిర్వహించి లీకులను అరికట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ఆక్విడెక్టు చుట్టూ పెరిగిన చెట్లు, లీకవుతున్న నీరు

## మంగళగిరికి.. పసిడి వెలుగులు

- గోల్డ్ హబ్‌కు రంగం సిద్ధం
- 78 ఎకరాల్లో గోల్డ్ క్లస్టర్
- సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు
- అసైన్డ్ భూముల్లో.. భూసమీకరణ
- 171 మంది భూయజమానులకు కలుగనున్న లబ్ధి
- సీఆర్‌డీఏకు ప్రతిగా నాలుగెకరాలు
- ప్రారంభమైన కార్యాచరణ

జాతీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మంగళగిరిలో అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటవుతోంది. అదే జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు. దేశంలో కెల్లా అతిపెద్ద గోల్డ్ హబ్‌గా దీనిని తీర్చిదిద్దే ప్రణాళిక రూపుదిద్దుకుంటుంది. తొలిదశలో రూ. అయిదు వేల కోట్ల పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా ఏర్పాటవుతున్న ఈ గోల్డ్‌హబ్ అతిత్వరలోనే మరిన్ని వేలకోట్ల పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రంగా మారుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నగరంలోని తెనాలి రోడ్డు వెంబడి 78 ఎకరాల విస్తీర్ణంలో దీనిని నెలకొల్పేందుకు ఏపీ సీఆర్‌డీఏ సన్నద్ధమైంది. భూసమీకరణ రూపంలో భూములను సేకరించడంతోపాటు సంబంధిత వెంచర్‌ను అభివృద్ధి చేసే బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం సీఆర్‌డీఏకు అప్పగించింది. ఈ వెంచర్‌ను అభివృద్ధి చేసినందుకుగాను ఆ సంస్థకు నాలుగెకరాల భూమిని ఇచ్చేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులను వెలువరించింది. ఈ మొత్తం అభివృద్ధి ప్రణాళికంతా మంత్రి నారా లోకేశ్ మస్తిష్కంలో రూపుదిద్దుకుందే కావడం గమనార్హం!



మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం ఎంపిక చేసిన స్థలం

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

మంగళగిరి అభివృద్ధిని పరుగులు పెట్టించనున్న మరో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు. దాదాపు అయిదువేల కోట్ల పెట్టుబడులతో ప్రారంభం కానున్న గోల్డ్ క్లస్టర్...మంగళగిరికి అంతర్జాతీయ చిత్రపటంలో ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ఈ ప్రాజెక్టును తెనాలి రోడ్డు వెంబడి అక్షయపాత్ర ఫౌండేషన్ భవన సముదాయానికి దక్షిణంగా సుమారు 78.01 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం తుది నిర్ణయానికి వచ్చేసింది. ఈ ప్రాజెక్టు సన్నాహక బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం ఇటీవలే జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో సీఆర్‌డీఏకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. గోల్డ్ క్లస్టర్‌కోసం ఎంచుకున్న ఈ భూమి ఆత్మకూరు పరిధిలో సర్వే నెం.లు 132, 133, 134 కింద వున్నాయి. అయితే ఇవన్నీ అసైన్డ్ భూములు. అయినప్పటికీ రాష్ట్రప్రభుత్వం రాజధాని అమరావతి కోసం వినియోగించిన ఫార్ములానే ఇక్కడ కూడ వినియోగించేలా నిర్ణయం తీసుకుంది. భూసమీకరణ కింద 34వేల ఎకరాలకు పైగా భూములను ఒక్క పైసా ఖర్చులేకుండా తీసుకున్న రాష్ట్రప్రభుత్వం గోల్డ్ క్లస్టర్ కోసం కూడ అదే భూసమీకరణ ఫార్ములాను మళ్లీ ప్రయోగిస్తుంది. ఈ మొత్తం అసైన్డ్ భూములన్నింటినీ కూడ పూర్తిగా భూసమీకరణ కిందే తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ ద్వారా మొత్తం 78.01 ఎకరాలను సేకరించడంతోపాటు గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు బాధ్యతలను కూడ సీఆర్‌డీఏ చేపట్టేవిధంగా మంత్రివర్గ సమావేశంలో తీర్మానించారు. అంటే వెంచర్‌ను ఏర్పాటుచేయడం మొదలు మౌలిక సదుపాయాల కల్పనంతా (మిగతా 6లో)

## ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి

బాపట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ప్రజా సమస్యల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించి కొన్నిటికి తక్షణమే పరిష్కారం చూపించారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నాణ్యత చూపని అధికారులపై తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన అధికారులను హెచ్చరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించిన వాటికి ఆడిటింగ్ పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆడిటింగ్ చేయటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వార్తపత్రికలలో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై కలెక్టర్ స్పందించి ఆయాశాఖలకు సంబంధించిన అధికారులను ఆయన ప్రశ్నించారు? అధికారులు ఆయా వార్తలపై కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు క్యూలైన్‌లో కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ వారికి షామియానాలు, మంచినీరు అందుబాటులో ఉంచాలని పోలీసులకు ఆయా కేంద్రాలలో విధులు కేటాయించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో భూములు, పొలాలు, ఇళ్ల స్థలాల రీసర్వే జరుగుతుందని, స్వమిత్వ సర్వే కూడా జరుగుతుందన్నారు.

## యూరియా కోసం రైతుల క్యూ

- అధిక ధరయినా చెల్లించి కొనేందుకు సిద్ధం

తెనాలి క్రైం, రేపల్లె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క యూరియా కొరత లేకుండా చూస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా రైతాంగంలో ఆందోళన తగ్గడం లేదు. సోమవారం తెనాలిలోని మారీసుపేట, గంగానమ్మపేట ప్రాంతాల్లో రైతులు యూరియా కోసం ఎరువుల షాపుల ముందు క్యూలు కట్టారు. ప్రస్తుతం వెదసాగు 60 రోజులకు చేరింది. పంట 70 నుంచి 90 రోజుల మధ్య చిగురు వేస్తుంది. ఈ సమయంలో పంటకు ఎరువుల అవశ్యకత ఉంటుంది. అప్పటికి యూరియా అందుతుందో లేదో అన్న ఉద్దేశ్యంతో ఎక్కువ మంది రైతులు యూరియా కోసం క్యూలు కడుతున్నారు. ప్రభుత్వం బస్తా యూరియాను రూ.270కి అందిస్తుండగా రైతులు రూ.300 నుంచి 350 చెల్లించడానికి కూడా సిద్ధపడి షాపుల వద్ద బారులు తీరుతున్నారు. దీనిని అవకాశంగా తీసుకుని కొందరు వ్యాపారులు అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నారు. కాగా, పలుకుబడి, నాయకుల సిఫార్సు ఉన్నవారికే షాపు యజమానులు యూరి యాను అందిస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. నిజాంపట్నం గ్రామంలో యూరియా కోసం రైతులు గంటలు తరబడి వేచి ఉన్నా యూరియా అందకపోవడంతో తీవ్ర ఆగ్రహం వెల్లిబుచ్చారు. యూరియా కోసం వచ్చే రైతులు ఎండలో నిలబడకుండా టెంట్‌లు వేయాలని జిల్లా ఉన్నతాధికారి ఆదేశించినా ఆ దిశగా ఇక్కడ చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు ఎండలోనే యూరియా కోసం నిలబడాల్సి వచ్చింది. రేపల్లె పట్టణంలో యూరియా కోసం రైతులు పడిగాపులు కాసి సహనం కోల్పోయి తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయనపైకి దూసుకెళ్లారు. దీంతో పోలీసులు కలగజేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చి రైతులను తిరిగి క్యూలో నిలబెట్టారు.



నిజాంపట్నంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో నరేంద్రవర్మ భేటీ



సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడుతూ, సూర్యలంక బీచ్ ఫెస్టివల్ గురించి ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే నరేంద్రవర్మ తెలిపారు. సీఎంను స్వయంగా కలిసి సూర్యలంక తీరంలో చేపడుతున్న కార్యక్రమాల ఏర్పాట్లను వివరించినట్లు చెప్పారు. బీచ్ ఫెస్టివల్‌కు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను సీఎం అడిగి తెలుసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం బాపట్ల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి సీఎంతో చర్చించినట్లు వెల్లడించారు. అలాగే రాబోయే రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి మంజూరు చేయాల్సిన నిధులు గురించి ముఖ్యమంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఇటీవల సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఉచిత బస్సు పథకం అమలు చేసినందుకు బాపట్ల నియోజకవర్గ మహిళల తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి దన్యవాదాలు తెలిపానని వెల్లడించారు. ఈ నెల 27న చంద్రబాబు బీచ్ ఫెస్టివల్ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సూర్యలంక అభివృద్ధి కోసం రూ. 97 కోట్లను కేటాయించటం హర్షణీయమని, ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ పర్యాటక కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని సీఎంను కోరానని నరేంద్రవర్మ తెలిపారు.

## పట్టించుకునే వాడే కరువాయే

- రోడ్డుకిరువైపులా దట్టంగా చిల్లచెట్ల విస్తరణ
- పర్చూరు- చెరుకూరు, ఇంకొల్లు దారుల్లో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు



కొమర్నేనివారిపాలెం-చెరుకూరు మధ్య రోడ్డుపైకి విస్తరించిన చిల్లచెట్లు

పర్చూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్చూరు నుంచి చెరుకూరు, ఇంకొల్లు వెళ్లే రహదారులకు ఇరువైపులా దట్టంగా చిల్లచెట్లు విస్తరించి ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగిపోయి ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. రోడ్డు మార్జిన్‌లో ఎక్కడ చూసిన చిల్లచెట్లు పెరిగిపోయి రోడ్డుపైకి విస్తరించి ప్రమాద భరితంగా మారాయి. ఓ పక్క రోడ్లు పాడై అధ్వాన్నంగా తయారవగా మరోవైపు చిల్లచెట్లు రోడ్డుపైకి విస్తరించటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. రోడ్ల మలుపుల వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. ఇటీవల పర్చూరు నుంచి చెరుకూరు వెళుతుండగా కొమర్నేనివారిపాలెం సమీపంలో చిల్లచెట్ల మధ్య ఎదురుగా వస్తున్నా వాహనాన్ని గుర్తించకపోవటంతో ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో వాహనదారుడు ఆయన భార్య తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. ఇలాంటి ఘటనలు ఈ రోడ్లపై కోకొల్లలు. పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్లే పాత మద్రాస్ రోడ్డులో పరిస్థితి ఇలానే ఉంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్ల మార్జిన్‌లో విస్తరించిన చిల్లచెట్లను తొలగించి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నిబంధనల సడలింపుపై ఆశలు

- జిన్నింగ్ మిల్లుల యజమానులతో నేడు సీసీఐ సీఎండీ సమావేశం..!
- మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో చర్చలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులకు, సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి మధ్య ఏర్పడిన ప్రతిష్ఠంభన తొలగేందుకు మార్గం సుగమమైంది. గుంటూరులోని రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా మంగళవారం భేటీ కానున్నారు. పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సీసీఐ జారీ చేసిన టెండర్ ప్రక్రియను ఏపీలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు బహిష్కరించిన నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం ఆసక్తిని కలిగిస్తోంది. ఆగస్టు 12వ తేదీన సీసీఐ విడుదల చేసిన టెండర్ నోటిఫికేషన్‌లోని కొన్ని నిబంధనలపై జిన్నింగ్ మిల్లుల యజమానులు భగ్గుమంటున్నారు. వాస్తవానికి ఈ సీజన్‌లో వచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లోని నిబంధనలను రాష్ట్రంలోని జిన్నర్లే కాకుండా, దేశంలో మిగతా రాష్ట్రాలకు చెందిన వారు కూడా వ్యతిరేకిస్తున్నారు. బిడ్డింగ్‌కు సెప్టెంబరు 1వ తేదీని సీసీఐ గడువు విధించినప్పటికీ దేశవ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్లు వేయలేదు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, మిల్లులను ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5లుగా విభజించటం, పత్తిని ఫలానా చోటే రైతులు అమ్ముకోవాలని ఆదేశించడం, దూది నాణ్యత శాతాన్ని పెంచాలన్న నిబంధనలను మిల్లుల యజమానులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ అధికారులతో సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిన్నింగ్ మిల్లుల యజమానుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి సీఎండీతో సమావేశం నిర్వహించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. మంత్రితో సమావేశం ముగిసిన తర్వాత వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శికి మార్కెటింగ్‌శాఖ కమిషనర్ సీసీఐ సీఎండీతో మీటింగ్ ఏర్పాటుపై లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేఖ వెళ్ల డంతో జిన్నింగ్ మిల్లుల యాజమానులతో చర్చలు జరిపేందుకు సీసీఐ సీఎండీ మంగళవారం గుంటూరుకు వస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో జరగనున్న సమావేశంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో పాటు, వ్యవసాయశాఖ, మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొంటున్నట్లు సమాచారం. టెండర్ నిబంధనలను సడలిస్తే జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తాము సిద్ధమేనని యజమానులు చెబుతున్నారు.



## కుందేరు ఆక్రమణదారులపై ఉక్కుపాదం



- ఆక్రమణలు తొలగించి అభివృద్ధికి ప్రణాళికలు
- ఇప్పటికే రూ.89 కోట్లతో ప్రతిపాదనలు

చీరాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాపట్ల మండలం నుంచి చినగంజాం మండలం వరకు సహజ సిద్ధంగా ఏర్పడిన కుందేరు వాగు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలిగించి అభివృద్ధి చేస్తే సుందరీ కరణ నెలకొనడంతో పాటు, ఆదాయం వచ్చే అవకాశం ఉందని పాలకులు, అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం కుందేరు గుర్రపు డెక్కతో దుర్గంధం వెదజల్లుతోంది. పేరుకుపోయిన చెత్త చెదారాలతో దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుందేరు వాగు బాపట్ల జిల్లాలో బాపట్ల, చీరాల, వేటపాలెం, చిన గంజాం మండలాల్లో ప్రవహిస్తోంది. సహజ సిద్ధంగా ఏర్పడి ప్రజలకు తుఫాన్‌లు, వరదల సమయంలో రక్షణగా ఉండే ఈ వాగు ప్రస్తుతం ఆక్రమణలకు గురై కుంచించుకు పోయింది. ఈ నేపథ్యంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యే లు నరేంద్రవర్మ, ఎంఎం కొండయ్య కుందేరు అభివృద్ధిపై ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలోనే జిల్లాస్థాయి అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఆక్రమణలపై అంచనాలు వేశారు. ఇటీవల కాలంలో ఆక్రమణలను తొలగించాలని కచ్చితమైన ఆదేశాలు జారీ చేయడంతో ఆక్రమణ దారుల్లో ఒకింత వణుకు పుడుతోంది.

### అభివృద్ధితో ఆదాయం- సుందరీకరణతో ఆనందం

జిల్లాలో కుందేరు వాగు ప్రభుత్వ రికార్డుల ప్రకారం బాపట్ల మండలం పేరలి మొదలుకుని బాపట్ల, వెదుళ్లపల్లి, చీరాల, వేటపాలెం, చినగంజాం వరకు ప్రవహిస్తోంది. ఒక్క చీరాల డివిజన్ పరిధిలోనే ఈ వాగు చుట్టూ సుమారు 143 అనధికార నివాసాలు ఏర్పడ్డాయి. కబ్జాకోరల్లో ఉన్న కుందేరును అభివృద్ధి చేసి భవిష్యత్తుతరాలకు ప్రయోజనకరంగా మార్చేందుకు పాలకులు, అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి ఓ అంచనాకు వచ్చారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు డ్రైనేజీశాఖ అధికారులు వాగు అభివృద్ధికి సంబంధించి రూ.89 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రధాన ప్రాం తాల వద్ద కుందేరుకు రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించి పార్కులు, వాకింగ్ ట్రాక్ సౌకర్యాలు కల్పిస్తే ఆదాయంతో పాటు ప్రజలకు ఆనం దం ఉంటుందని భావిస్తున్నారు. అయితే ప్రజలు మాత్రం ఈ సారి వాగు ఆక్రమణలకు గురి కాకుండా శాశ్వత పరిష్కారాన్ని చూపాలని కోరుతున్నారు. అధికారులు తీసుకునే చర్యలు నిజంగా పారదర్శకంగా ఉంటే ఆక్రమణ దారులపై ఉక్కుపాదం తప్పదు.

### 17న బల్లికురవలో విశ్వకర్మ మహా యజ్ఞం

బల్లికురవ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవలో ఈ నెల 17వ తేదీన గాయత్రీ సమేత విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి ఉపనిషత్ పారాయణం, మహా ఉపనిషత్ పారాయణం, మహాగణపతి పూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, విశ్వకర్మ పతాకావిష్కరణ, అగ్నిప్రతిష్ఠ, మహాశాంతి యజ్ఞం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంతో పాటు పరిసర మండలాల్లోని విశ్వబ్రాహ్మణులు కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు.

### గుంటుపల్లి కేజీబీవీలో జీసీడీవో తనిఖీ

బల్లికురవ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీవో చారులత సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఒకేషనల్ కోర్సు ద్వారా వృత్తి శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. చదువుతోపాటు వృత్తి శిక్షణ పొందాలని సూచించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతిగృహ భవనాల పనులను సమగ్ర శిక్ష జిల్లా ఈఈ నాగజ్యోతి పరిశీలించారు

### ఉపాధి కూలీలకు తీపికబురు

**వేతన బకాయిలు విడుదల**

**జిల్లాలో రూ.119 కోట్లు బకాయిలు**

**లక్షలాది కుటుంబాలకు ఊరట**

**రెండుమూడు రోజుల్లో జమ**

ఒంగోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లక్షలాది మంది ఉపాధి హామీ పథకం కూలీలకు ఊరట లభించనుంది. వారికి ఉన్న వేతన బకాయిలను కేంద్రం విడుదల చేసింది. సుమారు రూ.119 కోట్ల వేతన బకాయిలు రెండు, మూడు రోజుల్లో కూలీల బ్యాంకు అకౌంట్లకు నగదు జమకానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేకించి వేసవి కాలమైన తొలి నాలుగు నెలల్లో పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా పనులు జరిగాయి. జిల్లాలోనూ అలాగే లక్షలాది కుటుంబాలకు చెందిన కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు 2.86 లక్షల కుటుంబాలకు చెందిన 4.94 లక్షల మంది కూలీలు పనులకు రాగా వారికి మొత్తం రూ.99.64లక్షల పనిదినాలు కల్పించారు. అందుకుగాను వారికి వేతనాల రూపంలో సుమారు రూ.252.45 కోట్ల మేర లభించింది. సగటున ఒక్కొక్క కుటుంబానికి 34.75 రోజుల పనిదినాలు లభించగా ఒక్కొక్కరికి సగటున రోజుకు రూ.252.25 మేర వేతనం లభించింది. అయితే కూలీలు చేసిన పనులకు పెద్ద ఎత్తున వేతనాలు బకాయిలు పేరుకపోయాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు నిత్యం రెండు లక్షల మంది జిల్లాలో పనులకు హాజరయ్యారు.ఆ మూడు నెలల్లోనే జిల్లాలో 93 లక్షల పనిదినాలు కల్పించారు.

**కేంద్రం నుంచి నిధులు విడుదల**

అయితే ఏప్రిల్ నుంచి మే 15 వరకు చేసిన పనులకు మాత్రమే కూలీలకు వేతనాల చెల్లింపు జరగ్గా అనంతరం చేసిన పనులకు ఆగిపోయాయి. అలా మే 15 నుంచి వేతనాల బకాయిలుగా ఆగిపోవడంతో కూలీలు అవస్థలు పడుతూ ఆందోళన చెందుతున్నారు. పిల్లల చదువుల కోసం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యే జూన్, జూలై నెలల్లో ఈ డబ్బును ఎక్కువగా కూలీలు అధికంగా వాడుతుంటారు. అలాంటి వారికి ఈ ఏడాది డబ్బులు అందక అవస్థలు పడ్డారు. అలా దాదాపు 15 వారాలుగా నిలిచిన బకాయిలను చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం పలుమార్లు కేంద్రంతో సంప్రదింపులు జరుపగా మే 15 నుంచి ఆగస్టు 15 వరకు ఉన్న బకాయిలు మొత్తం సుమారు రూ.16,668 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఆగస్టు 15 తర్వాత చేసిన పనులకు మరో రూ.137 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతం ఆగస్టు 15 వరకు విడుదల చేసిన బకాయిల మొత్తాల నగదును రెండు, మూడు రోజుల్లో కూలీల ఖాతాలకు జమచేయనున్నారు. కాగా తాజా బకాయిలు విడుదలతో జిల్లాలోని కూలీలకు సుమారు రూ.119 కోట్ల మేర డబ్బులు జమ కానున్నాయి. ఈ ఏడాది మొత్తం రూ.252.45 కోట్ల మేర వేతన రూపంలో కూలీలకు లభించింది. అందులో రూ.132.72 కోట్లు గతంలోనే జమకాగా మే 15 నుంచి చేసిన పనులకు సంబంధించి రూ.119.73 కోట్ల బకాయిలు ఉన్నాయి. అందులో ఆగస్టు 15 నాటికి రూ.119 కోట్ల బకాయిలు ఉండనుండగా ఆ మొత్తం ప్రస్తుతం విడుదలైంది.

# పంగులూరులోనే బర్లీ పొగాకు కొనాలి

**పిడుగురాళ్లలోని కొనుగోలు కేంద్రానికి బేళ్లు తరలించడం**

**రైతులకు కష్టంతో కూడుకున్న పని**

**తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన రైతుసంఘం నేత నాగబోయిన**



తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేస్తున్న రంగారావు, రైతులు

పంగులూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు కొనుగోళ్లు తొలుత ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలోనే కొనసాగించాలని, రైతుల నుంచి కొనుగోలు చేసిన పొగాకుకు నగదు వెంటనే చెల్లించాలని రైతు సంఘం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంగులూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతు వద్దకు చేరిన పొగాకును నేటికీ అమ్ముకోలేక పోతున్నారని విమర్శించారు. పంగులూరులో మూడు నెలల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించారన్నారు. గోడౌన్ల పేరుతో కొప్పెరపాడు, అద్దంకి, పొదిలి ప్రాంతాలకు కొనుగోలు కేంద్రాలను అధికారులు మార్చారని చెప్పారు. ప్రస్తుతం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. పిడుగురాళ్ల వంటి సుదూర ప్రాంతాలకు పొగాకుబేళ్లు తరలించాలంటే రైతుకు కలిగే ఇబ్బందులను అధికారులు ఆలోచించాలని కోరారు. ఆ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం మాజీ అధ్యక్షుడు వినోద్‌బాబు, తలపనేని రామారావు, మద్దినేని సురేష్, నాయపాము ప్రభాకర్, సిద్ధిరామయ్య, రామచంద్రరాజు, కోటయ్య, రోశయ్య, రావూరి ఆంజనేయులు, పలుగ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కారును ఢీకొట్టిన మోటార్‌బైక్



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ విజయకృష్ణ



మృతుడు బ్రహ్మయ్య



గాయపడిన శ్రీను



అపస్మారకస్థితిలో శ్రీను

**- ఒకరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం**

**- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తాలుకా సీఐ**

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో మోటార్‌బైక్‌పై ప్రయాణిస్తూ ఎదురుగా వచ్చిన ఇన్నోవా కారును ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఇరువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటన నగర శివారు ప్రాంతంలోని త్రోవగుంట ముదిగొండి బ్రిడ్జిపై సోమవారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో కొత్తపట్నం మండలం అల్లూరు టీపై కాలనీకి చెందిన ఆదూరి బ్రహ్మయ్య (60) మృతిచెందగా, తలుపుల శ్రీను, ఇండ్లా శ్రీను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వివరాలలోకి వెళితే.. ముగ్గురు మోటార్‌బైక్‌పై అల్లూరు నుంచి త్రోవగుంటలో కూలి పనులు మాట్లాడుకునేందుకు వెళ్లారు. అక్కడ పనులు మాట్లాడుకున్న తరువాత మద్యం షాపు దగ్గరకు వెళ్ళి ఫూటుగా మద్యం సేవించారు. బ్రహ్మయ్య మోటార్ సైకిల్ నడుపుతుండగా వెనుక తలుపుల శ్రీను, ఇండ్లా శ్రీనులు కూర్చున్నారు. మద్యం మత్తులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ రహదారిపై ఎక్స్‌ప్రెస్ లైన్‌లో గుంటూరు వైపు వెళుతున్న ఇన్నోవా కారును ఢీకొట్టారు. దీంతో బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. క్షతగాత్రులైన ఇరువురిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.కారు డ్రైవర్‌కు కూడా స్వల్పంగా గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మెడికల్ కాలేజీపై వైసీపీ అసత్య ప్రచారం

**18.8 శాతం పనులు చేసి 80 శాతమని అబద్ధాలు**

**పీపీపీ పద్ధతిలో పూర్తికి ప్రజా ప్రభుత్వం కృషి**

**2026-27లో అడ్మిషన్‌లు జరిగేలా ప్రణాళిక**

**మొదటి దశలో 4 కళాశాలలు**

**మంత్రి స్వామి**



మెడికల్ కాలేజీ నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే కందుల, ఎరిక్షన్‌బాబు, సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీ పనులు 18.8 శాతం చేసి 80 శాతం చేసినట్లుగా వైసీపీ నాయకులు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. మండలంలోని రాయవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలను సోమవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలను అందించి సూపర్‌హిట్ కొట్టిందన్నారు. సీఎం చంద్రబాబు పశ్చిమ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం అందిచాలన్న లక్ష్యంతో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీని పీపీపీ పద్ధతిలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో మార్కాపురం మెడికల్ కాలేజీలో అడ్మిషన్‌లు చేసేలా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటిదశలో మార్కాపురం, పులివెందుల, అరకు, మదనపల్లి మెడికల్ కళాశాలలను పూర్తి చేస్తామన్నారు. రెండో దశలో మిగిలిన మెడికల్ కళాశాలలను నిర్మిస్తామని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు తమ నీలి మీడియాలో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గతంలో వైసీపీ నేతలు స్వార్థ రాజకీయాల కోసం మార్కాపురాన్ని జిల్లా చేయకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురాన్ని జిల్లాగా మార్చే పనిలో ఉన్నారన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ విద్యను ప్రోత్సహించి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును వైసీపీ నిర్లక్ష్యంగా వదిలేసిందని, ప్రజా ప్రభుత్వం దాని పూర్తికి కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలను మళ్లీ మోసగించేందుకు వైసీపీ శ్రేణులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, వారు చెప్పే మాటలు ఎవరూ నమ్మవద్దని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మౌలాలి, వక్కలగడ్డ మల్లికార్జున, కాకర్ల శ్రీనివాసులు, కొప్పుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వెలుగుచూసేనా?

**జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో గత వైసీపీ ప్రభుత్వ కాలంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ఎట్టకేలకు సెక్షన్ 51 విచారణ మొదలుకానుంది. విచారణాధికారిగా నియమితులైన రాష్ట్ర సహకార అదనపు రిజిస్ట్రార్ గౌరీశంకర్ మంగళ, బుధవారాల్లో ఒంగోలులో తొలివిడత విచారణ చేపట్టనున్నారు. ఆ మేరకు బ్యాంకు అధికారులు, అలాగే సహకారశాఖ అధికారులకు సమాచారం అందింది. అయితే విచారణాధికారిగా ఆయన నియామకంపై తొలి నుంచి వివాదాలు ఉండటం, తాజాగా కూడా పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరడం, అంతకు మించి నెలక్రితమే కొందరు బ్యాంకు ఉద్యోగులు ఆయనను కలిశారన్న ఆరోపణలు రావడం వంటి పరిస్థితులతో బ్యాంకులో జరిగిన అవినీతి, అక్రమాలు ఏ మేరకు వెలుగు చూస్తాయన్న అనుమానాలు సహకారశాఖ వర్గంలో వ్యక్తం అవుతున్నాయి.**

**డీసీసీబీలో అక్రమాలపై ఎట్టకేలకు సెక్షన్ 51 విచారణ**

**తొలివిడతగా నేడు, రేపు చేపట్టనున్న విచారణాధికారి**

**ఆయన నియామకంపై తొలినుంచి వివాదాలు**

**తాజాగా కూడా ప్రభుత్వానికి ఫిర్యాదులు**

**ముందుగానే బ్యాంకు ఉద్యోగులు సంప్రదింపులు జరిపినట్లు ఆరోపణలు**

**గతంలో పలు అవకతవకలను, అక్రమాలు గుర్తించిన త్రిసభ్య కమిటీ**

ఒంగోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల త్రిసభ్య కమిటీల పాలనే జరిగింది. ఆ సమయంలో నాటి పాలకవర్గంలోని వారు, వారికి మించి కొందరు బ్యాంకు ఉద్యోగులు బరితెగించి భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీసీసీబీలో జరిగిన అవకతవకలపై పెద్ద ఎత్తున పాలకపెద్దలకు ఫిర్యాదులు వెళ్లాయి. స్వయంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేయగా తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులను మంత్రి డాక్టర్ స్వామి కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తొలుత ప్రాథమిక విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు నుంచి వచ్చిన ఆదేశాలతో త్రిసభ్య కమిటీతో కలెక్టర్ అన్సారియా విచారణ చేయించారు. గత ఏడాది నవంబరులో కలెక్టర్ నియమించిన ఎస్డీసీ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ దాదాపు రెండు వారాలపాటు అనేక అంశాలను పరిశీలించి భారీగా అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు కలెక్టర్‌కు కమిటి నివేదిక ఇవ్వగా ఆ నివేదికను ప్రభుత్వానికి పంపుతూ సమగ్ర విచారణ చేసి బ్యాంకులో అవినీతి, అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సెక్షన్ 51 విచారణ చేయించాలని సిఫార్సు చేశారు.





పీడీసీసీబీ కార్యాలయం

**స్పందించని సహకార అధికారులు**

అయితే డీసీసీబీపై సెక్షన్ 51 విచారణ విషయంలో తగు స్థాయిలో సహకారశాఖ ఉన్నతాధికారుల నుంచి స్పందన రాలేదు. ఆ మాటకు వస్తే బ్యాంకుపై వచ్చిన ఆరోపణలు, ఇతర సహకార శాఖ అంశాలపై తొలి నుంచి రాష్ట్ర స్థాయి అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దాని వల్లనే విచారణాధికారిగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఒక అధికారి పేరును సూచిస్తే అందుకు విరుద్ధంగా రాష్ట్ర సహహకార శాఖ కమిషన రేట్‌లోని అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను ఉన్నతధికారులు సూచించినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి. దాని వల్లనే విచారణలో జాప్యం జరగ్గా ఈలోపు పలు ఆరోపణలపై అప్పుడు ఇక్కడ డీసీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి కలెక్టర్ సరెండర్ చేశారు. తర్వాత ఇందిరాదేవిని ఇన్‌చార్జిగా నియమించారు. ఆ పరిణామాలు కూడా పెద్ద రచ్చకు దారితీశాయి. ఆ విషయం అలా ఉంచితే దాదాపు ఆరేడునెలల తర్వాత కూడా గతంలో ఉన్నతాధికారులు సూచించిన గౌరీశంకర్‌నే విచారణాధికారిగా నియమించగా ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ తాజాగా కూడా పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్ళాయి.

**విచారణాధికారిపై ఫిర్యాదులు**

గతంలో విశాఖ జిల్లాలో కొన్ని కీలక సహకార సంస్థలపై విచారణ సమయంలో సదరు అధికారిపై ఆరోపణలు ఉన్నాయని, అలాగే ఇక్కడి బ్యాంకు అధికారులు కూడా కొందరు ముందుగానే అతనిని కలిశారని, దాని వల్ల సక్రమంగా విచారణ సాగదన్న ఫిర్యాదులు కొందరు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు డీసీసీబీలో అక్రమాలపై సెక్షన్ 51 విచారణకు నియమితులైన సహకారశాఖ అదనపు రిజిస్ట్రార్ గౌరీశంకర్ ఒంగోలుకు వస్తున్నారు. విచారణ సమయంలో ఆయనకు సహాయంగా ఉండేందుకు కోసం ప్రస్తుతం విజయవాడలో డీఎల్‌సీవో కేడర్‌లో ఉన్న పి.కిరణ్‌కుమార్, అలాగే గుంటూరు డీఎల్‌సీవో ఆఫీసులోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ జే.జయదాస్‌లను నియమించినట్లు సమాచారం. కాగావిచారణాధికారి తొలివిడత మంగళ, బుధవారాల్లో కొంతమేర విచారణ నిర్వహించిన అనంతరం కూడా రెండు, మూడు విడతలుగా విచారణ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా గతంలో కలెక్టర్ నియమించిన లోకేశ్వరరావు కమిటీ అనేక అంశాలను లోతుగానే పరిశీలన చేసి భారీగానే అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు గుర్తించిన నేపథ్యంలో ప్రస్తుత సెక్షన్ 51 విచారణేలా సాగుతుంది, అవకవకలను నిగ్గుతేలుస్తారా, అవినీతి, అక్రమాలు వెలుగుచూస్తాయా అన్నది వేచిచూడాల్సి ఉంది.

### రాష్ట్రస్థాయి యోగా పోటీలలో చందలూరు విద్యార్థినుల సత్తా

అవీఇవీ



విజేతలతో హెచ్ఎం గిరిజ, వ్యాయామోపాధ్యాయులు ప్రతిమ, మధు

పంగులూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల బాలికలు సత్తా చాటారు. పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమలలో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు వివిధ విభాగాలలో జరిగిన యోగా పోటీలలో వీరు పాల్గొన్నారు. 12-14 సంవత్సరాల విభాగం యోగా పోటీలలో ఏ.లిఖిత, నాయపాము శ్రుతి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 10-11 సంవత్సరాల విభాగంలో కె.హెప్సీబా ఐదో స్థానం దక్కించుకుంది. లిఖిత, శ్రుతిలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల పీడీలు ప్రతిమ, మధు తెలిపారు. వీరిద్దరూ జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో అక్టోబరులో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలలో పాల్గొననున్నారు. విజేతలతోపాటు పీడీలను పాఠశాల హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు సోమవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

### సెయింట్ ఆన్స్ కళాశాలకు జేఎన్‌టీయూ అవార్డు





అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ డాక్టరు జగదీష్

చీరాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు కాకినాడ జేఎన్‌టీయూ నుంచి ప్రత్యేక అవార్డు లభించింది. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ జేఎన్‌టీయూ 18వ యూనివర్సిటీ ఫార్మేషన్ డే సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఈ అవార్డు లభించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు జగదీష్ ఘనసత్కారం అందుకుని అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో 100 శాతం ఎలిజిబుల్ బ్రాంచులలో ఎన్‌బీఏ గుర్తింపు పొందడంతో అవార్డు అందినట్లు వివరించారు.

### మంగళగిరికి.. పసిడి వెలుగులు

(5వ పేజీ తరువాయి)

సీఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఇందుకుగాను మొత్తం 78 ఎకరాల్లో సీఆర్‌డీఏకు నాలుగైదెకరాలను అప్పగించాల్సి వుంటుంది.

గోల్డ్ హబ్ ఏర్పాటుకోసం సీఆర్‌డీఏ 78.01 ఎకరాలను భూసమీకరణ రూపంలో ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకుండా సేకరించనుంది. ఈ మేరకు ఈ ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. ఇక్కడ మొత్తం భూ యజమానుల సంఖ్యను 171గా గుర్తించారు. ఇందులో ఎక్కువమంది 17 సెంట్ల వంతున కలిగివున్నారు. 171 మంది భూయజమానుల్లో సుమారు వందమందికిపైగా 2008లో ప్రభుత్వం నుంచి భూములను పొందినవారే. మొత్తం 171 మందిలో కేవలం 59 మంది మాత్రమే ఒరిజనల్ ఎస్సైనీలుగా వున్నట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. మిగిలినవారంతా భూములను అనధికారికంగా ఇతరులకు విక్రయించారు. అయినప్పటికీ...కొనుగోలుదారులను కూడ భూయజమానులుగానే గుర్తించాలని స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. నిజానికి ఎస్సైన్డ్ భూముల క్రయవిక్రయాలు చెల్లనేరవు కనుక చట్టం ప్రకారం చేయిమార్పిడి జరిగితే ఆ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే వెసులుబాటు వుంది. అయినప్పటికీ మంత్రి లోకేశ్ మానవతాదృధంతో కొనుగోలుదారులను కూడ భూ యజమానులుగానే గుర్తించాలని ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు వారిని కూడ పరిగణనలోకి తీసుకుంటున్నారు. కాగా, ప్రస్తుత సందర్భంలో మొత్తం భూయజమానులు 171 మందిలో ఇప్పటికే 151 మంది భూసమీకరణ కింద తమ భూములను ఇచ్చేందుకు ప్రభుత్వానికి అంగీకారపత్రాలను అందజేశారు. మిగిలిన 20 మంది ఆచూకీ అధికారులకు ఇంకా లభ్యం కాలేదు. వారిని కూడ గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. భూసమీకరణ కింద భూములను ఇచ్చినవారికి రాజధాని ప్యాకేజీలనే ఇక్కడ కూడ అమలుచేయనున్నారు. జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్కు కోసం సీఆర్‌డీఏ రూపొందించనున్న వెంచర్‌తో సంబంధం లేకుండా వెంచర్‌కు వెనుకవైపు ప్రాంతంలో ప్రత్యేకంగా వీరికి కూడ కొన్ని ప్లాటులను కేటాయిస్తారని అంటున్నారు. ఇవన్నీ నివాసయోగ్యమైన ప్లాట్ల రూపంలో వుంటాయంటున్నారు. అయితే ఈ ప్లాట్ల పంపిణీ విషయానికొస్తే...ఒరిజినల్ ఎస్సైనీలకు ఒకలాగున, కొనుగోలుదారులకు ఇంకోలాగున ప్యాకేజీలను కేటాయిస్తారని అంటున్నారు. సుమారుగా 175 నివాసిత ప్లాట్లను వేర్వేరు విస్తీర్ణాలలో వచ్చేవిధంగా ప్రధాన కమర్షియల్ వెంచర్‌కు వెనుకభాగంలో ప్రత్యేక వెంచర్‌గా అభివృద్ధి చేసి అప్పగిస్తారు. ఈ నివాసిత ప్లాట్ల వెంచర్, ప్రధానమైన గోల్డ్‌క్లస్టర్ తాలూకు వెంచర్‌కు మధ్య సీఆర్‌డీఏకు దక్కాల్సిన నాలుగెకరాలు వుంటాయి.

### ట్రంక్‌రోడ్డు విస్తరణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

**● ప్రజా ప్రయోజనం దృష్ట్యా ప్రభుత్వ నిబంధనల మేరకు ఓకే**

**● ఈనెల 12న కార్పొరేషన్ కౌన్సిల్‌లో ఆమోదం**

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర రహదారుల్లో కీలకమైన ట్రంక్ రోడ్డు విస్తరణ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. నగర అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే పలు రహదారులు విస్తరణ పనులు జరుగుతుండగా, అందులో ముఖ్యమైన ట్రంక్‌రోడ్డు విస్తరణకు పదేపదే ఆటంకాలు ఎదురయ్యాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరించాలని అధికారులు తొలుత భావించారు. అయితే అందుకు వ్యాపారులు అంగీకరించకపోవడంతో ఆరు నెలలుగా వాయిదా పడుతు వచ్చింది. వంద అడుగులు వద్దని కొందరు.. 60 అడుగులు చేయాలని మరికొందరు.. ఇలా కాకుండా అందరికీ ఆమోదయోగ్యంగా 80 అడుగులు విస్తరించాలని ఒక నిర్ణయానికి వచ్చిన క్రమంలో ఇటీవల కొందరు వ్యాపారుల హైకోర్టును ఆశ్రయించారు. రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయి తమకు నష్టం జరుగుతున్నందున నష్టపరిహారం ఇవ్వాలని, షాపులు కట్టించి ఇవ్వాలని కోరగా, ఈ మేరకు వ్యాపారులు కోరిన పిటిషన్‌ను సోమవారం పరిశీలించింది. అటు అధికారులవైపు నుంచి వచ్చిన కౌంటర్, ఇటు వ్యాపారుల నుంచి వచ్చిన పిటిషన్‌పై ఇరువర్గాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా రహదారి విస్తరణ చేయాలని కోర్టు ఆదేశించింది. మరోవైపు వ్యాపారులకు నష్టం కలగకుండా ఉండేలా చూడాలని పేర్కొంది. నష్టపరిహారం కింద నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్‌లు ఇవ్వాలని, వ్యాపారులు అందుకు అంగీకరించకపోతే భూసేకరణ చట్టం ప్రకారం రెవెన్యూ శాఖ ద్వారా తగు చర్యలు చేపట్టి న్యాయం చేయాలని ఆదేశించింది. దీంతో ఈనెల 12న జరిగే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తెలియజేనున్నారు.



ట్రంక్ రోడ్డు

## అవీ..ఇవీ..

### విద్యుత్‌శాఖ విజిలెన్సు అధికారుల తనిఖీలు



తనిఖీలలో పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు

ఇంకొల్లు, సెప్టెంబరు 8,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలో విద్యుత్ శాఖ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. 35 బృందాలుగా ఏర్పడి 3031 సర్వీసులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై సుమారు రూ.1,01,00లు జరిమానా విధించారు. ఇందులో అదనపు లోడును వినియోగిస్తున్న 18 మందికి రూ.84,000 అపరాధ రుసుము విధించినట్లు ఇంకొల్లు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలిపారు. సోమవారం నిర్వహించిన తనిఖీలలో బాపట్ల విజిలెన్స్ ఈఈలు భాస్కరరావు, చీరాల ఆపరేషన్ ఈఈ జాన్‌థామస్, చీరాల డివిజన్ పరిధిలోని డీఈలు హరిప్రసాద్, పి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసులు, ఏఈలు పాల్గొన్నారు.

### 'అన్నదాత పోరు'కు వైసీపీ పిలుపు



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్

చీరాల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎరువులు బ్లాక్ మార్కెట్ విక్రయాలు పెరిగిపోయినట్లు ఆరోపించారు. మంగళవారం ముక్కోణం పార్క్ నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించనున్నట్లు చెప్పారు. సోమవారం రామకృష్ణాపురం క్యాంపు కార్యాలయంలో సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



అ, ఏ, బీ అక్షరాలను పూలతో ఏర్పాటు చేసిన విద్యార్థులు

చినగంజాం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయుడు ఎస్.నాగమల్లేశ్వరరావు సహకారంతో తెలుగు భాషలో అ అక్షరాన్ని, అంతర్జాతీయ భాషైనా ఇంగ్లీషులోని ఏ, బీ అక్షరాలను చూపుతూ పూలతో చిత్రాలను ఏర్పాటు చేశారు. విద్యాదీపం అందరి జీవితాల్లో చీకట్లను పారదోలి వెలుగును నింపాలనే సందేశంతో కొవొత్తులను అలంకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షేక్. నాయబ్‌రసూల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### యోగా పోటీలకు కారంచేడు విద్యార్థి ఎంపిక



ప్రశంసపత్రం అందుకుటున్న వివేక్‌తేజ

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కారంచేడులోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వివేక్‌తేజ ఎంపికయ్యారు. ఆగస్టు నెలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో జరిగిన జిల్లాస్థాయి పోటీలో మూడోస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్‌స్రామాజ్యం తెలిపారు. కాగా 7వ తరగతి చదువుతున్న వివేక్‌తేజను పాఠశాల సిబ్బంది అభినందించారు.

### మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీసులు మూడు అక్రమ ఇసుక ట్రాకర్లు పట్టుకున్నారు. సోమవారం స్టేషన్ పరిధిలోని సొనభూముల్లో అక్రమంగా రవాణా జరుగుతుండగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ట్రాక్టర్‌లు స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేశారు.



# ఆదమరిస్తే అంతే సంగతులు

**సాగర్ కాలువపై ప్రమాదకరంగా ఉన్న వంతెన**



ద్రోణాదుల గ్రామ శివార్లో సాగర్ మినీకాలువపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

మార్టూరు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల-నాగండ్ల గ్రామాల మధ్య సాగర్ కాలువపై వంతెన ప్రమాదకరంగా ఉంది. ఆదమరిస్తే కాలువలో పడిపోవాల్సిందేనని ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ద్రోణాదుల సమపంలోని ఈ వంతెన ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికే పలుమార్లు ద్విచక్ర వాహనదారులు కాలువలో పడ్డారు. ముఖ్యంగా రాత్రి సమయాలలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కన్న ప్రస్తుతం మార్టూరు నుండి ద్రోణాదుల, నాగండ్ల, ఇంకొల్లు వరకు ట్రాఫిక్ పెరిగింది. దాంతో ఈ మార్గంలో పగలు రాత్రి అన్న తేడా లేకుండా నిత్యం ప్రజలు ప్రయాణిసున్నారు. దీనికి తోడు వంతెన కూడా పురాతనమైనదిరావడంతో బలహీనంగా ఉంది. అయితే సాగర్ కాలువలో నీళ్ల సక్రమంగా లేకపోవడం, వంతెన పైనుండి కాలువ తక్కువ లోతులో ఉండటంతో, ప్రమాదాలకు గురైన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గతంలో రెండుసార్లు ఎదురెదురుగా రావడంతో ఒక ట్రాక్టరు అదుపుతప్పి క్రిందకు పడిపోయింది.ప్రాణ నష్టం జరగకపోయినా ట్రాక్టరు కు బాగానే నష్టం జరిగింది.దానికి తోడు సైకిలు పై మేత తీసుకొనివచ్చేవారు, పొలానికి గేదెలను మేపుకునేవారు గ్రామస్తులు ఎక్కువగా ఈ వంతెనపైనుండి ప్రయాణిస్తుంటారు.అందువలన భవిష్యత్తులో వంతెన ను విశాలం చేసి కొత్త వంతెన ను నిర్మించవలసిన అవసరం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

# యూరియా కొరతపై ఆందోళన వద్దు

**ఇంకొల్లులో సమీక్షిస్తున్న అధికారులు**



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఇంకొల్లు,సెప్టెంబరు 8,(ఆంధ్రజ్యోతి) : మండలంలో రైతులు యూరియా కొరతపై ఆందోళన చెందనవసరం లేదని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టరు ఆదేశాల మేరకు వీఏఏలతో సమావేశం నిర్వహించారు. యూరియా కొరత లేదని, రైతులు కావలసినంత తీసుకుపోవచ్చన్నారు. యూరియా కొరకు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. యూరియా పంపిణీ సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏవో మేరమ్మ, ఎస్సై సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కిరణ్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ మండల కార్యదర్శి ఖాదర్ బాషా తెలిపారు. సోమవారం సంతమాగులూరులో తహసీల్దార్ కే.రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు కావస్తున్నా మండలంలో యూరియా కొరత వెంటాడుతోందన్నారు. ఎరువుల దుకాణాల వద్ద రైతులు క్యూలో నిలబడ్డ దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమం లో సీపీఐ జిల్లా మహిళా సంఘం నాయ కులు ఎం.వెంకాయమ్మ, రమణయ్య, మాదాల యలమందయ్య, చీదర్ల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : రైతులు యూరియా ఇతర ఎరువుల గురించి ఆందోళన చెందవద్దని, పంటసాగుకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, తహసీల్దార్ పోపూరి సింగారావు అన్నారు. ఎరువుల నియంత్రణపై మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పంటసాగుకు అవసరమైనమేర ఎరువులు కొనుగోలు చేయాలని రైతలకు సూచించారు. మండల, గ్రామ టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఎరువుల నిల్వల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అక్టోబరు నెలలో ఎరువులు అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలనే విషయంపై చర్చించారు. సమావేశంలో ఏవో సుబ్బారెడ్డి, ఎంపీడీవో స్వరూపారాణి, ఎస్ఐ. వినోద్‌బాబు పాల్గొన్నారు.

# జ్వరాల తీవ్రతపై సర్వే నిర్వహించండి

**వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రత్నమన్‌మోహన్**



గాజులపాలెం యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలో రూట్ మ్యాప్‌ను తయారు చేసుకొని జ్వరాల తీవ్రతపై సర్వే నిర్వహించాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి, మలేరియ నివారణ అధికారి డాక్టర్ రత్నమన్‌మోహన్ సూచించారు. సోమవారం అద్దంకిలోని గాజులపాలెం యూపీహెచ్‌సీ క్లస్టర్ పరిధిలోని గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీలు మోదేపల్లి, మేదరమెట్ల, కొరిశపాడు, అద్దంకి కో-లొకెటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారులు, పర్యవేక్షకులు, సిబ్బందితో జ్వరాలతీవ్రతపై సమీక్ష నిర్వహించారు. ప్రతి వైద్యశాల పరిధిలో జ్వరాలు ఉన్నచోట నీటి పరీక్ష నమూనాలు, యాంటీలార్వ ఆపరేషన్స్ నిర్వహించి కీటక జనిత వ్యాధులను నిరోధించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉంచి ఎప్పటికప్పుడు జ్వరాల తీవ్రతను గుర్తించి వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. యాంటీలార్వా ప్రక్రియకు అవసరమైన నిల్వలు జిల్లా నుంచి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జయసింహ, శ్రీహర్ష, హరికృష్ణ, అక్షిత, చిట్టిబాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ అర్జునరావు, ఎంపీ హెచ్ ఈవోలు నాగేశ్వరరావు, జానీ, బ్రహ్మానందం, పీహెచ్ఎన్ కన్యాకుమారి పాల్గొన్నారు.

## పగలు సెగలు.. రాత్రికి చినుకులు



అద్దంకిలో కురుస్తున్న వర్షం

అద్దంకి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో సోమవారం పగలంతా ఎండ భగభగ మండిపోగా, సాయంత్రం సమయంలో వర్షపు జల్లులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వారం రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి ఉక్కపోత కూడా తోడయ్యింది. ఎండలకు పొలాలలో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. ప్రధానంగా కంది, పొగాకు, మొక్కజొన్న తదితర పైర్లు ఎండు ముఖం పట్టాయి. అదే సమయంలో వరినాట్లు వేయడానికి కూడా నీటి అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షపు జల్లులతో కొంత ఉపశమనం కలిగింది. వర్షం నేపథ్యంలో విద్యుత్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడింది.

# నానో యూరియా వినియోగంపై అవగాహన



బొల్లాపల్లిలో నానో యూరియా ప్రయోజనాలను వివరిస్తున్న ఏవో

మార్టూరు, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులు నానోయూరియాను వినియోగించడం వల్ల పంట దిగుబడి పెరగడంతోపాటు, రైతులకు మరెన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఏవో లావణ్య అన్నారు. సోమవారం ఆమె మండలంలోని బొల్లాపల్లిగ్రామంలో పంటలను పరిశీలించి రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కలిగించారు. ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా తక్కువ మోతాదులోనే ఎక్కువ ఫలితాలను ఇస్తుందన్నారు. అంతేగాకుండా నానో యూరియాను 80 నుండి 85 శాతం పంటలు వినియోగించుకుంటాయన్నారు. రైతులకు రవాణా, నిల్వ ఖర్చులు తగ్గుతాయన్నారు. మొక్కలు తక్షణమే పోషకాలు గ్రహిస్తాయన్నారు. ఆకులు పచ్చగా, ఆరోగ్యంగా ఉంటాయన్నారు. మట్టిలో ఉప్పుదనం పెరగకుండా అడ్డుకుంటుందని, పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో నవనీత, పలువురు రైతులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఈపూరుపాలెంలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకొంది. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇదిర నగర్ కాలనీకు చెందిన జొన్నాదుల రాము, శ్రీకౌసల్య(20) దంపతులు. చేనేత కార్మికులు, వీరికి ఓ బాబు సంతానం. అయితే కొంతకాలంగా కుటుంబ కలహాలు చోటుచేసుకోవడంతో సోమవారం మధ్యాహ్నం బలవన్మరణానికి పాల్పడింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

## నేడు మార్టూరులో అన్నదానం

మార్టూరు, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మార్టూరులో తూర్పు బజారున వినాయకుని నిమజ్జన కార్యక్రమాలు ముగిసిన సందర్భంగా మంగళవారం వినాయకుని గుడి వద్ద భారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు కమిటి సభ్యులు తెలిపారు. దాదాపుగా 10 వేల మందికి భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నిమజ్జనం అనంతరం భారీగా అన్నదానం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

## నియోజకవర్గానికి మరో రెండు రాష్ట్ర పదవులు

**ఏపీఎస్ ఆర్టీసీ, నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియామకం**




వెంకటకృష్ణారావు, షేక్ హుస్సేన్

పర్చూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో రెండు నామినేటెడ్ పదవులు దక్కాయి. ఏపీఎస్ఆర్‌టీసీ డైరెక్టర్‌గా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన కారుమంచి వెంకటకృష్ణారావు నియమితులయ్యారు. అదేవిధంగా కారంచేడు గ్రామానికి చెందిన టీడీపీ నేత షేక్.హుస్సేన్ నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులు అయ్యారు. రాష్ట్ర కార్పొరేషన్‌లో సముచితస్థానం దక్కిన నేతలకు స్థానిక శాసన సభ్యులు ఏలూరి అభినందలు తెలిపారు. అదే విధంగా డైరెక్టర్లగా సిఫార్సు చేసిన ఏలూరికి నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య

పేరాల (చీరాల), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందని, విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మిక చింతను అలవరుచుకోవాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. సోమవారం పేరాల శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాల పరిసర ప్రాంత ప్రజలు దైవ చింతన కలిగిన వారు అధికమన్నారు. అనంతరం నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ జనార్ధనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ సుబ్బయ్య, కౌన్సిలర్ జగదీష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ఆలయ సంప్రోక్షణ



భీమలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష అలంకరణలో అమ్మవారు

పంగులూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం ఆలయ తలుపులు మూసిన అర్చకులు గ్రహణం వీడిన అనంతరం సోమవారం సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంగులూరులోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి విశేషద్రవ్యాలు, పంచామృత అభిషేకం. అమ్మవారికి అహోషేకము, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చక స్వాములు సునీల్‌శర్మ, కారంచేటి సాంబశివరావులు కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నైపుణ్యత పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు నైపుణ్యత పోటీ పరీక్షలు నిర్వహించారు. సాంఘికశాస్త్రానికి సంబంధించిన పోటీలలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, ఉపాధ్యాయులు వేణు, శ్రావణి, ఏవీ సుబ్బారావు, సోమశేఖర్, పోతురాజు, అంజమ్మ, రాంబాబు, దేవభిక్షం, బ్రహ్మానందరెడ్డి, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు కుర్రా రామారావు బహుమతులు అందజేశారు. పోటీ పరీక్షలతో వ్యక్తిగత సామర్థ్యాలు పెరుగుతాయన్నారు.

## అనంతపురానికి 38 బస్సులు

అద్దంకి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి):అద్దంకి డిపో నుండి అనంతపురంలో జరిగే సీఎం చంద్రబాబునాయుడు సభకు 38 బస్సులు కేటాయించినట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు తెలిపారు. మంగళవారం ఉదయం అద్దంకి నుంచి 23 ఆర్టీసీ బస్సులు, 15 ఆర్టీసీ అద్దెబస్సులు బయలుదేరి వెళతాయన్నారు. 10వ తేదీ జరిగే సీఎం సభకు అనంతపురం జిల్లాలో కేటాయించిన గ్రామాల నుంచి జనాన్ని తీసుకుపోయి సభ ముగిసిన అనంతరం ఆయా గ్రామాలలో దించి గురువారం అద్దంకి చేరుకుంటాయన్నారు. అద్దంకి డిపోలో ఉన్న గ్రామీణ బస్సు సర్వీసులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో మూడు రోజుల పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

## విద్యార్థులకు పరీక్ష అట్టల అందజేత



అట్టలను అందజేసిన రోటరీక్లబ్ ప్రతినిధులు

బల్లికురవ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటుపల్లి, బల్లికురవ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం రోటరీ క్లబ్ అఫ్ మార్టురు వారి ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను అందజేశారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చేయుతనిచ్చేలా కార్యక్రమాలు చేపట్టామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఇంట్రాక్ట్ క్లబ్ ద్వారా ఏర్పాటైన విద్యార్థులతో పలు సేవా కార్యక్రమాలను చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, నాగేశ్వరరావు, రవికుమార్, హెచ్‌ఎంలు హనుమంతరావు, కొండలు, రోటరీ సభ్యులు శ్రీనివాసరావు, గంగాధర్ పాల్గొన్నారు.

## వాహన చోదకులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి



వాహన పత్రాలను పరిశీలిస్తున్న బాపట్ల ఎంవీఐ రంగారావు

అద్దంకి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని, బాపట్ల ఎంవీఐ రంగారావు అన్నారు. అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో గుండ్లకమ్మ వంతెన సమీపంలో ఎంవీఐ రంగారావు సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహన చోదకులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. పరిమితి కి మించి స్పీడు వెళ్లరాదన్నారు. ఈ సందర్భంగా 9 వాహనాల ను తనిఖీ చేసి రూ.123 లక్షల అపరాధం విధించారు. ప్రధానంగా టాక్స్ చెల్లించపోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌లు లేకుండా గుర్తించినట్లు తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు వీరాంజనేయులుకు సత్కారం



వీరాంజనేయులును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన గాలం వీరాంజనేయులను ఎంఈవో కే.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. మండలంలోని కొప్పెరపాలెం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సత్కార కార్యక్రమంలో ఎంఈవో పాఠశాల హెచ్‌ఎం కోటి నాగులు, కాంప్లెక్సు చైర్మన్ హనుమంతురావులతో కలిసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన అందుతోందన్నారు.

## రేపు ఆర్టీసీ డిపోను సందర్శించనున్న ఎండీ

అద్దంకి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఆర్టీసీ డిపోను ఎండీ ద్వారకా తిరుమలరావు బుధవారం సందర్శించనున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు అద్దంకి డిపోకు చేరుకొని స్త్రీశక్తి పథకం అమలు, అద్దంకి డిపో అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఉదయగిరిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

# అందరికీ దక్కలేదయ్యా!

- యూరియా కోసం రైతుల ఆవేదన
- గంటల్లోనే 400 బస్తాల విక్రయం
- దొరకని అన్నదాతల ఆగ్రహం

ఉదయగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతుసేవా కేంద్రం-2లో సోమవారం వ్యవసాయ అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు.దీంతో గత కొద్ది రోజులుగా యూరియా లేక అవస్థలు పడుతున్న అన్నదాతలు యూరియా కోసం బారులు తీరారు. అధికారులు ఓ ప్రణాళికబద్ధంగా పంపిణీ చేయలేదని, దీంతో అందరికీ దక్కలేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉన్నతాధికారులు ఉదయగిరికి 18 టన్నుల(400 బస్తాలు) యూరియా కేటాయించారు. దీంతో అధికారులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. పంపిణీలో నిబంధనలు పాటించకపోవడంతో రైతులకు అవస్థలు తప్పలేదు. రైతుల పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు ప్రామాణికంగా తీసుకుని తొలుత ఒక్కో రైతుకు రెండు బస్తాలు పంపిణీ చేశారు. అనంతరం రైతుకు ఒక్కొక్క బస్తా ఇచ్చారు.క్యూలో నిల్చున్న రైతులందరికీ యూరియా దక్కకపోవడంతో రైతుల మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు కలుగజేసుకుని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యూరియా మళ్లీ వస్తుందని, అందరికీ పంపిణీ చేస్తామని తెలపడంతో వారు సద్దుమణిగారు. అధికారులు యూరియా పంపిణీని పది గంటలకు ప్రారంభించగా, మధ్యాహ్నం 3 గంటలకే 400 బస్తాల యూరియా అయిపోయింది. బస్తా రూ.266.50లు విక్రయించాల్సి ఉంది. అయితే అధికారులు రూ.280లు వసూలు చేశారని రైతులు మండిపడుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌ను వివరణ కోరగా రైతుల వద్ద నుంచి హమాలీల ఖర్చు వసూలు చేశామని, ఇది సర్వసాధారణమని సమాధానమిచ్చారు.

## బ్లాక్‌లో విక్రయాలు

కొంతమంది రైతులు నిబంధనలకు విరుద్ధంగా అధిక బస్తాల యూరియా కొనుగోలు చేసి, అనంతరం బస్తా రూ.500ల చొప్పున ఇతరులకు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా బస్తా యూరియా దొరకలేదని, కొందరు అధికంగా తీసుకెళ్లారని పలువురు రైతులు మండిపడ్డారు.




## ఒకే అధికారి.. 4 పోస్టులు

- ఆర్‌అండ్‌బీలో చిత్రవిచిత్రాలు
- కోవూరు డీఈకి అదనంగా మూడు పోస్టులు
- ముక్కున వేలేసుకుంటున్న ఇతర అధికారులు



నెల్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓ అధికారిని అదనపు బాధ్యతల కింద మరో పోస్టుకు ఇన్‌చార్జ్‌గా నియమించడం సర్వసాధారణం. అయితే ఒక అధికారికి ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా మూడు అదనపు పోస్టులు అప్పగించడం ఎప్పుడైనా విన్నారా..!? ఆ నాలుగు పోస్టులను ఏకకాలంగా నిర్వహించడం ఏ అధికారికైనా సాధ్యమా..?! కానీ ఆర్‌అండ్‌బీ శాఖలో మాత్రం ఈ చిత్రమైన పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. ఒక డీఈ స్థాయి అధికారికి ఏకంగా మూడు అదనపు పోస్టులు అప్పగించారు. ప్రస్తుతం అతను తన రెగ్యులర్ సీటుతో కలిపి మొత్తం నాలుగు పోస్టుల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇదెలా సాధ్యమన్న సందేహం కలిగితే.. అందుకు సమాధానం ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులే చెప్పాలి.

కోవూరు డీఈగా వేణుగోపాల్ పనిచేస్తున్నారు. ఆయనకు నెల్లూరు ఈఈ, కావలి ఈఈ పోస్టులతోపాటు కావలి డీఈ పోస్టును కూడా అదనంగా అప్పగించారు. సుమారు నెల క్రితం నెల్లూరు ఈఈగా పనిచేస్తున్న మురళీకృష్ణ ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్లారు. ఆ సమయంలోనే కావలి ఈఈగా పనిచేస్తున్న రామకృష్ణ ప్రసాద్ నెల్లూరు ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో డీఎస్‌ఈగా బదిలీ అయ్యారు. దీంతో ఆ పోస్టుల్లో ఎవరినీ నియమించలేదు. ఆ రెండు పోస్టుల ఇన్‌చార్జ్ బాధ్యతలను ఏకకాలంలో కోవూరు డీఈ వేణుగోపాల్‌కు అప్పగించారు. అలానే కావలి డీఈగా పనిచేస్తున్న చక్రధర్‌రావు ఇటీవల సెలవుపై వెళ్లారు. ఇప్పుడు ఆ పోస్టు ఇన్‌చార్జ్ బాధ్యతలను కూడా కోవూరు డీఈనే నిర్వహిస్తున్నారు. జిల్లాలో అనేకమంది అధికారులుండగా, ఈ ఒక్క అధికారికే ఎందుకు ఇన్ని ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారో అర్థం కావడం లేదంటూ ఆర్‌అండ్‌బీ శాఖలోనే చర్చించుకుంటుండడం గమనార్హం. ఆర్‌అండ్‌బీలో ఓ ఈఈ స్థాయి అధికారి ప్రస్తుతం పోస్టింగ్ లేకుండా ఉన్నారని, ఆయనకు కూడా ఇవ్వడం లేదని మాట్లాడుకుంటున్నారు. మరి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు ఏ ఉద్దేశ్యంతో ఇలా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఒక అధికారిపై నాలుగు పోస్టుల పని ఒత్తిడి వేయడం కూడా మంచిది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఈ నాలుగు పోస్టుల విషయం తెలిసి ఓ సీఈ స్థాయి అధికారి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. అలానే జిల్లాలోని ఇతర అధికారులు కూడా ఈ విషయం తెలిసి ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధరను వివరణ కోరగా నెల్లూరు, కావలి ఈఈల ఇన్‌చార్జ్ బాధ్యతలతోపాటు కావలి డీఈ ఇన్‌చార్జ్ బాధ్యతను కోవూరు డీఈ చూస్తున్నారని స్పష్టం చేశారు.



# పొగాకు కొనుగోళ్ల ఆరంభం

వేలం కేంద్రాల పునఃప్రారంభం ● మేలురకానికి అనూహ్య ధర, లోగ్రేడ్ రేట్లలో కోత

కందుకూరు /మర్రిపాడు, కలిగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులు పరిమితికి మించి పండించిన పొగాకు విక్రయాలకు బోర్డు అనుమతించింది. దీంతో సోమవారం నుంచి వేలం కేంద్రాలు పునఃప్రారంభమయ్యాయి. కందుకూరు 1, 2 వేలం కేంద్రాలతోపాటు జిల్లాలోని కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాల్లో మేలురకం పొగాకుకు అనూహ్యంగా ధర లభించింది. లోగ్రేడ్ ధరలో మాత్రం వ్యాపారులు భారీగా కోత విధించారు. సోమవారం తొలిరోజే ఎఫ్1, ఎఫ్2 రకాలకు కిలోకు రూ. 315 ధర పెట్టి పోటీపడి కొనుగోలు చేసిన వ్యాపారులు లోగ్రేడ్‌లకు మాత్రం ధరను రూ. 120కి దిగజార్చారు.

### మర్రిపాడులో..

మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో వాణిజ్యశాఖ ఆదేశాల మేరకు అపరాధ రుసుం లేకుండా 42.23క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేయనున్నట్లు, అంతకు మించి అమ్మితే రైతు నుంచి అపరాధరుసుం వసూలు చేయనున్నట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు. రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు అంచనాతో బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం రైతులు 224 బేళ్లను తీసుకొని రాగా, 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 179 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 45 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర 315రూ కాగా, కనిష్ఠ ధర రూ120గా పలికింది.

### ● కలిగిరిలో...

స్థానిక వేలం కేంద్రంలో బోర్డు అనుమతించినదానికన్నా 10శాతం ఎక్కువ పొగాకు అమ్మకాల్లో ఒక శాతం, 10 నుంచి 20 శాతం అమ్మకాలకు 3శాతం, 20శాతం కన్నా ఎక్కువ అమ్మకాలకు 3శాతంతోపాటు కిలో పొగాకు రూ.1 వంతున అపరాధ రుసుం చెల్లించాల్సి ఉందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. అనధికార పొగాకు ఉత్పత్తిపై 6 శాతం సర్వీస్‌చార్జి, కిలోకు రూ.1 వంతున అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

# ఐకమత్యంతో పోరాడి.. భూములు కాపాడుకుంటాం..!

- లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్

ఉలవపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంతో పోరాడి కరేడు భూములను కాపాడుకుంటామని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీఎస్‌ఆర్‌కేఆర్. విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన కరేడులో పర్యటించారు. తొలుత ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్థానికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెంకాయచెట్లపాలెం, బట్టిసోమయ్యపాలెం మత్స్యకార గ్రామాల ప్రజల ప్రజాభిప్రాయాన్ని కూడా తెలుసుకున్నారు. అనంతరం కరేడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామానికి గుండెకాయ లాంటి కరేడు భూములు తీసుకున్నాక చుట్టుపక్కల గ్రామాల ప్రజల బతుకులు అధ్వానంగా మారుతాయని వాపోయారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అవలంబిస్తున్న ఏకపక్ష ధోరణిపై రైతులతో కలిసి పోరాడాలని నిర్ణయించుకున్నామన్నారు. ముందుగా చేవూరు, రావూరు గ్రామాల మధ్య ఇండోసోల్‌కు భూములు కేటాయించి, చివరి దశలో ఆ భూములను బీపీసీఎల్‌కు కేటాయించామని ప్రభుత్వం జీవోలో ప్రకటించడం స్థానిక ఎంపీ కాంట్రాక్టు కోసమేనని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆరోపించారు.

### ● భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసులు

శుభకార్యాలకు, ఇతర ఫంక్షన్లకు బయట గ్రామాల నుంచి బంధుమిత్రులు గ్రామానికి రావాలంటే భయపడుతున్నారని, పోలీస్ 30 యాక్ట్ పెట్టి గ్రామంలోని వచ్చే ప్రతి వ్యక్తి ఐడెంటిటీని తనిఖీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కరేడువాసులు సభలో వాపోయారు. స్పందించిన విజయ్‌కుమార్ మాట్లాడుతూ మితిమీరిన బాధ్యతలతో ప్రజలను భయానికి గురిస్తే కోర్టుల్లో సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని పోలీసులను హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ 30పై హైకోర్టులో విచారణ జరుగుతున్నదని త్వరలోనే విముక్తి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.



కరేడు గ్రామసభలో మాట్లాడుతున్న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు



జామాయిల్ కర్రను నరుకుతున్న కూలీలు

## అసైన్డ్ భూముల్లో జామాయిల్ నరికివేత

- అడ్డుకున్న తిరుమలాపురం గ్రామస్థులు

- వివరాలు 8లో..



వ్యర్థాలతో కళారూపాలు 8

## నానో ఎరువులు ఎంతో మేలు !

- రైతులకు అవగాహన అవసరం
- పెట్టుబడితోపాటు శ్రమ కూడా తక్కువే
- ఎక్కడికైనా ఇట్టే తీసుకెళ్లవచ్చు

## టీకాల అమలులో పురోగతి

- లక్ష్యసాధనలో సత్ఫలితాలు
- 90 శాతం టార్గెట్లు పూర్తి

8



అడుగంటిన రాళ్లపాడు రిజర్వాయర్



సోమశిల జలాశయంలో సమృద్ధిగా నీరు

# జలకళ.. వెలవెల

- ఉత్తరకాలువ ఆధునికీకరణలో నిర్లిప్తత
- చివరి ఆయకట్టుకు అందని సోమశిల జలాలు
- అడుగంటుతున్న రాళ్లపాడు

అనంతసాగరం సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోమశిల జలాశయం కృష్ణాజలాలతో జలకళను సంతరించుకుంది. రాళ్లపాడు రిజర్వాయర్ నీరులేక వెలవెలబోతోంది. ఇందుకు ఉత్తరకాలువ ఆధునికీకరణ పనుల్లో నెలకొన్న నిర్లిప్తతే కారణం. నాన్‌డెల్టా పరిధిలోని ఈకాలువ కింద సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు, కొండాపురం, జలదంకి, కావలి, లింగసముద్రం మండలాల మీదుగా రాళ్లపాడు వరకు ఈ కాలువ 106 కిలోమీటర్లు విస్తరించి ఉంది. అయితే దశల వారీగా కాలువ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. కాలువ ఆయకట్టు స్థిరీకరణ లేకపోవడంతో 340 క్యూసెక్కులు కలిగిన నీటి ప్రవాహాన్ని 750 క్యూసెక్కులకు పెంచారు. మూడేళ్ల క్రితం డబ్లింగ్ పనులు ఆమోదించి కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేశారు. అయితే పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. ఈకారణంగా సోమశిలలో పుష్కలంగా నీరు ఉన్నా, చివరి ఆయకట్టుకు నీరు సమృద్ధిగా ఇవ్వలేని దుస్థితి. కాగా రాళ్లపాడు జలాశయం సామర్థ్యం 1.1 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.1 అడుగులకు మాత్రమే నీటిమట్టం పరిమితమైంది. జలాశయంలో నీటి మట్టం తగ్గి రంగు మారుతున్నట్లు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పూర్తిగా పనులు జరిగి ఉంటే నేడు కృష్ణాజలాలతో రాళ్లపాడు కూడా జలకళను సంతరించుకుని ఉండేది. కాగా, సోమశిలకు సోమవారం 21,947 క్యూసెక్కుల వరద వస్తుండగా 69.390 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 5000, డెల్టాకు 1,850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 127 |
| స్కిన్ చికెన్ | 230 |
| స్కిన్‌లెస్ | 252 |

కోడిగుడ్ల ధర (100): 545

## ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి

కావలి,సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపవని రోడ్డులో పుష్కరకాలంగా అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణవేదిక ఆధ్వర్యంలో సోమవారం వామపక్షాల నాయకులు కావలి ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. వంద గ్రామాలకు అవసరమైన ఆ వంతెన అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోకి వలసలు పెరిగాయని, రోడ్లు, వంతెనలు లేకపోవటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయిందని, రైల్వే శాఖ తన పరిధి వరకు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసిందన్నారు.. ప్రస్తుతం ఉదయగిరి రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాల రద్దీ పెరిగి ఉందని, అది దెబ్బతింటే ఇక రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు లేవన్నారు. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణవేదిక కన్వీనర్ కరువది భాస్కర్, సీపీఐ నాయకులు దామా అంకయ్య, సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, సీపీఎంఎల్ నాయకులు లక్ష్మిరెడ్డి, సీఐటీయూ నాయకులు క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# చాలీచాలని తూములు .. నీళ్లు పారేదెలా?

## ● 3 నుంచి 1.5 అడుగులకు తగ్గించిన వైనం ● ఆందోళన చెందుతున్న రైతులు

కావలి రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెరువు నీటి పారుదలకు చాలీ చాలని తూములు వేస్తే .. పొలాలకు నీళ్లు పారేదెలా? అంటూ కావలి మండలం చెంచుగానిపాలెం, ముసునూరు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ముసునూరు చెరువు పాత గుడి తూము నీళ్ల పారుదల కింద అధికారికంగాను, అనధికారికంగాను సుమారు 1000 ఎకరాలకు చెరువు నీరు చేరాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో పాత తూము వద్ద నీళ్ల లీక్ అవుతుండటంతో కొత్త తూము ఏర్పాటు కోసమని పాత తూమును పగలగొట్టి పనులు చేపట్టకుండా వదిలేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తూముల పనులు సత్వరం చేయించాలని అధికారులకు సూచించారు. దీంతో చెంచుగానిపాలెంకు చెందిన తాతా హరిబాబు సుమారు రూ. 5.5 లక్షలతో తూముల ఏర్పాటు పనులు చేపట్టాడు. అయితే అదే చెరువుకు సంబంధించిన ఇస్కనేల తూము, దిన్నెమీద తూముల పనులు చేపట్టేటప్పుడు గతంలో 2 అడుగుల తూములు వెయ్యబోగా, రైతులు అడ్డుకుని 3 అడుగల ఖానాతో తూములు వేయించారు. కానీ కొత్తగా ఇప్పుడు పనులు చేపట్టిన ప్రధాన కాలువ తూము అయిన పాత గుడి తూమును మాత్రం 3 అడుగులు వెయ్యకుండా 1.5 అడుగుల తూము వేసి హడావిడిగా పనులు చేపట్టారని రైతులు చెబుతున్నారు. చెరువులోని చెత్తాచెదారం నీటి ప్రవాహానికి కొట్టుకువచ్చి తూముల్లో ఇరుక్కున్నట్లయితే నీరు పారదని, అధికార పార్టీ నేతలు హడావిడిగా రైతులకు తెలియకుండా చిన్న తూములు వేసి తూతూ మంత్రంగా పనులు చేపట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. తూముల వద్ద నీటి సరఫరాకు లాకులు బిగిస్తారు కాబట్టి పెద్ద తూములు వేస్తే నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉంటుందని, నేతలు కాంట్రాక్టర్లుగా మారి స్వార్థంతో చిన్నపాటి తూములు వేసి 'మమ' అనిపిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా చెరువు సంఘం అధ్యక్షుడు గానీ, మెంబర్లు గాని పట్టించుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తోందని ముసునూరు, చెంచుగానిపాలెం గ్రామాల రైతులు అంటున్నారు.


నిర్మాణంలో ఉన్న ముసునూరు చెరువు పాత గుడి తూము

**నీటి పారుదలకు ఆటంకం ఉండదు**

చిన్న తూము ఏర్పాటుతో నీటి సరఫరాకు ఇబ్బంది ఉండదు. ఎస్టిమేషన్‌లో అడుగు తూము ఉన్నప్పటికీ 1.5 అడుగు తూములు ఏర్పాటు చేశాం. దీంతో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. - జంపాని కిరణ్, ఏఈ, ఇరిగేషన్

## అధిక యూరియాతో పంటకు నష్టం


ర్యాలీలో పాల్గొన్న ఏవో శైలజ, రైతులు

బిట్రగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికంగా యూరియా వాడటం వల్ల కలిగే నష్టాలను రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శైలజ సూచించారు. సోమవారం బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల, కోవూరుపల్లి గ్రామాల్లో అధిక యూరియా వాడకంపై రైతులకు అవగాహన సదస్సులు ఆమె నిర్వహించారు. యూరియా అధికంగా వాడటం వల్ల చీడ పురుగు భూమిగా మారే ప్రమాదం ఉందన్నారు. పైరుకు పీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందని వివరించారు. అనంతరం స్థానిక రైతులు, సచివాలయ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాటకరాజి శీనయ్య, ఎస్ రంగయ్య, ఎం గోపికృష్ణబాబు, కే సుబ్బారావు, కే సురేంద్ర, ఏఈవో పౌలు, వీపీఏ సుస్మిత, సూర్య, డిజిటల్ అసిస్టెంట్ శ్యాం సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

**యూరియాను అధికంగా వినియోగించొద్దు**

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటలకు యూరియాను అధికంగా వినియోగించవద్దని ఏఓ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నఅమ్మపాలెంలో సోమవారం యూరియా వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమంలో ఏఓ శేషారెడ్డి మాట్లాడుతూ పంటలపై యూరియా అధికంగా వినియోగిస్తే కలిగే నష్టాలను వివరించారు. అనంతరం రైతులకు పీఎస్ఎస్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నిబోయిన ఓబుల కొండయ్య, సిబ్బంది రఘువీర్‌యాదవ్, హరికృష్ణరెడ్డి, ఏసీఆర్‌పీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## అన్నదాత పోరును జయప్రదం చేయాలి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో మంగళవారం జరగనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వైసీపీ కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం, వైసీపీ జిల్లా రైతు వింగ్ ఉపాధ్యక్షుడు కట్టా హనుమంతరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రాళ్లపాడు నుంచి కలుషిత నీటి సరఫరా


పాచిపట్టిన రాళ్లపాడు ప్రాజెక్టు నీరు

గుడ్లూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలానికి రాళ్లపాడు రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న నీరు పాచిపట్టి పచ్చని రంగులో వస్తున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాళ్లపాడు ప్రాజెక్టు దగ్గర గుడ్లూరు మండలానికి వచ్చే ప్రధాన పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి, వారం రోజులు నీటిసరఫరాను నిలిపివేశారు. ఆతరువాత మరమ్మతులు చేసి నీటిసరఫరా చేస్తున్నా అవి మురికిపట్టి వాడుకునేందుకు సైతం పనికి రాకుండా ఉంటున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సురక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉలవపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరేపల్లి ఎస్టీ యానాది కాలనీకి చెందిన యాకసిరి చెంచయ్య(39) కారు నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. సోమవారం రాత్రి తన కారుని ఇంటి దగ్గర పెట్టి హైవే మీద ఉన్న దాబాకు వెళ్లి తిరిగి కాలనీలోకి వస్తుండగా రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చెంచయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. మృతుడు చెంచయ్యకు భార్య వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

స్పందించి.. సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి...

## మానవత్వం చాటుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు


బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మదన్ మోహన్

కావలి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) రోడ్డుపై ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో పడి ఉంటే మనకెందుకులే.. అని చాలా మంది తమ దారిన తాము వెళ్లిపోతారు. అయితే రెడ్‌క్రాస్ ప్రతినిధులు మాత్రం మానవత్వంతో ఓ రోడ్డు ప్రమాద బాధితుడికి చేయూతనందించారు. కావలి-జలదంకి రోడ్డులో జమ్మలపాలెం సమీపంలో రోడ్డుపై ఒక వ్యక్తి ఆదివారం రాత్రి 10.15 గంటలకు తీవ్ర గాయాలతో పడి ఉండగా, అటు వైపు నుంచి వస్తున్న రెడ్‌క్రాస్ కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, జీవితకాల సభ్యులు సూరే మదన్‌మోహన్‌రెడ్డి, బొట్ల గుంట హరిబాబు, ఆకా రామమోహన్‌రావు గమనించారు. కావలికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ శ్రీనివాసులు స్కూటర్‌పై జలదంకి నుంచి వస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడడంతో ఆయన తలకు, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే తమ వాహనంలో ఆయనను కావలికి తీసుకువచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ ఏరియా వైద్యశాలకు చేరుకుని ప్రథమ చికిత్స అందేలా చొరవ తీసుకున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తలకు తీవ్రమైన గాయంతో పాటు, కాలి ఎముకలు విరగడంతో ప్రథమ చికిత్స అనంతరం బాధితుడిని తిరుపతి ఆసుపత్రికి తరలించారు. రాత్రి సమయంలో రెడ్‌క్రాస్ బాధ్యులు క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడంతో శ్రీనివాసులుకు ప్రాణాపాయం తప్పింది. దీంతో మానవత్వం చాటుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులను పలువురు అభినందించారు.

## 11, 12 తేదీల్లో మైనంపాడులో విద్యార్థులకు పోటీలు


వలేటివారిపాలెం ఎంఆర్‌సీలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారులు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ మోడల్‌స్కూల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న 9,10,11,12వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 11, 12వ తేదీల్లో జిల్లా విద్యాశిక్షణ సంస్థ మైనంపాడు పాఠశాలలో మ్యూజిక్, డ్యాన్స్, తదితర పోటీలు జరుగుతాయని డైట్ కళాశాల లెక్చరర్ నంగా మహేంద్ర తెలిపారు. ఈమేరకు వలేటివారిపాలెం ఎంఆర్‌సీలో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు మాల్యాద్రిరెడ్డి, మల్లికార్జునరావు, వలేటివారిపాలెం హైస్కూల్ హెచ్ఎం కంచుకుమార్, పోకూరు హైస్కూల్ హెచ్ఎం రవీంద్ర, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ గోవర్ధినీ, మండి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ల పాల్గొన్నారు.

ఎదురెదురుగా బస్సులు...

## గంటసేపు స్తంభించిన ట్రాఫిక్


ఎదురెదురుగా రావడంతో బస్సులు రావడంతో స్తంభించిన ట్రాఫిక్

కావలి,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమాహాల్ రోడ్డులో సోమవారం సాయంత్రం రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావటంతో రోడ్డు చిన్నదిగా ఉండటంతో ఇరుక్కుపోయాయి. దీంతో గంట సేపు ట్రాఫిక్ స్తంభించింది. నిత్యం వాహనాల రాకపోకలు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. వ్యాపార దుకాణాలు కూడా వీధిలో ఉండడంతో లోడింగ్, అన్‌లోడింగ్ వాహనాలు అక్కడికి వస్తూ ఉంటాయి. ద్విచక్రవాహనాలను దుకాణాల ముందు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అక్కడ ఏ రెండు పెద్ద వాహనాలు ఎదురెదురైనా ట్రాఫిక్ సమస్యలు తప్పటం లేదు. సోమవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో రెండు ఆర్టీసీ బస్సులు ఎదురుగా రావడంతో ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. క్లియర్ అయ్యేసరికి సుమారు గంట సమయం పట్టడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## 115 గ్రామాలకు సురక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోండి

**● సబ్ కలెక్టరుకు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం వినతి**


సబ్ కలెక్టరు దామెర హిమవంశీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరాం, అభివృద్ధి మండలి సభ్యులు

కందుకూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 115 గ్రామాలకు సురక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సబ్ కలెక్టర్ దామెర హిమవంశీని కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులతో కలిసి మండి నీటి పథకం దుస్థితిని సబ్ కలెక్టరుకు వివరించారు. రాళ్లపాడు రిజర్వాయరు ఆధారంగా గుడ్లూరు మంచినీటి పథకం, రాళ్లపాడు - రోళ్లపాడు, మండి - చెర్లోపాలెం తాగునీటి పథకాలు పనిచేస్తున్నాయని, వీటిద్వారా 115 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఇటీవల ఈ మూడు పథకాల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత జలాలను పరీక్ష ల్యాబ్‌కు పంపించగా తాగునీరుగా ఎట్టిపరిస్థితుల్లో వినియోగించరాదని రిపోర్టు వచ్చిందని చెబుతూ ల్యాబ్ రిపోర్టులను సబ్ కలెక్టరుకు శివరాం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయర్‌లో చేపలపెంపకం చేపడుతుండటంతో జలాలు కలుషితమవుతున్నాయని, సమస్యను పట్టించుకోవాల్సిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారన్నారు. ఈ మంచినీటి పథకాలను పరిశీలించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. అలాగే డివిజన్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను తనిఖీలు చేయడం ద్వారా పేద విద్యార్థులకు అన్నిసౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరగా సబ్ కలెక్టరు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో శివరాం వెంట అభివృద్ధి మండలి సభ్యులు పాలేటి కోటేశ్వరరావు, కాకుమాని మాధవరావు, తోకల వెంకటేశ్వర్లు, బూసి సురేష్‌బాబు, జిలానీ, దుర్గాప్రసాద్, ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

## మూనైతేనే.. ప్రమాదం !

వలేటివారిపాలెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల భవనాల గోడలు శిథిలాల్లో ఓ మొక్క మొలిచింది. అది రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో గోడలు, శ్లాబు దెబ్బతింటుంది. మొక్క కదా అని అలాగే వదిలేస్తే మాను అయి పెద్ద దిగి కార్యాలయాల గోడలు, శ్లాబు దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## ప్రకృతి వ్యవసాయంతోనే చక్కటి ఆరోగ్యం


ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయలు విక్రయిస్తున్న హరిచందన

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో చక్కటి ఆరోగ్యం సిద్ధిస్తుందని మోడల్ టీం లీడర్ హరిచందన తెలిపారు. సోమవారం దగదర్తి మండల పీహెచ్, తహసీల్దారు కార్యాలయాల వద్ద ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు విక్రయం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ఇంటి పెరట్లో కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వాటిని కొనుగోలు చేయాలన్నారు.

## నేత్రదానంతో అంధులకు చూపు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నేత్రదానం చేస్తే అంధులకు చూపు ప్రసాదించవచ్చని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం వైద్య కళాశాల ప్రాంగణంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రదానంపై అవగాహన లేక అనేక మంది తమ నేత్రాలను వృథా చేస్తున్నారన్నారు. అలాంటి వారికి మరణానంతరం నేత్రదానం చేస్తే వారికి కంటి చూపు ప్రసాదించవచ్చని తెలిపారు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఇలాంటి వారికి నేత్రదానం ఆవశ్యకతను తెలియచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, నేత్రవిభాగం హెచ్ఓడీ డాక్టర్ వసంత పాల్గొన్నారు.

## ఏజీపీ పాఠశాలలో అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం


మొగిలిచెర్ల ఏజీపీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ

లింగసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల ఎస్సీ కాలనీలోని ఏజీపీ పాఠశాలలో నాడు-నేడు 2 పథకం కింద అసంపూర్తిగా పలు నిర్మాణాలు చేశారు.దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.2022లో ఈ పథకం కింద పాఠశాలలో ప్రహరీ, బాత్‌రూంలు, టాయ్‌లెట్స్ నిర్మాణ పనులకు రూ.23 లక్షలు మంజూరు చేశారు.అయితే ఆ నిధులలో రూ.10 లక్షలతో ప్రహరీ గోడ, బాత్‌రూం, టాయ్‌లెట్స్ మంచినీరు అందించేందుకు కుళాయిలు, బోరు ఏర్పాటు చేశారు.అలాగే పాత తరగతి గదికి మరమ్మతులు చేశారు.అయితే ప్రహరీ గోడ అసంపూర్తిగా నిలిచింది, గేటు ఏర్పాటు చేయలేదు.దీంతో పాఠశాల ఆవరణలోకి కుక్కలు, పందులు తిరుగుతుంటాయి.ఈ కారణంగా విద్యార్థులు భయపడుతున్నారు.అయితే బాత్‌రూంలో నిర్మించిన మూత్రశాల విరిగిన వేసే పాత్రలు కొన్ని ఊడి కిందపడ్డాయి.దీంతో విద్యార్థులు మల మూత్ర విసర్జనకు బయటకు వెళుతున్నారు.అలాగే పాఠశాల ముందు భాగంలో నాపరాళ్లు వేసి వదిలేశారు.విద్యార్థులు ఈ రాళ్లు తట్టుకొని గాయపడుతున్నారు.అయితే అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో ఈ పనులు పూర్తి కాలేదు.పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థులు తరగతి గది లోపల కొందరు, వరండాలో కొందరు చదువుకుంటున్నారు.పాత తరగతి గదిని వినియోగంలోకి తెస్తే వరండాలోని విద్యార్థులను ఈ గదిలోకి మార్చవచ్చని కాలనీవాసులు చెబుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న మాలేపాటి

దగదర్తి (బిట్రగుంట): దగదర్తి చెరువుకట్టను ధ్వంసం చేసి నల్లమట్టి చెట్లను అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని టీడీపీ సీనియర్ నేత మాలేపాటి రవీంద్రనాయుడు, నీటి సంఘం అధ్యక్షులు సుధాకర్‌నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం దగదర్తి మండల తహసీల్దారు కృష్ణను కలిసి డీఆర్ చానల్ వాగు సర్వే నిర్వహించాలని మాలేపాటి కోరారు. వడ్లే రమేష్‌నాయుడు ఆయనకు వినతి పత్రం అందజేశారు. చెరువులో అక్రమంగా నల్లతుమ్మ చెట్లు నరికి కట్టింగ్ మిషన్లను స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు బానుచందర్ నాయుడు, కంచర్ల కృష్ణ, పట్లిగుంట గోపాల్, పర్రినేని కృష్ణ, పేవర్ల సూరిబాబు, మారెళ్లపూడు కృష్ణ, చెన్నూరు రమణమ్మ, మారెళ్లపూడు రమణయ్య, అంకబాబు, వెంకట్రావు, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన 'నవదుర్గ' నృత్య రూపకం


చిన్నారులను అభినందిస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్ అధికారులు

కావలి (టౌన్), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డే వేడుకల్లో భాగం స్థానిక పీఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కావలి నయత్న నృత్య కళా నిలయం చిన్నారులు ప్రదర్శించిన 'నవదుర్గ' నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా కావలి విభాగం మేనేజర్ చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో నాట్యాచారిణి లలిత పర్యవేక్షణలో చిన్నారులు శివ, తనుశ్రీ, వీక్షిత, భవిష్య, ద్రాక్షాయణి, యశశ్రీ, కృష్ణప్రియ, సాయిశ్రీ, దుర్గాపావని, ఖ్యాతి, దీక్షిత అద్భుతంగా నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. చిన్నారులను అతిథులు, బ్యాంకు ఉన్నతాధికారులు అభినందించారు.

## లో ఓల్టేజీ సమస్య తీర్చడమే ధ్యేయం


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నేతలు

బిట్రగుంట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యను తీర్చడమే ధ్యేయంగా పని చేస్తున్నామని మండల విద్యుత్ అధికారి జడరాయ అన్నారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో ఏర్పాటు చేసిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం మండల టీడీపీ కన్వీనర్ ఎం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చొరవతో మేజర్ పంచాయతీల్లో లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. ఏతా మాట్లాడుతూ బోగోలు పంచాయతీలో నాలుగు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. అడవపాలెం, ఇసుకపల్లి, బిట్రగుంటలో కూడా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వాటిని కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. విశ్వనాథరావుపేటలో లోడ్ డివైడ్ చేసి రెండు 100 కేవీ, 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్ సుధీర్‌బాబు, స్థానిక నేతలు బీ ప్రభాకర్ రెడ్డి, నరసింహారావు, శేఖర్ నాయుడు, లైన్‌మెన్ బ్రహ్మయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వివేకానంద వార్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ తమ సభ్యులు ఆపరేషన్ సేవా దృక్పథంతో రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఒకరోజు అన్నదానం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రమచంద్ర, నేతలు స్వర్ణ రమేష్ పాల్గొన్నారు.

# బడే బారు !!

- చీకటి పడితే .. 'మందు' బాబులదే రాజ్యం!
- తెల్లారితే ఆవరణలో దర్శనమిస్తున్న మద్యం సీసాలు




బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువుల తోటలో 'అక్షర కుసుమాలు గుబాళించాల్సి న చోట... 'మద్యం' కంపు కొడుతోంది. 'పుస్తకాలు' సీతాకోకచిలుకలై విహరించాల్సిన 'జ్ఞాన' స్థలిలో పగి లిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చీకటి పడితే చాలు.. ఈ సరస్వతీ నిలయం మందు బాబుల అడ్డాగా మారిపోతోంది. మండలంలోని రేబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొంతకాలంగా నెల కొన్న దుస్థితి ఇది! క్రీడా పరికరాలో.. రన్నింగ్ ట్రాకులో ఉండాల్సిన తమ పాఠశాల ఆవరణలో అడుగడుగునా మందు సీసాలు పడి ఉండడం చూసి అమాయక బాల్యం.. అక్కడ జరుగుతున్నదేమిటో తెలియక అయోమయానికి గురవుతోంది. ఉదయాన్నే మైదానంలోకి వాకింగ్ వెళ్ళేవారికి సాక్షాత్తు సరస్వతీదేవి విగ్రహం పక్కనే ఖాళీ మద్యం సీసాలు స్వాగతం చెబుతున్నాయి. అంతేకాదు.. ఖాళీ నీళ్ల ప్యాకెట్లు, తిని పడేసిన చికెన్ వ్యర్థాలతో పాఠశాల మైదానంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. రాత్రివేళల్లో మందు బాబులు పాఠశాల మైదానంలోకి రాకుండా ప్రధానోపాధ్యాయుడు గానీ, విద్యా కమిటీ సభ్యులు గానీ అడ్డుకునే సాహసం ఎందుకు చేయలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ పాఠశాలలో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని బయటి వ్యక్తులు ఎవరూ రాత్రివేళ పాఠశాలలోకి ప్రవేశించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టేలా విద్యాశాఖాధికారులు, పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. నైట్ వాచ్‌మన్‌ను బెదిరించి మరీ మద్యం సేవిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# వ్యర్థాలతో కళారూపాలు

ఆకట్టుకున్న డాక్టర్ లక్ష్మీసుహాసిని ప్రదర్శన




కళాకారిణి లక్ష్మీసుహాసినిని సత్కరిస్తున్న అన్నపూర్ణ



నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సృజన ఉంటే ఏ వస్తువులైనా కళాఖండం చేయవచ్చని డాక్టర్ లక్ష్మీసుహాసిని నిరూపించారు. సోమవారం ఆమె ఓ పాఠశాలలో గుండీలు, పిన్నులు, చెంచాలు, గింజలు, కొయ్య ముక్కలు, అట్టముక్కలు, ప్లాస్టిక్ కాగితాలు, ఇలా ఏవి పనికి రావు అనుకుంటామో వాటితో కళా ఖండాలు తయారు చేసి ప్రదర్శించారు. ఆమె రూపొందించిన ప్రతి కళారూపం అందరినీ ఆకటుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను డాక్టర్ అమీర్‌జాన్ ప్రారంభించారు. రచయిత్రిలు చంద్రలత, గోవిందరాజు సుభద్రాదేవి, పాతూరి అన్నపూర్ణ, వినయ, ఆర్టిస్టు సుందర్, విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాకారిణిని డాక్టర్ లక్ష్మీసుహాసినీని సన్మానించారు.



# నేత్రదానంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత
- ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు

మోటివేటర్లతో డీఎంహెచ్‌వో



నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం ఆవశ్యకత ను గుర్తించి గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. సోమవారం నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం డీఎం హెచ్‌వో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుజాతతో పాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ మేనేజర్ డాక్టర్ శార్వాణి మాట్లాడారు. అవయవ దానాల్లో నేత్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అన్ని అవయవాలు బాగున్నా నేత్రాలు లేనిదే ప్రకృతిని చూడ లేమన్నారు. అలాంటి పరిస్థితిలో నేత్రదాతలు ఇచ్చే నేత్రాల వల్లే ఎందరికో చూపు వస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో నేత్రదానం కోసం ఎదురు చూస్తు న్న ఎందరికో మృతి చెందిన వారి నేత్రాలు దానం చేస్తే చూపు వస్తుందని చెప్పారు. దీనికి కుటుంబ సభ్యులు చూపుతున్న ఆదరణ మరెం దరికో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్నియా (నల్లగుడ్డు) వ్యాధితో ఎంతో మంది కనుచూపు కోల్పోతూ అంధులవుతున్నారన్నారు. గతంలో 40 ఏళ్లపై బడిన వారు కార్నియా వ్యాధితో అంధులు అవుతుండగా, ప్రస్తుతం చిన్న పిల్లలను సైతం ఈ సమస్య వెంటాడు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి నేత్రదాతల నేత్రాలే అమర్చాలని, అయితే అవసరానికి తగ్గట్టు నేత్రదాతలు ముందుకు రావడం లేదని, కేవలం 20 శాతం మాత్రమే అంగీకారం తెలుపుతున్నారన్నారు. దీంతో సమస్య తీవ్రతరం అవుతోందని, మూఢ నమ్మకాలు సైతం నేత్రదానంకు అనేక అవరోధాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం నేత్ర దాన మోటివేటర్లు వైవీ సుబ్బారావు, పీఎంపీ అసోసియేషన్ నేత వేణుగోపాల్, చిరం జీవి ఐ బ్యాంకు సుధీర్, వాసవి క్లబ్ భయ్యాప్రసాద్, దేవళ్ల శ్రీనివాసులు, మన సేవాసన్నిధి, శ్రీవాణి, హేమలత, అభయ ఆర్గనైజేషన్, వాసవి వనిత, తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

# నానో... ఎంతో మేలు !

- ఆ ఎరువులపై రైతులకు అవగాహన అవసరం
- పెట్టుబడితోపాటు శ్రమ కూడా తక్కువే
- ఎక్కడికైనా ఇట్టే తీసుకెళ్లవచ్చు



డ్రోన్ ద్వారా నానో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు అన్నదాతలు ఎంతో శ్రమిస్తారు. అందుకు అవసరమైన ఎరువుల కోసం నానా అగచాట్లు పడతారు. ఇదే అవకాశంగా భావించి కొందరు వ్యాపారులు అధిక ధరలకు అమ్మడంతోపాటు నకిలీ ఎరువులను రైతులకు అంటగడుతున్నారు. అంతేకాక కొనుగోలు చేసిన ఎరువులను పొలాలకు తీసుకెళ్లడం మరో సమస్య. ఇందుకు రవాణా ఖర్చు అదనం. ఇవన్నీ కూడా రైతులకు ఇబ్బందులు కలిగించే అంశాలే. వీటి నుంచి వారికి ఉపశమనం కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'నానో' ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చాయి. తక్కువ ధరకు అందుబాటులో ఉండడంతోపాటు తీసుకెళ్లడం కూడా ఎంతో సులభంగా ఉంటుంది. ఆర్థిక భారం, శారీరక శ్రమ తగ్గుతాయి.

**ప్రయోజనాలెన్నో..**

మార్కెట్‌లో 45కేజీల యూరియా బస్తా ధర రూ.266. డిమాండ్ ఉన్న సమయంలో సుమారుగా రూ.350ల వరకు పలుకుతోంది. ఇక ఇంటికి తీసుకెళ్లేందుకు రవా ణా ఖర్చులు అదనం. రైతు లు ఎకరాకు ఒక బస్తాను వాడేస్తున్నారు. అయితే 500మి.లీ నానో యూరియా బాటిల్ రూ.225లకే అందుబాటులో ఉంది. దీన్ని మోయాల్సిన అవసరం లేదు. రవాణా ఖర్చు ఉండదు. చేతిలో పట్టుకుని ఎక్కడికయినా తీసుకువెళ్లవచ్చు. ఇంకా ఇది పంటకు స్ప్రే చేస్తే మొక్కకు పూర్తిస్థాయిలో అందుతుంది. అంతేకాక ఎకరాకు ఒక బాటిల్ సరిపోతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇకపోతే డీఏపీ బస్తా దాదాపుగా రూ.1350 నుంచి రూ.1400 వరకు ఉంటుంది. అదే డీఏపీ నానో బాటిల్ రూ.600లకే అందుబాటులో ఉంది.

**అవగాహన అవసరం**

జిల్లాలో రబీ, ఖరీఫ్ సీజన్లలో సుమారుగా 8లక్షల ఎకరాల్లో వివిధ పైర్లను రైతులు సాగు చేస్తారు. ఇందులో 6లక్షల ఎకరాలకు పైగా వరి సాగవుతుందని అంచనా. వరి సాగు చేస్తున్న రైతులకు యూరియా, డీఏపీ ఎంతో అవసరం. అధికారులు సిఫార్సు చేసిన మోతాదు కంటే ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో ఏటేటా పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఈఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 4137 మెట్రిక్ టన్నుల యూరియా, 2812 మెట్రిక్ టన్నుల డీఏపీ వినియోగించినట్లు వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఎరువుల వినియోగం సమయానికి నీరు అందుబాటులో లేకపోయినా, నీరు ఎక్కువైనా పంటలకు చల్లిన ఎరువులు వృథా కావాల్సిందే. అయితే నానో ఎరువుల వాడకం వల్ల ఈ సమస్య ఉండదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వీటిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. నానో ఎరువులను వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**అవగాహన కల్పిస్తున్నాం**

నానో యూరియా, డీఏపీ ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంతోపాటు వివిధ కార్యక్రమాల్లో నానో ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేస్తున్నాం. నానో ఎరువులపై జిల్లాలోని వ్యవసాయాధికారులకు శిక్షణ కూడా ఇచ్చాం.

- పీ.సత్యవాణి, డీఏవో

## కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్ఎస్ఏ నాయకులు



కలెక్టర్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏ పీఆర్ఎస్ఏ) కార్యవర్గ నాయకులు సోమవారం కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ గౌరవం పెరిగేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు బొబ్బా మురళి పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలకు పరిష్కారం ఎప్పుడో?

- పీజీఆర్ఎస్‌కు రికార్డు స్థాయిలో 515 అర్జీలు
- రెవెన్యూశాఖకు చెందినవే 221 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సంబంధ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మండలస్థాయిలో వాటికి పరిష్కారం కలగకపోవడంతో కలెక్టరేట్‌కు అర్జీదారులు పోటెత్తుతున్నారు. ప్రతి సోమవారం ఒకటి కాదు, రెండు కాదు వందల సంఖ్యలో రెవెన్యూ సంబంధ అర్జీలు వస్తున్నాయంటే పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో అర్థమవుతోంది. మండల స్థాయిలోనే రెవెన్యూ సమస్యలను పరిష్కరించా లని, ఒక వేళ సమస్యలను పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేక పోతున్నారో కారణాన్ని అర్జీదారులకు తెలియ చేయాలని కలెక్టర్ సూచి స్తున్నా అది ఆచరణకు నోచుకోవడం లేదని స్పష్టమవు తోంది. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రికార్డు స్థాయిలో మొత్తం 515 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 221 అర్జీలు ఉన్నాయి. సర్వేశాఖకు 31 అర్జీ లు వచ్చాయి. మిగిలినవి వివిధ శాఖలకు సంబంధించిన వి ఉన్నాయి. ఈ అర్జీలను స్వీకరించిన కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నిర్దిష్ట గడువులోగా పరిష్కరించా లని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్జీల పట్ల మానవ త్వంతో కూడిన సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నా రు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో విజయకుమా ర్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భూమికి హద్దులు చూపించాలి**

జిల్లాలోని కలువాయి మండలం చింతలాత్మకూరుకు చెందిన ఎస్.నిరంజన్ తన భూమికి హద్దులు చూపించాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలాత్మ కూరు సర్వే నెంబరు 32-సి1లో 30 సెంట్ల భూమి తనకు ఉందని చెప్పారు. మా గ్రామా నికి చెందిన శివశంకర్ భార్య వైదేహి ఈ భూమిని ఆక్రమించు కుని నాపైన దౌర్జన్యం చేస్తోంద ని ఆరోపించారు. నా భూమికి హద్దులు చూపించాలని కోరారు.

**సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి**

నెల్లూరు(వైద్యం) : మనుబోలు మండలం కాగితాలపూరులో ఇనాం మిగుల భూమిలో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద బాధితులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. 25 ఏళ్లుగా ఇనాం భూములను 180 మంది ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు వరి సాగు చేస్తున్నాయన్నారు. అయితే అధికార పార్టీకి చెందిన కొందరు ఆ భూమి వారసులమంటూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలు తలారి దేవదానం, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ జీ.కృష్ణకాంత్ అధికారులను ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వాసుల నుంచి 109 ఫిర్యాదులు వచ్చారు. వీటిని స్వీకరించిన ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజరు శ్రీనివాసులురెడ్డి, మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అసైన్‌మెంట్ భూముల్లో జామాయిల్ కర్ర నరికివేత

అడ్డుకున్న గ్రామస్థులు

ఉదయగిరి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో అసైన్‌మెంట్ భూముల్లో జామాయిల్ కర్ర నరికివేతను సోమవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. వివరాల మేరకు.. తిరుమలాపురం గ్రామంలో కొందరు పేదలకు గతంలో ప్రభుత్వం అసైన్‌మెంట్ భూములను మంజూరు చేసింది. వాటిని కొందరు రైతులు జామాయిల్ సాగు చేసుకునేందుకు పదేళ్ల లీజు కింద ఓ వ్యక్తికి అప్పగించారు. కాగా, లీజుకు తీసుకున్న వ్యక్తి పొలాల్లో జామాయిల్ సాగు చేపట్టాడు. అయితే రీసర్వేలో భాగంగా పొలాల హద్దులు మారిపోయాయి. కొందరు రైతులకు ఏపుగా జామాయిల్ పెరిగిన భూములు దక్కగా, మరి కొందరికి జామాయిల్ చెట్లు సరిగాలేని పొలా లు దక్కాయి. దీంతో జామాయిల్ ఎక్కువగా పెరిగి ఉన్న రైతులు లీజు తీసుకున్న వ్యక్తి జా మాయిల్ చెట్లను నరికిస్తుండగా అడ్డుకున్నారు. తమ పొలాల్లో తమ అనుమతి లేకుండా చెట్లు ఎలా నరుకుతారని అడ్డుకున్నారు. అనం తరం వీఆర్వో రాజేష్‌కు గ్రామస్థులు సమాచా రం అందించడంతో ఆయన అక్కడికి చేరుకుని రైతులందరూ హద్దులు ఏర్పాటు చేసుకునే వరకు జామాయిల్ నరకవద్దని అక్కడనుంచి కూలీలను పంపించివేశారు.

## రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కావలి రూరల్, సెపెటంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందిన ఘటన సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఉదయగిరి బ్రిడ్జి వద్ద జరిగింది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి- పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు లోకోపైలెట్ అందించిన సమాచారం మేరకు జీఆర్పీ ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చెన్నై సెంట్రల్ నుండి ఒంగోలుకు తీసుకున్న రైలు టికెట్ ఉండటంతో ఒంగోలు ప్రాంతానికి చెందిన వ్యక్తి అయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు చొక్కా, పిస్తా గ్రీన్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. మృతుని నడుముకు నేవీ బ్లూరంగు బెల్టు, ఛాతీపై గతంలో ఆపరేషన్ చేసిన గుర్తులతో పాటు వీపుపై పెద్ద కణిత ఉంది. మృతుడు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు.

## మోటార్ స్టార్టర్ దగ్ధం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని కట్టకిందపల్లి హరిజనవాడలో రక్షిత మంచినీటి పథకం మోటార్‌కు సంబంధించిన స్టార్టర్ సోమవారం తెల్లవారుజామున దగ్ధమైంది. స్టార్టర్ షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైందా లేదా ఎవరైనా కావాలని దగ్ధం చేశారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేసి పంచాయతీ కార్యదర్శి షేక్ నజీముల్లా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంచినీటి సమస్య తలెత్తకుండా కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు.

## హిజ్రాలకు నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు కార్డు కలిగి ఉండి, ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు చదువుకుని 18 నుంచి 28 ఏళ్ల వయస్సు కలిగిన హిజ్రాలకు పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధిపై ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విభిన్నప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు ఏ.మహమ్మద్ ఆయూబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా జాతీయ స్థాయిలో ఐటీ, ఐటీఈఎస్ రంగాలలో ఉపాధి అవకాశాలను పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. వివరాలకు 7993723291ను, నగరంలోని వనంతోపులో ఉన్న తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## విద్యారంగ సమస్యలపై 12న చలో కలెక్టరేట్

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.సునీల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను సోమవారం నగరంలోని వీఆర్‌సీ సెంటర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు తిష్టవేయడంతోపాటు విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే జీవోలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కళాశాలల్లో సమస్యలు, సంక్షేమ వసతి గృహాల్లో ఇబ్బందులు, గురుకులాలు, కస్తూర్బా విద్యాలయాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయలు, ఖాళీగా ఉన్న విద్యారంగం పోస్టుల భర్తీ, తదితర సమస్యలపై పోరాటాలకు సిద్ధమయ్యామన్నారు. ఈ సమస్యలన్నింటిని ప్రశ్నిస్తూ చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి విద్యార్థు లు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కే.షారూఖ్‌ఖాన్, నేతలు కే.ఆశీర్వాదం, చరణ్, సాయి, తాహిర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## కండలేరు డ్యాం ఇన్‌ఫ్లో 6వేల క్యూసెక్కులు

రాపూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 42.050 టీఎంసీలు ఉందని ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 6వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా 1125 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో వెళ్తుందని అధికారులు పేర్కొన్నారు

# టీకాల అమల్లో పురోగతి

- లక్ష్యసాధనలో సత్ఫలితాలు
- 90 శాతం టార్గెట్లు పూర్తి
- పల్స్‌పోలియో తరహాలో నిర్వహణ
- గ్రామాల్లో ప్రచారం, అవగాహన అవసరం



చిన్నారికి టీకా వేస్తున్న నర్సు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బిడ్డ పుట్టగానే వివిధ రకాల వ్యాధులు ప్రబలకుండా వెంటనే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అవయవలోపాలతోపాటు ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. వీటిని తప్పనిసరిగా అమలు చేయాలంటూ ప్రభుత్వం కూడా నిబంధనలు విధించింది. గతంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్నారులకు వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలు పూర్తి చేయటంపై అధికారులు శ్రద్ధ పెట్టారు. ఫలితంగా 95 శాతం లక్ష్యాలు పూర్తయ్యాయి. జిల్లాలో ఏటా 3.26 లక్షల మంది చిన్నారులకు నిర్ధేశించిన కాలానికి అనుగుణంగా టీకాలు వేయాల్సి ఉంది. ఆ దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అయితే గ్రామాల్లో ప్రచారం చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

**కొరవడిన పర్యవేక్షణ**

బిడ్డ పుట్టినప్పటి నుంచి 60 నెలల వరకు పోలియో చుక్కలతోపాటు క్షయ, మసూచి, ధనుర్వాతం, కోరింతదగ్గు, కంఠసర్పిలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. ఆయా జిల్లా ఆసుపత్రులతోపాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌ల పరిధిలో వీటిని అమలు చేయాలి. ప్రతి బుధ శనివారాల్లో వైద్యసిబ్బంది గ్రామాల్లో తిరిగి గుర్తించిన పిల్లలకు టీకాలు వేయాలి. ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు టీకాల పంపిణీ చేపట్టాల్సి ఉంది. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా టీకాల అమలుపై అనేక సందేహాలు రేకెత్తుతున్నాయి. గ్రామీణ స్థాయిలో చిన్నారులను పూర్తిగా పరిశీలించి వారికి అవసరమైన అన్ని టీకాలను వేయాల్సి ఉంది.

**అవగాహన కల్పించాలి**

ఏటా పోలియో వ్యాధికి మాత్రం రూ.లక్షలు ఖర్చు చేసి విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అయితే మిగిలిన వ్యాధులపై ప్రచారం, అవగాహనలో మాత్రం చేతులెత్తేస్తున్నారు. కనీసం ఈ టీకా వేసుకుంటే ఈ వ్యాధులు రావని, తప్పనిసరిగా వేయించుకోండని ప్రచారం చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగినా టీకాలు సక్రమంగా ఎప్పుడెప్పుడు వేసుకోవాలో చెప్పరు. మెదడువాపు వ్యాధి రాకుండా ఎంతో విలువైన వ్యాక్సిన్‌ను చైనా నుంచి దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం మెదడువాపు వ్యాధి వచ్చే కాలం అయినా దీనిపై ప్రజలకు అవగాహన కల్పించరు.

**టీకాల అమలుకు కృషి**



జిల్లాలోని ప్రతీ చిన్నారికి ఎనిమిది రకాల వ్యాధి నిరోధక టీకాలు వేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది జీరో డోస్ ఓపీవీ వ్యాక్సిన్‌లోపాటు అన్నీ రకాల టీకాలను 95 శాతం వేశాం. ఎక్కడెక్కడ చిన్నారులు ఉన్నారో గుర్తించి టీకాలు వేస్తు న్నాం. ప్రతి పీహెచ్‌సీని తనిఖీ చేసి టీకాలు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి